


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 163

శనివారం 2-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సేవాపథం





దేవాన్షి యాదవ్

పద్నాలుగు సంవత్సరాల వయసులో యాసిడ్ దాడికి గురైంది ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దేవాన్షీ యాదవ్. తాను బాధితురాలిగా ఉన్నప్పుడు ఒంటరి. ఇప్పుడు మాత్రం తానే ఒక సైన్యం. ‘షాహీద్ రామాశ్రయ్ వెల్ఫేర్ సోసైటీ’ అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టి న్యాయసహాయం అందించడం నుంచి ఉపాధి అవకాశాలు కల్పించడం వరకు బాధితుల కోసం ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న దేవాన్షి గురించి...

ధైర్యం పలికిన పేరు... దేవాన్షి

కష్టాలన్నీ కలిసికట్టుగా వచ్చాయా! అన్నట్లుగా దేవాన్షీ యాదవ్ నెలల వయసులో ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. పద్నాలుగు సంవత్సరాల వయసులో కుటుంబ స్నేహితుడిగా భావించే ఒకడు లైంగిక వేధింపులకు, యాసిడ్ దాడికి పాల్పడ్డాడు.

చుట్టుపక్కల వాళ్లు, బంధువులు మాత్రం దేవాన్షినే బోనులో నిలబెట్టారు.

‘మన జాగ్రత్తలో మనం ఉంటే ఇలాంటివి జరగవు కదా’ లాంటి మాటలు తనను ఎంతో బాధ పెట్టాయి.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ పట్టణానికి చెందిన 31 సంవత్సరాల దేవాన్షి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇలాంటి కష్టాలెన్నో కనిపిస్తాయి. అయితే వాటిని గుర్తు చేసుకుంటూ బాధను గుండెలో పెట్టుకోలేదు. తనలాంటి కష్టాలు వచ్చిన వారికి అండగా నిలబడాలనుకుంది. అలా మొదలైందే ‘షాహీద్ రామాశ్రయ్ వెల్ఫేర్ సొసైటీ’ అనే స్వచ్ఛంద సంస్థ.

లైంగిక వేధింపులకు గురవుతున్న వారి నుంచి గృహహింస బాధితుల వరకు ఎంతోమందికి ఈ సంస్థ తరపున అండగా నిలబడింది దేవాన్షి.

‘ధైర్యసాహసాలలో మా అమ్మే నాకు స్ఫూర్తి. నాకు తొమ్మిది నెలలు ఉన్నప్పుడు నాన్న చనిపోయాడు. ఒకవైపు భర్త చనిపోయిన బాధ, మరో వైపు బిడ్డను ఎలా పోషించాలనే బాధ, అయోమయం ఆమెను చుట్టుముట్టాయి. ఆరోజు ఆమె ధైర్యం కోల్పోయి ఉంటే ఈ రోజు నేను ఉండేదాన్ని కాదు. జీవితంలో ప్రతి సందర్భంలో ధైర్యంతో ముందుకు వెళ్లింది. తల్లిగా ప్రేమానురాగాలను పంచడమే కాదు ధైర్యం అనే విలువైన బహుమతిని ఇచ్చింది’ అంటుంది దేవాన్షి.

భారమైన జ్ఞాపకాల నుంచి బయటికి రావడానికి, శక్తిమంతం కావడానికి సామాజిక సేవా కార్యక్రమాలు దేవాన్షికి ఎంతో ఉపయోగపడ్డాయి.

దేవాన్షి దగ్గరకు సహాయం కోసం వచ్చే బాధితుల్లో ఏ కోశానా ధైర్యం కనిపించదు. అలాంటి వారిలో ధైర్యం నింపడం అనేది తాను చేసే మొదటి పని. తనని కుటుంబ సభ్యురాలిగా భావించుకునేలా ఆత్మీయంగా ఉండడం రెండో పని. కౌన్సెలింగ్ ద్వారా వారికి భవిష్యత్ పట్ల ఆశ రేకెత్తించడం మూడోపని.

‘ఈ సమాజం నన్ను చిన్నచూపు చూస్తుంది. నాకు ఎవరూ అండగా లేరు’ అనుకున్న ఎంతోమందికి ‘నాకు ఎవరి అండా అక్కర్లేదు. ఒంటరిగా పోరాడగలను. నా కోసం నేను పోరాడలేనా!’ అనే ధైర్యాన్ని ఇచ్చింది.

‘ఇంకేముంది నా భవిష్యత్ బుగ్గిపాలు అయింది’ అని జీవనాసక్తి కోల్పోయిన వారిలో ‘కష్టాలు నీ ఒక్కరికే కాదు. అందరికీ వస్తాయి. అదిగో నీ భవిష్యత్’ అంటూ ఆశావాహ దృక్పథాన్ని కలిగించింది.

‘పదా... పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేద్దాం’ అని దేవాన్షి అన్నప్పుడు...

‘అమ్మో! నాకు పోలీస్ స్టేషన్ అంటే భయం’ అన్నది ఒక బాధితురాలు.

‘తప్పు చేసిన వాడు హాయిగా తిరుగుతున్నాడు. ఏ తప్పూ చేయని నువ్వెందుకు భయపడడం’ అని దేవాన్షి అనగానే ఆ బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు బయలు దేరింది. ఇలాంటి సంఘటనలు ఎన్నో!

సంస్థ అడుగులు మొదలుపెట్టిన కొత్తలో... ‘మీవల్ల ఏమవుతుంది’ అన్నట్లుగా ఎంతోమంది వ్యంగ్యంగా మాట్లాడే వారు.

వారికి తన పనితీరుతోనే సమాధానం ఇచ్చింది దేవాన్షి.

‘దేవాన్షీ చాలా పట్టుదల గల వ్యక్తి. ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఒక్క అడుగు కూడా వెనక్కి వెయ్యదు. భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక నేను దేవాన్షి దగ్గరకు వచ్చాను. ఆమె నాకు ఆశ్రయం ఇచ్చింది. విషయం తెలుసుకున్న అత్తింటి వారు దేవాన్షిని బెదిరించడానికి వీధిరౌడీలను పంపించారు. ఆమె ధైర్యాన్ని చూసి వారు తోక ముడవడానికి ఎంతో సమయం పట్టలేదు’ అంటుంది బరేలీకి చెందిన రత్న.

బరేలీ పట్టణానికి చెందిన వారే కాదు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఎంతోమంది మహిళలు దేవాన్షి సహాయం కోసం రావడం ప్రారంభించారు.

‘మా దగ్గరకు వచ్చేవాళ్లలో 60 నుంచి 70 శాతం గృహహింస బాధితులే. వారికి అండగా నిలిచినప్పుడు సహజంగానే బెదిరింపులు ఎదురయ్యాయి. అయితే నేను వాటిని ఎప్పుడూ ఖాతరు చేయలేదు. మీకు ఇంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది? అనే ప్రశ్న అడుగుతుంటారు. ఒకప్పుడు నేను మీలాగే భయపడేదాన్ని... అంటూ నాకు ఎదురైన చేదు అనుభవాలను వారితో పంచుకుంటాను. అమ్మ నుంచి ధైర్యం ఎలా పొందానో చెబుతాను. ధైర్యం అనేది ఒకరు దయతో ఇచ్చేది కాదు. అది అందరిలోనూ ఉంటుంది. దాన్ని ఉపయోగించుకుంటున్నామా? లేదా? అనేదే ముఖ్యం అని చెబుతుంటాను’ అంటుంది దేవాన్షీ యాదవ్.

‘అత్తింటి బాధలు తట్టుకోలేక బయటికి వచ్చాను. ఇప్పుడు నేను ఒంటరిగా ఎలా బతకగలను’ అని దిక్కులు చూస్తున్న ఎంతోమందికి సంస్థ ద్వారా దిక్కు చూపించి సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది. బాల్యవివాహాలు జరగకుండా అడ్డుపడింది.

‘మంచిపని చేస్తే ఆ ఫలితం తాలూకు ఆనందమే కాదు అపారమైన శక్తి కూడా లభిస్తుంది. ఆ శక్తి మరిన్ని మంచిపనులు చేయడానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది’ అంటుంది దేవాన్షీ యాదవ్.

తరగతి గది దేశ భవితను నిర్ణయిస్తుంది.
ఇంగ్లిష్ భాష అభివృద్ధిని నిర్ణయిస్తోంది.
ఇంగ్లిష్ రాకపోతే పురోభివృద్ధి దరి చేరనంటోంది.
గ్రామాల్లో పిల్లలు ఇంగ్లిష్‌లో మెరికలు కావాలంటే...
వాళ్లకు చదువు చెప్పే గురువులకు మెళకువలు నేర్పాలి.
‘చక్కటి ఇంగ్లిష్ వచ్చిన తెలంగాణ సాధనే నా లక్ష్యం’...
అంటున్నారు టీచర్లకు పాఠాలు చెప్తున్న ఈ ఇంగ్లిష్ టీచర్.

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా..

గురుబోధకుడు

ఇంగ్లిష్ టీచర్



రామేశ్వర్ గౌడ్

‘మంచి ఇంగ్లిష్ రావాలంటే పెద్ద కార్పొరేట్ స్కూల్‌లో చదవాలి. నిజమా! నిజమే కావచ్చు. పెద్ద స్కూల్లో చదివిన పిల్లలు నోరు తెరిస్తే ఇంగ్లిషే వినిపిస్తుంది’. సమాజంలో స్థిరపడిపోయి ఉన్న ఒక అభిప్రాయం అది.‘నాకు రెండేళ్ల టైమివ్వండి, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి చేత చక్కటి ఉచ్చారణ, వ్యాకరణ సహితంగా మంచి బ్రిటిష్ ఇంగ్లిష్ మాట్లాడిస్తాను’ అంటున్నారు రామేశ్వర్ గౌడ్. ‘లక్షల సంఖ్యలో ఉన్న విద్యార్థులందరి దగ్గరకు నేను వెళ్లలేను, కాబట్టి ఆ విద్యార్థులకు పాఠాలు చెప్పే టీచర్లకు ఇంగ్లిష్‌లో బోధించడంలో మెళకువలు నేర్పిస్తాను అవకాశం ఇవ్వండి’ అన్నాడు. ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రంలోని 14 జిల్లాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధించారు. ‘నేను నిర్దేశించుకున్న సమయం మరో ఒక టిన్నర ఏడాది ఉంది. కానీ ఈ లోపే లక్ష్యాన్ని చేరగలననే నమ్మకం కలుగుతోంది’ అన్నారు రామేశ్వర్ గౌడ్ టీచర్స్ డే సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ.

శ్రద్ధగా నటించాను!

రామేశ్వర్ గౌడ్ సొంతూరు షాద్‌నగర్ సమీపంలో నందిగామ. పాఠశాల విద్య తర్వాత హైదరాబాద్‌కి వచ్చారు. బీఎస్సీ కంప్యూటర్స్ తర్వాత ఉన్నత చదువులకు ఆస్ట్రేలియా వెళ్లాలనుకున్నారు. ఐల్ట్స్ పూర్తి చేసి విదేశాల్లో చదవగలిగిన అర్హత సంపాదించిన తర్వాత మనసు మార్చుకున్నట్లు తెలియచేశారాయన. ‘‘చిన్నప్పటి నుంచి నేను మంచి మాటకారిని. నాకు తెలిసిన విషయాన్ని వివరంగా చెప్పగలిగిన కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా ఉండేవి. ఐల్ట్స్ (ఐఈఎల్‌టీఎస్, ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్) క్లాసులకు ఏడుగురం ఫ్రెండ్స్ కలిసి వెళ్లాం. క్లాసులో విన్న తర్వాత డౌట్స్ అడిగేవాళ్లు నా ఫ్రెండ్స్. వాళ్లకు వివరిస్తూ ఉన్న క్రమంలో చదువు చెప్పడంలో గొప్ప థ్రిల్ ఉందనిపించింది. అలాగే నన్ను వెంటాడుతూ ఉన్న మరికొన్ని అంశాలు కూడా నా నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. అవి ఏమిటంటే... కాలేజ్‌లో చేరినప్పటి నుంచి ఒక నరకంలోనే జీవించాను. లెక్చరర్‌లు ఇంగ్లిష్‌లో పాఠాలు చెప్తుంటే సరిగా అర్థమయ్యేవి కావు. దిక్కులు చూస్తే ...లేపి ప్రశ్న అడుగుతారేమోననే భయంతో శ్రద్ధగా పాఠం వింటున్నట్లు నటించేవాడిని. నా కాలేజ్ చదువంతా బొటాబొటి మార్కులతోనే సాగింది. నేను ఇంటర్వ్యూలకు వెళ్లి, నా వంతు కోసం ఎదురు చూస్తున్న సమయంలో నా లాగ ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్లు మాట్లాడుతున్న ఇంగ్లిష్‌కి భయపడి ‘ఈ ఉద్యోగం నాకేం వస్తుంది’... అని ఇంటర్వ్యూకి హాజరు కాకుండానే వెనక్కి వచ్చిన సందర్భాలున్నాయి. భాష రాకపోవడం వల్ల ఒక జాతి మొత్తం మూల్యం చెల్లించుకుంటోందా అని ఆవేదన కలిగింది. అప్పటికే వీసా కోసం పాస్‌పోర్టును డ్రాప్ బాక్స్‌లో వేసి ఉన్నాను. అలాంటి సమయంలో మా ఐల్ట్స్ సర్ సురేందర్ రెడ్డితో ‘నేను ఆస్ట్రేలియాకి వెళ్లను. ఇక్కడే ఉండి ఇంగ్లిష్ పాఠాలు చెబుతాను’ అని చెప్పినప్పుడు ఆయన ఆశ్చర్యపోయారు. నా ఆలోచన తెలిసిన తర్వాత అభినందించారు. ఇక 2007లో తార్నాకలో చిన్న గదిలో ఆరువేల అద్దెతో నా ఇన్‌స్టిట్యూట్ ‘విల్ టూ కెన్, ద స్లైడ్’ మొదలైంది. విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించడం మొదలుపెట్టాను. తర్వాత నా ఇన్‌స్టిట్యూట్‌ని అమీర్‌పేటకు మార్చాను. అదంతా నేను ఆర్థికంగా స్థిరపడడానికి. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఉచితంగా పాఠం చెప్పడానికి అనుమతులు సంపాదించగలిగాను.

వాళ్లకు ఇంగ్లిష్ వచ్చు... కానీ!

నా పాఠాలు వినే ఉపాధ్యాయులందరూ ఇంగ్లిష్ వచ్చిన వాళ్లే. కానీ ఇంగ్లిష్‌లో పాఠం చెప్పడంలో శిక్షణ పొందిన వాళ్లు కాదు. మనకు ఇంగ్లిష్ భాషను నేర్పించే మెథడాలజీ రూపొందలేదు. దాంతో ఉపాధ్యాయులకు–విద్యార్థులకు మధ్య పెద్ద అగాధం ఏర్పడుతోంది. ఆ ఖాళీని నేను భర్తీ చేశాను. తెలుగు అర్థమై, ఇంగ్లిష్ చదవడం, రాయడం వచ్చి ఉంటే చాలు. అనర్గళంగా మాట్లాడించగలిగిన టీచింగ్ మెథడాలజీ రూపొందించాను. టీచర్లకు నేను చెప్తున్న పాఠాలు ఆ మెథడాలజీనే. ఎనభైమూడు వేల మంది టీచర్లున్న రాష్ట్రంలో ఆరు నెలల్లో ముప్పైవేల మంది పూర్తయ్యారు. ఇక్కడ మరో విషయాన్ని చెప్పాలి. కరోనా కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. అప్పుడు సమాజం వర్చువల్ విధానంలోకి మారిపోయింది. నేనిప్పుడు బాచుపల్లిలో నా ఇంట్లో కూర్చుని జూమ్ ద్వారా ఏకకాలంలో వేలాదిమందికి పాఠం చెప్పగలుగుతున్నాను. నలభై ఐదు రోజుల సెషన్‌లో ఒకసారి మాత్రం ఆయా జిల్లాలకు వెళ్లి స్వయంగా ఇంటరాక్ట్ అవుతున్నాను. ‘రియల్ లైఫ్ ఇంగ్లిష్, స్పోకెన్ ఇంగ్లిష్’ అని రెండు పుస్తకాలు రాశాను.

గురువు జ్ఞానాన్ని దాచుకోకూడదు!

ఈ సందర్భంగా నేను చెప్పేదొక్కటే... ‘నేను నూటికి నూరుపాళ్లూ పర్‌ఫెక్ట్ అని చెప్పడం లేదు, నాకు తెలిసిన జ్ఞానాన్ని నూరుశాతం పంచుతున్నాను. టీచర్‌కి ఉండాల్సిన ప్రథమ లక్షణం అదే’’ అన్నారు రామేశ్వర్ గౌడ్. నిజమే... గురువు జ్ఞానాన్ని తనలో దాచుకోకూడదు, విస్తరింపచేయాలి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

మా వాళ్లది ధర్మాగ్రహమే!

ఆస్ట్రేలియాకు వెళ్లకుండా ఇక్కడ పాఠాలు చెప్పడం వల్ల నేను కోల్పోయిందేమీ లేదు. డబ్బు పరంగా కొంత తగ్గి ఉండవచ్చు. డాక్టర్‌లు, డిఫెన్స్ రంగాలకు మినహా సినిమా, రాజకీయరంగం, న్యాయరంగం... అనేక రంగాల్లో నిష్ణాతులకు పాఠాలు చెప్పడంతో సెలబ్రిటీ టీచర్‌గా మంచి గుర్తింపు వచ్చింది. ప్రభుత్వ టీచర్లకు ఉచిత పాఠాల ద్వారా వచ్చిన గౌరవం నాకు సంతృప్తినిస్తోంది. అలాగని నా జర్నీ అలవోకగా సాగలేదు. సక్సెస్ శిఖరానికి చేరేలోపు నేను పొందిన అవమానాలు కూడా చిన్నవేమీ కావు. నా నిర్ణయం తెలిసిన వెంటనే నా ఫ్రెండ్స్ ‘వీడు లైఫ్‌ని కరాబు చేసుకుంటుండు... ఆంటీ’ అని మా అమ్మతో అన్నారు. మా అమ్మ చాలా బాధపడింది. ఎంత చెప్పినా వినలేదని బాధపడి నాతో మాట్లాడడం మానేసింది. ఐదుగురం అన్నదమ్ములం. నలుగురూ నన్ను కోపంగా చూసేవారు. చాలా రోజులు మౌనయుద్ధం చేశారు. ఇంట్లో ఉండలేక వేరే గదిలోకి మారిపోయాను. వాళ్ల కోపం ధర్మాగ్రహమే. నా సంకల్పం అర్థమైన తర్వాత అందరూ సపోర్ట్‌గా నిలిచారు. నా భార్య రచన, పిల్లలు కూడా నా క్లాసుల నిర్వహణలో వాళ్లు చేయగలిగిన సహాయం చేస్తున్నారు. ఆ రకంగా నేను అదృష్టవంతుడిని.

– ఎ. రామేశ్వర్ గౌడ్, ఫౌండర్, విల్ టూ కెన్, హైదరాబాద్



బ్యూటిప్స్

కొబ్బరి పాలతో మృదువుగా..

చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతూ ఉండాలంటే కొబ్బరిపాలు మేలైన ఎంపిక.



- కొబ్బరి పాలను రాత్రిపూట పడుకునేముందు తలకు పట్టించి, షవర్ క్యాప్ వేసుకోవాలి. మరుసటి రోజు ఉదయం షాంపూతో తలస్నానం చేయాలి. కొబ్బరి పాలు వెంట్రుకల కుదుళ్లకు చేరి, శిరోజాల మృదుత్వం దెబ్బతినదు.
- పచ్చి కొబ్బరిని తురిమి, మిక్సీలో గ్రైండ్ చేసి, పాలు తీయాలి. ఈ పాలను చర్మానికంతటా పట్టించి, అరగంట ఆగి, చల్లని నీటితో స్నానం చేయాలి. చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌లా పని చేసి, ముడతలు తగ్గి, మృదువుగా మారిపోతుంది.



- ఎండలో నుంచి ఇంటికి వెళ్లినప్పుడు ఫ్రిజ్‌లో ఉంచిన కొబ్బరి పాలను, దూదితో ఒళ్లంతా రాసుకొని, పది నిమిషాలు సేదదీరాలి. తర్వాత స్నానం చేస్తే ఎండవల్ల కమిలిన చర్మానికి ఉపశమనం లభిస్తుంది. మృదువుగా, కాంతిమంతంగా తయారవుతుంది.

న్యూస్‌మేకర్

**కామెడీ చేసే స్త్రీలు తక్కువ.
దానికి కారణం ఎప్పటి నుంచో
స్త్రీల నవ్వు మీద అదుపు ఉండటమే.
నవ్వని స్త్రీలు ఎదుటి వారిని ఏం నవ్విస్తారు?
థ్యాంక్స్ టు స్టాండప్ కామెడీ.
ఇటీవల కొంతమంది స్టాండప్ కామెడీలో
పేరు గడిస్తున్నారు.
ముంబై కమెడియన్ ఉరుజ్ అష్ఫాక్
ఏకంగా ఈడెన్‌బర్గ్ కామెడీ అవార్డును
గెలుచుకుంది.
ఈ అవార్డు ఇలా భారతీయులకు రావడం
ఇదే మొదటిసారి.**

కామెడీ క్వీన్



ఉరుజ్ అష్ఫాక్

‘ఈడెన్ బర్గ్ కామెడీ అవార్డ్స్’ను కామెడీ ఆస్కార్‌గా భావిస్తారు. అందువల్ల 28 ఏళ్ల ఉరుజ్ అష్ఫాక్ 2023 సంవత్సరానికి ‘బెస్ట్ న్యూకమర్’ అవార్డును గెల్చుకోవడం చాలా పెద్ద విషయంగా చెప్పుకోవాలి. ప్రతి సంవత్సరం ఈడెన్‌బర్గ్‌లో జరిగే జులై, ఆగస్టుల్లో జరిగే ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఒక రకంగా సంప్రదాయ ఫెస్టివల్స్ మీద తిరుగుబాటు లాంటిది. ఇక్కడ ఎంట్రీలు, ఎగ్జిట్‌లు ఉండవు. ఎవరైనా వచ్చి తమ కళను ప్రదర్శించవచ్చు. అందుకే ప్రపంచవ్యాప్త కళకారులు భారీగా తరలివచ్చి తమ కళలను ప్రదర్శిస్తుంటారు. వాటిని చూడటానికి జనం పోటెత్తుతారు. ఈ సందర్భంగానే కామెడీ అవార్డ్స్ ఇస్తారు.

ఈసారి ఉరుజ్ అష్ఫాక్ చేసే ‘ఓ... నో’ అనే షో బెస్ట్ న్యూ కమర్ అవార్డ్ గెల్చుకుంది. భారతీయులలో అందునా స్త్రీలలో ఇలా అవార్డు గెలుచుకున్నవారు ఇంతకు మునుపు లేరు.

అబూదాబి నుంచి

ఉరుజ్ అష్ఫాక్ అబూదాబిలో పుట్టి పెరిగి స్వదేశమైన భారత్‌కు తల్లిదండ్రులతో పాటు 12 ఏళ్ల వయసులో తిరిగి వచ్చింది. ఆ తర్వాత చదువంతా ముంబైలో సాగించింది. చిన్నప్పటి నుంచి చాలా మాటకారి అయిన ఉరుజ్ సైకాలజీలో డిగ్రీ చేశాక 2014 నుంచి స్టాండప్ కామెడీ చేయడం మొదలెట్టింది. స్టాండప్ కామెడీ అప్పుడప్పుడే ఒక ఉపాధిగా మారుతున్నా అది మగవాళ్ల వ్యవహారంగానే ఉండింది. అందువల్ల ఆమెకు కంటెంట్ రాసే పని ఎక్కువగా దొరికేది తప్ప షో దొరికేది కాదు. అయినప్పటికీ ఉరుజ్ చిన్నా చితకా సందర్భాలలో దొరికిన సమయంలో నవ్వించే ప్రయత్నం చేసేది. అయితే 2017 కేవలం మహిళా స్టాండప్ కమెడియన్స్ కోసం నిర్వహించిన ‘క్వీన్స్ ఆఫ్ కామెడీ’లో ఉరుజ్ చేసిన కామెడీ విపరీతంగా గుర్తింపు పొందింది. ఇక ఆమె వెను తిరిగి చూళ్లేదు.

మైక్రోఫోనే ఆయుధం

స్టాండప్ కామెడీ చేసేవాళ్ల దగ్గర మైక్రోఫోన్ తప్ప వేరే ఆయుధం ఉండదు. ఆ మైక్రోఫోన్‌లో వారు పలికే ప్రతి మాట ఎదురుగా ఉన్న ఆడియెన్స్‌ను వ్యంగ్యంగా, పదునుగా తాకి హాస్యం పుట్టించాలి. అయితే ఇక్కడ మనోభావాలు దెబ్బ తీయకూడదు. అలాగే పిచ్చి జోకులు వేయకూడదు. అలా చేస్తే నవ్వు కాస్త నవ్వుల పాలవుతుంది. అయితే ఉరుజ్ ప్రత్యేకత ఏమిటంటే ఆమె చాలా వేగంగా మాట్లాడుతూ సందర్భానికి తగినట్టుగా పంచ్ వేసి ఆకట్టుకుంటుంది. ఆమెవన్నీ స్వీయ జీవితంలోని సంఘటనలే. వాటినే చెప్తూ నవ్విస్తుంది. ముఖ్యంగా ఈ కాలంలోని మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో చెప్తే అందరూ భుజాలు తడుముకుంటూ వింటారు. ‘క్యాజువల్ రిలేషన్‌షిప్స్’ పేరుతో ఈకాలపు స్త్రీ–పురుష సంబంధాలను ఆమె విమర్శించే తీరు ఆలోచింప చేసింది. తనను తాను నాస్తికురాలిగా చెప్పుకునే ఉరుజ్ నిర్బంధ సంప్రదాయాలపై కూడా జోకులు పేల్చడం కద్దు. ‘మర్యాదస్తులను ఒక్కోసారి చిన్నబుచ్చడానికి వెనుకాడను. సరిహద్దుల్లోనే ఉంటే హాస్యం పుట్టదు. గీత దాటాలి’ అనే ఉరుజ్ కత్తి మీద సాము వంటి హాస్యంలో ఒక స్త్రీగా రాణిస్తూ ఉండటం కచ్చితంగా మెచ్చుకోవాల్సిన సంగతి.

ఇంటిప్స్



- గోరు వెచ్చని పాలల్లో రెండు టీస్పూన్ల పెరుగు వేసి కలపాలి. పాలల్లో ఈ మిశ్రమం వేసి, వడలను వేసి ఐదారుగంటలు నానపెడితే పెరుగు చక్కగా తోడుకుంటుంది. ఇప్పుడు ఈ వడలకు తాలింపు వేసి తింటే పెరుగు వడలు చాలా రుచిగా ఉంటాయి. పెరుగు లేనప్పుడు ఇలా చేస్తే పెరుగు పులవకుండా పెరుగు వడలు రుచిగా వస్తాయి.



- వేడినీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేసి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.



- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్డసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది.



- అప్పడాలు, వడియాలు, పల్లీలు, కరివేపాకు వంటివి నూనె ఎక్కువ పీల్చకుండా డీప్‌ఫ్రై చేయాలంటే.. ముందుగా వాటిని ఇనుప జాలీ గరిటలో వేసి గరిటను కాగిన నూనెలో ముంచుతూ పైకి లేపుతూ ఫ్రై చేయాలి. ఇలా చేస్తే నూనె తక్కువగా పీల్చడంతో పాటు క్రిస్పీగా, రుచిగా వస్తాయి.



- పకోడి, బజ్జీల పిండి కలిపేటప్పుడు పదార్థాలన్నివేసి కలుపుకున్నాక... చివరల్లో వంటసోడా కలపాలి. ఇలా కలపడం వల్ల బజ్జీలు నూనె తక్కువగా పీల్చడం తోపాటు మంచి రంగులో కనిపిస్తాయి.


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 163

శనివారం 2-9-2023



రెండు నెలల్లో అతిపెద్ద లాభం

సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు.. 19,400 స్థాయి పైకి నిఫ్టీ

- 15లో



భారత్ ✘ పాకిస్తాన్

ఆసియా కప్ వన్డే టోర్నీలో భాగంగా నేడు పల్లెకెలెలో ఇరు జట్ల మధ్య పోరు

- 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆయన ఆశయం అందరి దరహాసం

రాజకీయాలను సంపాదనా మార్గంగా భావించే వారికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితం చెంపపెట్టు.

- వివరాలు 4లో



నేడే పీఎస్ఎల్‌వీ సీ57 ప్రయోగం

సూర్యుడిపై పరిశోధన సాగించే ఆదిత్య–ఎల్ 1 ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. నేటి ఉదయం 11.50కి దీన్ని ప్రయోగిస్తారు.

- వివరాలు 6లో



మాజీ ఎంపీకి జీవిత ఖైదు

1995లో జరిగిన జంటహత్యల కేసుల్లో లోక్‌సభ మాజీ ఎంపీ ప్రభునాథ్ సింగ్ (70)కు సుప్రీంకోర్టు జీవితఖైదు విధించింది.

- వివరాలు 6లో



పాక్‌లో ఆత్మాహుతి దాడి

పాక్‌లో గురువారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 9 మంది సైనికులు మృతిచెందారు. దాడికి తామే కారణమని టీటీపీ ప్రకటించుకుంది.

- వివరాలు 6లో

'జమిలి'పై కమిటీ


మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో 16 మంది సభ్యులతో ఏర్పాటు

- 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికే..
- విధివిధానాలు, గడువుపై త్వరలో ప్రకటన చేయనున్న కేంద్రం
- నిపుణులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తెలుసుకోనున్న కమిటీ
- కోవింద్‌తో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా భేటీ.. కమిటీ కూర్పుపై చర్చ
- జమిలి ఎన్నికలపై ఏదో ఒకటి తేల్చేయాలని మోదీ సర్కారు పట్టుదల
- పార్లమెంట్ ప్రత్యేక భేటీలో కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం
- 12 రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగొచ్చని ప్రచారం
- ఈ నెల 22న ఎంపీల చివరి ఫొటో సెషన్‌కు మొదలైన ఏర్పాట్లు



'సమాఖ్య'కు విఘాతం: విపక్షాలు

'జమిలి'పై రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి స్పందించింది. కేంద్ర ప్రభుత్వ ఆలోచనను తప్పుపట్టింది. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయొద్దని డిమాండ్ చేసింది. రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ అనేది ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు.



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగిపోయింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలపై ఓవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కార్యాచరణ సిద్ధం చేస్తుండగా, మరోవైపు ముందస్తు ఎన్నికల ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం పదును పెడుతోంది. ఈ నెల 18 నుంచి 5 రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించి ముందస్తు ఎన్నికల అంశాన్ని కేంద్రం ఇప్పటికే తెరపైకి తీసుకొచ్చింది. దానికి మరింత బలం చేకూర్చేలా 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. జమిలి ఎన్నికల అంశాన్ని తేల్చడానికి 16 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించింది. కమిటీ విధివిధానాలు, గడువుపై

మిగతా 6వ పేజీలో ▶

తరచూ ఎన్నికలతో నష్టమే..

దేశంలో 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నిర్వహించాల్సిన అవసరం ఉందని రామ్‌నాథ్ కోవింద్ గతంలో పలు సందర్భాల్లో చెప్పారు. ''తరచూ దేశంలో ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతుండడంతో మానవ వనరులపై భారం పడుతోంది. ఎన్నికల వ్యయం పెరిగిపోతోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది'' అని 2018లో పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో కోవింద్ చెప్పారు. 2014 మేలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే దేశం–ఒకే ఎన్నికపై చర్చ ప్రారంభమైంది. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా అవుతాయని లా కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. దీంతోపాటు అభివృద్ధి పనులకు ఆటంకాలు ఉండవని వెల్లడించింది. దేశంలో 1967 దాకా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. మోదీ ప్రభుత్వ పదవీ కాలం మరికొన్ని నెలల్లో ముగియనుంది. జమిలి ఎన్నికల వ్యవహారాన్ని ఇంకా సాగదీయకుండా ఏదో ఒకటి తేల్చేయాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది.

జమిలి ఎన్నికల దారిలో 5 రాజ్యాంగ సవరణలు

6లో

కలిసే పోటీ...

విపక్ష 'ఇండియా' కూటమి నేతల తీర్మానం



ముంబైలో సమావేశమైన 'ఇండియా' కూటమి నేతలు

- 14 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు
- ఇచ్చి పుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలి
- సీట్ల పంపకం ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి
- 'ఇస్రో'ను ప్రశంసిస్తూ మరో తీర్మానం ఆమోదం
- 140 కోట్ల మంది మావైపు ఆశగా చూస్తున్నారు
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడి

6లో

ముంబైలో 'ఇండియా' కూటమి రెండు రోజుల సమావేశం శుక్రవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాడాలని, 'జుడేగా భారత్, జీతేగా భారత్' అనే థీమ్‌తో వివిధ భాషల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం చేసి ఆమోదించారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు షురూ!

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

10,000	58,000
మంది పదోన్నతులకు..	మంది బదిలీలకు అర్హులని ఓ లెక్క

- 5 వరకూ దరఖాస్తుకు అవకాశం
- 7 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల పరిశీలన
- 12న సీనియారిటీ జాబితా వెల్లడి
- అక్టోబర్ 3న బదిలీల ఉత్తర్వులు
- విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ రూపొందించింది. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. 6, 7 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీలను డీఈవో కార్యాలయంలో నేరుగా అందించాల్సి ఉంటుంది. ఈ నెల 12, 13 తేదీల్లో అన్ని జిల్లాల్లోనూ సీనియారిటీ జాబితాలను ప్రదర్శిస్తారు. సెప్టెంబర్ 15న ఆన్‌లైన్‌లోనే ప్రధానోపాధ్యాయుల బదిలీలు చేపడతారు. ఆ తర్వాత

మిగతా 11వ పేజీలో ▶

'కార్నింగ్' పెట్టుబడి రూ. 934 కోట్లు

అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో భేటీలో కార్నింగ్ ప్రతినిధి బృందం నిర్ణయం

- వివరాలు 2లో

గాంధీ మార్గంలో తెలంగాణ

- స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీఎం కేసీఆర్
- సమీకృత, సమ్మిళిత, సమగ్ర అభివృద్ధితో దేశానికే దిక్సూచిగా తెలంగాణ మోడల్
- సంక్షేమం, అభివృద్ధి రెండూ సమపాళ్లలో అమలు చేస్తున్నాం
- సకల జనులకు ప్రగతి ఫలాలు పంచడమే స్వాతంత్య్రోద్యమానికి నిజమైన నిర్వచనమని వ్యాఖ్య
- హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఘనంగా వేడుకలు

5లో


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

బాబూ! ఆ డబ్బెక్కడిది?

- ఆ రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా పరిగణిస్తే తప్పేంటి?
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఐటీ శాఖ నోటీసులు
- ఆగస్టు 4నే జారీ చేసినట్లు వెల్లడించిన హిందుస్థాన్ టైమ్స్ పత్రిక
- గతంలోనే బాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో ఐటీ శాఖ సోదాలు

6లో

మచ్చుకు రూ. 2,000 కోట్లు


ఐటీ నోటీసులకు సంబంధించి చంద్రబాబు అవినీతిపై 2020 ఫిబ్రవరి 14న సాక్షి ప్రచురించిన కథనం

- కాంట్రాక్టు సంస్థల నుంచి చేతులు మారిన రూ.2,000 కోట్ల ముడుపులు.. అవి రకరకాల షెల్‌కంపెనీల నుంచి బాబుకు చేరినట్లుగా పత్రాల్లో వెల్లడి
- షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ నుంచి బాబుకు భారీగా ముడుపులు.. మనోజ్ పార్దసానికి చెందిన ఫినిక్స్ ఇన్‌ఫ్రా, పారా ట్రేడింగ్ షెల్ కంపెనీల ద్వారా తరలింపు
- బాబు అవినీతిలో ఆ 2,000 కోట్లు 'శాంపిల్' మాత్రమేనని వాపోతున్న జనం

13లో

క్లుప్తంగా...

డిక్లరేషన్ల పేరిట మోసం

ఎన్నికలు ఉన్నందునే కాంగ్రెస్ డ్రామాలు: మంత్రి కొప్పుల



సాక్షి, హైదరాబాద్: డిక్లరేషన్ల పేరిట దళితులు, గిరిజనులను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ఆ పార్టీకి ఓట్ల మీద తప్ప దళితుల మీద ప్రేమలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శాసనమండలిలో చీఫ్‌విప్ టి.భానుప్రసాద్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో శుక్రవారం ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బూటకమని, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో ఈ డిక్లరేషన్లు విడుదల చేయాలన్నారు. 50 ఏళ్లపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ దళిత, గిరిజనులను మోసం చేసిందని, వారి మాటలు నమ్మేంత అమాయకులు దళిత, గిరిజనులు కాదని చెప్పారు. వచ్చే ఎనిమిదేళ్లలో రాష్ట్రంలోని అన్ని దళిత కుటుంబాలకు దళితబంధు పథకం అమలవుతుందని, ఓపిక పట్టేందుకు దళితులు కూడా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

కాంగ్రెస్ తెచ్చిన రిజర్వేషన్లతోనే ఎమ్మెల్యేగా కొప్పుల ఎన్నిక

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈశ్వర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి మంత్రి అయ్యారంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల వల్లనే అనే విషయం తెలుసు కోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ దళితులు, గిరిజనులకు వ్యవసాయ భూములు, ఇళ్లు, సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసిన విషయం కొప్పులకు తెలియదా అని నిలదీశారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌తో దళితులు, గిరిజనుల నుంచి అనూహ్య స్పందన రావడంతో బీఆర్‌ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తులాభారం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌కు మేదరి సంఘం నాయకులు తులాభారం ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి నామినేషన్ డబ్బులు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మేదరి సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన శ్రీనివాస్‌గౌడ్‌కు భారీ క్రేన్ ద్వారా పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నిలువెత్తు బరువున్న రూపాయి నాణేలతో తులాభారం వేశారు. ఈ డబ్బులను వచ్చే ఎన్నికల్లో నామినేషన్ ఖర్చుల కోసం వినియోగించుకోవాలని మంత్రిని కోరారు. ఊహించని రీతిలో తనపై ఇంతటి అభిమానం ప్రదర్శించడం ఎప్పటికీ మర్చిపోలేనని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

4 నుంచి బీజేపీ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు సమర్పించాల్సిందిగా పార్టీ నిర్ణయించింది. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ పూర్తి వివరాలు, సమాచారంతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



అక్రమంగా వాళ్ల ప్రాంతాలు మన మ్యాప్‌లో చేర్చడం ఎందుకూ.. భయపడి వెళ్లకుండా ఉండటమెందుకు.. సార్!

'కార్నింగ్' పెట్టుబడి రూ.934 కోట్లు

- రాష్ట్రంలో గొరిల్లా గ్లాస్‌ల తయారీ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన దిగ్గజ సంస్థ
- హైదరాబాద్ కేంద్రంగా ప్లాంట్.. 800 మందికి ఉద్యోగావకాశాలు
- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో భేటీలో కార్నింగ్ ప్రతినిధి బృందం నిర్ణయం



కార్నింగ్ ప్రతినిధుల బృందంతో మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: మెటీరియల్స్ సైన్స్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కార్నింగ్ సంస్థ తెలంగాణలో రూ. 934 కోట్ల భారీ పెట్టుబడితో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేయబోయే ఈ ప్లాంట్ ద్వారా మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అవసరమైన గొరిల్లా గ్లాస్‌లను కార్నింగ్ తయారు చేయనుంది. 172 ఏళ్ల చరిత్రగల కార్నింగ్ తన తయారీ కేంద్రం ఏర్పాటు ద్వారా భారత్‌లో అడుగుపెట్టనుంది. ఈ భారీ పెట్టుబడితో 800 మందికిపైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో కార్నింగ్ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు జాన్ బెయిని ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్, అనుబంధ రంగాలకు తెలంగాణ హబ్‌గా మారుతున్న తీరును కేటీఆర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గత 9 ఏళ్లలో చేపట్టిన కార్యక్రమాలను తెలియజేశారు. యాపిల్ ఐఫోన్లను తయారు చేసే ఫాక్స్‌కాన్ సంస్థ భారీ ఎత్తున తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న విషయాన్ని, ప్రభుత్వ పాలసీలను ఆ సంస్థ ప్రశంసించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన కార్నింగ్ ప్రతినిధి బృందం.. తెలంగాణలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఉన్న వ్యాపార అనుకూలతలతోపాటు ఎలక్ట్రానిక్స్, అనుబంధ రంగాల్లో తయారీరంగ పెట్టుబడుల కోసం తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, ప్రోత్సాహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్రాన్ని ఎంచుకున్నట్లు కార్నింగ్ సంస్థ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. దీంతో కార్నింగ్ సంస్థకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. సంస్థ కార్యకలాపాల ప్రారంభానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో పెట్టుబడుల ద్వారా భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, తెలంగాణ యువతకు ఈ రంగంలో ఉద్యోగావకాశాలు రావడం తనకు అత్యంత సంతోషాన్ని ఇస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐటీ శాఖ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపురి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే | బీజేపీ జమిలి ఆలోచనలు

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు మాదే
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సాక్షి, హైదరాబాద్: ఓటమి భయంతోనే కేంద్రంలోని బీజేపీ జమిలి ఎన్నికల ఆలోచనలు చేస్తోందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుపు తమదేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తాజా సర్వేల్లో దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా బీజేపీ గెలిచే అవకాశా ల్లేవని పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపంపిణీకి సంబంధించి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలకు సంబంధించి విలే కరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఉన్నట్లుండి వేవ్ మార్చితే ఫలితాలు మారతాయని భ్రమ పడుతోందన్నారు. ఎన్నికలు ఎప్పుడైనా కేసీఆర్ సర్కార్ సిద్ధంగానే ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే 115 మంది అభ్యర్థులను నియమించిన పార్టీ తమదన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'బిల్లు పెడతారనే ప్రచారం జరుగుతోందన్నారు. దేశంలో మోదీ క్రేజ్ పడిపోయిందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందనే నివేదికలు ఆ పార్టీ వద్ద ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ రెంటికీ కలిపి ఎన్నికలు పెడితే తమకేమైనా లాభం కలుగుతుందనే యోచనలో బీజేపీ ఉందన్నారు. జమిలి ఎన్నికలంటే దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. నిర్ణీత షెడ్యూలు మేరకే ఎన్నికలు నిర్వహించాల్సిందిగా తాము ఈసీని కోరతామన్నారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు.

జమిలి ఎన్నికలకు మేము వ్యతిరేకం: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ విధానాలు దేశాన్ని ముక్కలు చేసేలా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. జమిలి ఎన్నికలకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ విషయంలో అవసరమైతే బీజేపీ అంతర్గత కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ముందస్తుకు వెళ్తే ఇంటికే పోతుందని జోస్యం చెప్పారు. దేశ ప్రజల దృష్టి మరల్చే రాజకీయాలు చేయడంలో ప్రధాని మోదీ ఘనుడని విమర్శించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు లీకులు ఇచ్చారని మండిపడ్డారు. జమిలి ఎన్నికలపై చర్చ జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారని.. ఏ ప్రక్రియ అయినా నిబంధనలను అనుసరించి నిర్వహించాలని సూచించారు. ఇండియా కూటమి అంటే బీజేపీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి బలపడే కంటే ముందుగానే జమిలి ఎన్నికలతో బీజేపీ బయటపడాలని చూస్తోందని ఆరోపించారు.

తెలంగాణ ప్రజల కోసం పీపుల్స్ జేఏసీ

- ఉద్యమ జేఏసీ ఇప్పటికీ కొనసాగితే రాష్ట్రం ఇలా అయ్యేది కాదు
- జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్



పంజగుట్ట: తెలంగాణ ఉద్యమ కాలంలో ఉన్న జేఏసీ అలానే కొనసాగి తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, అప్పటి ప్రజలు దేనికోసం పోరాడారో వాటి కోసం ఇప్పటికీ పోరాడితే ప్రస్తుత తెలంగాణ ఈ విధంగా ఉండేది కాదని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యానించారు. పాలకులను ప్రశ్నించేందుకు, ప్రజల్లో ప్రశ్నించేతత్వం పెంపొందించేందుకు తమ జేఏసీ పనిచేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ సామాజిక, ప్రజా సంఘాల కార్యకర్తలు, మేధావులు, విద్యావంతులు ఆగస్టు 27వ తేదీన సమావేశమై తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది కేవలం ఎన్నికల వరకే కాకుండా ఎన్నికల తర్వాత కూడా క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు. ఏ పార్టీ గెలిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు, వారిని ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హరగోపాల్ మీడియాతో మాట్లాడారు. జేఏసీ కన్వీనర్‌గా తాను కొనసాగుతుండగా, కో కన్వీనర్లుగా ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రొఫెసర్ సమున్నత, మైసా శ్రీనివాస్, కె.సజయ, సలీంపాషా, అంబటి నాగయ్య, కన్నెగంటి రవి ఉంటారని వెల్లడించారు. మొత్తం 42 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఉంటారని చెప్పారు.

తెలంగాణలో దౌర్భాగ్యమైన పరిస్థితి

'మన ప్రాంతం వారు అధికారంలోకి వచ్చాక మన ప్రాంతంపై, ప్రాంత ప్రజలపై ప్రేమ ఉంటుందని.. అందరం బాగుపడవచ్చునని తెలంగాణ రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరూ పోరాడారు. కానీ అది పొరపాటని తేలింది. ఏ సమస్య చూసినా తెలంగాణలో దౌర్భాగ్యమైన పరిస్థితి ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా నాశనం చేశారు. ఆఖరుకు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన టీఎన్‌జీవో కార్యాలయం కూడా మూసెయ్యడం అందుకు నిదర్శనం. ముఖ్యమంత్రి ఎవ్వరినీ కలవడు, మంత్రులు మా చేతుల్లో ఏం లేదంటారు, అధికారులు నిర్వీర్యమయ్యారు'అని హరగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ పల్లా బారి నుంచి మా భూముల్ని కాపాడండి

సీఎం కేసీఆర్‌కు బీబీనగర్ మండలం నెమరుగొముల బాధితుల విజ్ఞప్తి



పల్లా రాజేశ్వర్ రెడ్డి నుంచి తమ భూములు కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాధితులు

పంజగుట్ట: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తమ స్థలాలు కబ్జా చేసి గూండాలతో బెదిరిస్తున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధితులు బి.వెంకటేశ్, దమ్మటి శివయ్య, ఎస్.డి. బడేసాబ్, నరసింహాగౌడ్, శ్రీనివాస్, చిరంజీవి మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం నెమరుగొముల గ్రామంలోని సర్వే నంబర్ 154, 155, 157లో 16 ఎకరాల్లో అప్పటి జీపీఏ హోల్డర్ మహ్మద్ ఖాజాపాషా 1989లో లేఔట్ చేసి 286 ప్లాట్లు విక్రయించారని పేర్కొన్నారు. ఖాజాపాషా 2002లో మృతి చెందగా, 2005లో బుచ్చిదాస్ అనే వ్యక్తికి ఖాజాపాషా ఈ స్థలాలు అమ్మినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. ఇప్పటివరకు తెరవెనుక ఉన్న పల్లా వచ్చి ఈ భూములను కొనుగోలు చేశానని, వాటిని తన వర్సిటీలో కలుపుకొంటానని, ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫింగర్‌ప్రింట్ అధికారులు పరిశీలించి పల్లా వద్ద ఉన్న డాక్యుమెంట్లు ఫోర్జరీ అని తేల్చారని, ఎమ్మార్వో కూడా ఈ స్థలం అసలు హక్కుదారుడు ఖాజాపాషా అని నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసులకు పల్లాపై ఫిర్యాదు చేస్తే తామేమీ చేయలేమని అంటున్నారని విచారం వ్యక్తం చేశారు.

మోదీ ప్రభుత్వంలో రక్షణ లేని రాజ్యాంగం

రాష్ట్ర ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ కాంతం



కరీంనగర్: మోదీ ప్రభుత్వంలో రాజ్యాంగానికి రక్షణ కరువైందని రాష్ట్ర ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఆరోపించారు. దేశంలో తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకెళ్తోందని, దానికి కారణం కేసీఆర్ పాలనేనని ప్రశంసించారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని సెంట్రల్ కోర్టు హాల్‌లో మేధావుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్‌లో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో చలో కరీంనగర్ పేరున 15నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు కాంతం తెలిపారు.

సీఎం చిత్రపటానికి రక్త తిలకం

జనగామ టికెట్‌కు ఆప్కో మాజీ చైర్మన్ వేడుకోలు



కొమురవెల్లి (సిద్దిపేట): బీసీ నేతనైన తనకే జనగామ టికెట్ కేటాయించాలని కోరుతూ ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు సీఎం కేసీఆర్ చిత్రపటానికి రక్త తిలకం దిద్దారు. ఆయన శుక్ర వారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునాలయ రాజగోపురం ఎదుట బొటనవేలిని బ్లేడ్‌తో కోసుకొని సీఎం కేసీఆర్ చిత్రపటానికి రక్త తిలకం దిద్దారు. అంతకుముందు కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు కట్టారు. అనంతరం మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తే పార్టీలకతీతంగా గెలిపించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని చెప్పారు.

మీసం మెలేసిన కొండా.. తొడగొట్టిన ఇనగాల

- పరకాల కాంగ్రెస్ సమావేశంలో వర్గపోరు
- సమావేశం కాకుండానే వెళ్లిపోయిన పరిశీలకుడు దల్వీ



ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మీసం మెలేయగా.. మరో నేత ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తొడకొట్టడం.. ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు...వెరసి హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం ఆత్మకూర్ మండలం అగ్రంపహాడ్‌లోని జరిగిన సమావేశానికి పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దల్వీ హాజరయ్యారు. సమావేశం ప్రారంభంకాగానే మాజీ ఎమ్మెల్సీ కొండా, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి వర్గీయులు.. పోటాపోటీ నినాదాలు చేశారు. పీసీసీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ శోభారాణి కలగజేసుకుని వ్యక్తిగత నినాదాలు చేయొద్దని.. పార్టీ నినాదాలు, జాతీయ నేతల నినాదాలు చేయాలని చెప్పినా ఫలితం కనిపించలేదు. నినాదాలు చేస్తే పంపిస్తామని చెప్పినా కార్యకర్తలు శాంతించలేదు. దీంతో మధ్యలోనే దల్వీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడి వెళ్లిపోయారు. ఆయనతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు ఎర్ర బెల్లి స్వర్ణ, నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సిరి సిల్ల రాజయ్య బయటికి వెళ్లిపోవడంతో సమావేశం ముగిసింది. సమావేశప్రాంగణం బయట కొండా, ఇనగాల ఒకరినొకరు ఎదురు పడ్డారు. ఆ సమయంలో కొండా మీసం మెలేయడం, ఇనగాల తొడ గట్టడం చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికలకు ముందే కాంగ్రెస్ కాడి ఎత్తేసింది

షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై మంత్రి వేముల



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఆరోపణల్లో అభద్రతా భావం, నైరాశ్యం కనిపిస్తోంది. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ కాడెత్తేసింది. ఓటమి ఖాయం అయిందని నిర్ణయించుకొని అసత్య ఆరోపణలకు తెరలేపింది. ఎన్నికల్లో ఓటమి ఎరుగని కేసీఆర్ గురించి ఎనిమిదిసార్లు పోటీ చేస్తే ఆరుసార్లు ఓడిపోయిన షబ్బీర్ అలీ వ్యాఖ్యలు హాస్యాస్పదం'' అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తెలంగాణలో ఏ మూల నుంచి కేసీఆర్ పోటీ చేసినా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడతారన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేయాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులమంతా ఆయన్ను కలసి విజ్ఞప్తి చేస్తే అక్కడి నుంచి కూడా పోటీకి కేసీఆర్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌ను గెలిపించాలని నియోజకవర్గంలోని ఏకగ్రీవ తీర్మానాలు చేసుకుంటుంటే దాన్ని ఈసీకి షబ్బీర్ అలీ ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

ఆ పోలీసుల పేర్లను రాసి పెట్టండి.. అధికారంలోకి రాగానే సంగతి చూద్దాం

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- పోలీసులు బీజేపీ శ్రేణులను వేధిస్తున్నారని ఆగ్రహం
- ఖబడ్దార్ కేసీఆర్..నిన్ను ఇంటికి పంపించడం ఖాయమని హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న డీకే అరుణ. చిత్రంలో రఘునందన్‌రావు, రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తోందని, బీజేపీ నేతలను అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. గులాబీ కండువాలు కప్పుకున్న కార్యకర్తల మాదిరిగా కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా తమపై కక్ష సాధింపునకు పాల్పడుతున్న పోలీసు అధికారుల పేర్లను బీజేపీ కార్యకర్తలు రాసిపెట్టుకోవాలని కోరారు. 'వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. అతి చేసిన పోలీసుల రుణం ఏ మాత్రం ఉంచుకోకుండా వారి సంగతి చూద్దాం ..వారి లెక్కలు సరిచేద్దాం' అని ఆమె వ్యాఖ్యానించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడారు. 'సీఎం కేసీఆర్‌కు ఎందుకింత భయం? అరెస్టులతో భయపెట్టాలని చూస్తున్నారా? మీ బెదిరింపులకు బీజేపీ భయపడదు. గత ఎన్నికల్లోనూ పోలీసులతోనే గెలిచామని, రాబోయే ఎన్నికల్లో కూడా గెలుస్తామనే అహంకారంతో ఉన్న మిమ్మల్ని భరించే ప్రసక్తే లేదు.. ఖబడ్దార్ కేసీఆర్.. నిన్ను ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు రోజులు లెక్క పెడుతున్నారు'' అని ఆమె వ్యాఖ్యానించారు.

వెంకటరమణారెడ్డిని ఎందుకు అరెస్టు చేశారు?

కామారెడ్డిలో జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డిని అరెస్ట్ చేసి రోజంతా ఎక్కడెక్కడో తిప్పారని, అసలు ఆయనను ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పాలని పోలీసులను డీకే అరుణ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గజ్వేల్ అభివృద్ధి మాదిరే కామారెడ్డి కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పడంతో గజ్వేల్ అభివృద్ధిని చూసివద్దామని అనుకున్న వెంకటరమణారెడ్డిని అక్కడకు వెళ్లకుండా అక్రమంగా అడ్డుకున్నారని విమర్శించారు. 'సీఎం కేసీఆర్ గజ్వేల్ ను నిజంగా అభివృద్ధి చేస్తే అయనను ఎందుకు అరెస్ట్ చేశారు? అక్కడ అభివృద్ధి జరగలేదనే విషయం బయట పడుతుందని భయపడ్డారా?' అని ప్రశ్నించారు. గజ్వేల్ ఏమీ కేసీఆర్ ఫామ్‌హౌజ్ కాదు కదా... అని ఆమె నిలదీశారు. వెంటనే వెంకటరమణా రెడ్డిని విడుదల చేసి గజ్వేల్ అభివృద్ధిని చూసేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ భూములన్నీ వెంచర్లుగా మార్చిన చరిత్ర కేసీఆర్‌దేనని ఆరోపించారు.

నన్ను ఎమ్మెల్యేగా గుర్తించండి..

శాసనసభా కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి డీకే అరుణ వినతి

సాక్షి, హైదరాబాద్: తనను గద్వాల ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని శాసనసభా కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)లకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డిలతో కలిసి అరుణ కోర్టు ఉత్తర్వు కాపీలతో అసెంబ్లీకి వచ్చారు. ఆ సమయంలో అసెంబ్లీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో జాయింట్ సెక్రటరీకి కోర్టు ఉత్తర్వులు అందజేసి అవి అందినట్టుగా అక్‌నాలెడ్జ్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన సర్టిఫైడ్ ఆదేశాల ప్రతిని సమర్పించేందుకు స్పీకర్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదని చెప్పారు. దీంతో అసెంబ్లీ కార్యదర్శికి ఆ ప్రతిని అందజేసేందుకు రాగా, ప్రతిరోజూ కార్యాలయంలో అందుబాటులో ఉండే ఆయన ఆఫీసుకు రాక పోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అనంతరం సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి తనను ఎమ్మెల్యేగా పరిగణిస్తూ ఆ సమాచారాన్ని అసెంబ్లీకి, ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.

ముందస్తుకు వెళ్లే ఆలోచనే లేదు

- విపక్షాలకు ఎన్నికల జ్వరం పట్టుకుంది
- సెప్టెంబర్ 16న తెలంగాణలో జిల్లా, మండలస్థాయిల్లో బైక్ ర్యాలీలు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచనే లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. దేశంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా..ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. విపక్షాలకు ముందస్తు ఎన్నికల జ్వరం పట్టుకుందని, ఇండియా కూటమి ఒక మిథ్య అని వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలతో ప్రజాధనం వృథా అయ్యే అవకాశం తగ్గుతుందని.. అందుకే జమిలి ఎన్నికలు నిర్వహించాలనేది ప్రధాని ఆలోచన అని వివరించారు. దీనికి సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఆమోదించడం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ధరల తగ్గింపుపై ప్రతిపక్ష పార్టీల రాజకీయాలు సరికాదని.. ప్రజల మేలుకోరే గ్యాస్ ధర తగ్గించినట్టు చెప్పారు. ప్రధాని జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 17న, తెలంగాణలో ఈ నెల 16న ఓబీసీ మోర్చా నేతృత్వంలో జిల్లా, మండల స్థాయిల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

బీజేపీ 'చలో గజ్వేల్' భగ్నం

అరెస్టులతో కామారెడ్డిలో ఉద్రిక్తత



కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ వద్ద రఘునందన్‌రావును అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట జరిగిన వనరుల విధ్వంసాన్ని ప్రజలకు చూపించడం కోసం బీజేపీ చేపట్టిన 'చలో గజ్వేల్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డిని ఒకరోజు ముందుగానే గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేసి బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం నుంచి భారీసంఖ్యలో బీజేపీ శ్రేణులు వెంకటరమణారెడ్డి ఇంటికి తరలిరాగా, వారిని కూడా పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లారు. దీంతో జిల్లాకేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంకటరమణారెడ్డి అరెస్టును నిరసిస్తూ బిచ్కుంద పోలీస్‌స్టేషన్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు ఆందోళన చేశారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆందోళన చేపట్టారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు కారులో హైదరాబాద్ నుంచి బిచ్కుంద పోలీసుస్టేషన్‌కు బయలుదేరగా పెద్దకొడప్‌గల్ మండలకేంద్రం శివారులో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన నడుచుకుంటూ పెద్దకొడప్ గల్‌కు చేరుకుని రెండుగంటలపాటు నిరీక్షించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీమంత్రి ఈటల రాజేందర్‌కు ఆయన ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితిని వివరించారు. పోలీసులు సాయంత్రం వెంకట రమణారెడ్డిని విడిచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లో అక్రమాలు వెలుగులోకి వస్తాయని, సీఎం చెబుతున్న అభివృద్ధికి సంబంధించిన గుట్టు రట్టవుతుందన్న ఉద్దేశంతోనే తనను అడ్డుకున్నారని ఆరోపించారు.

ఆ గ్రామాల్లో తీర్మానాలు | ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధం

- సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపిన సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్‌ను ఎన్నుకోవాలని కోరుతూ ఆ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు తీర్మానాలు చేయడం ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు తమ లెటర్‌హెడ్‌ల మీద తీర్మానాలు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లపై చర్యలు తీసుకుని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ మాజీమంత్రి షబ్బీర్ అలీ, సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) వికాస్ రాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు అందజేశారు. సీఎం కేసీఆర్ గత నెల 21న 115 మంది బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా, అధికార దుర్వినియోగం చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మాచారెడ్డి మండలంలోని కొన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు లెటర్‌హెడ్‌లపై సీఎం కేసీఆర్ అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతూ తీర్మానాలు చేయడం ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇలా తీర్మానాలు చేయడం పట్ల ఎమ్మెల్సీ కె.కవిత హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్‌లు చేశారనే విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. కవితపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వారు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు.



JioMart
మీ ప్రతీ నెల గ్రాసరీ షాపింగ్‌పై
50% వరకు తగ్గింపు పొందండి
#ShoppingAisaIndiaJaisa
ఇప్పుడు జియో మార్ట్ నుండి వాట్సాప్ ద్వారా ఆర్డర్ చేయండి
QR కోడ్ స్కాన్ చేయండి లేదా 'Shop now from JioMart' అని 79770 79770 కి పంపండి
7 MAX SAVING DAYS
1-7 సెప్టెంబర్
₹2500* ఆర్డర్ విలువపై ఫ్లాట్ 5% తగ్గింపు
నియమ నిబంధనలు వర్తిస్తాయి
కూపన్ కోడ్ GROSEP5
SMART BAZAAR NOW ON JioMart
DAILY GROCERIES
Daawat Rozana Basmati Rice 5 kg + Saffola Oil 3 L
Our Price ₹749
MRP ₹1250
Healthy Heart Refined Sunflower Oil 1 L
Our Price ₹99
MRP ₹168
Parrys White Label Sugar 5 kg
Our Price ₹209
MRP ₹215
Chakki Atta 5 kg
Our Price ₹181
MRP ₹270
Eastern Spices Range
Up to 25% Off
Besan/Maida/Sooji 500 g/1 kg
Up to 50% Off
Almonds 500 g and Walnuts 1000 g
Starting at ₹329
MRP Starting at ₹660
Cashew 500 g and Dates 800 g
Starting at ₹249
MRP Starting at ₹500
Red Rose XXXL Biryani Basmati Rice 5 kg
Our Price ₹549
MRP ₹1299
Ghee
Starting at ₹449/L
Navjeevan Jeera 500 g
Our Price ₹350
MRP ₹670
Olive Oil
Starting at ₹299/L
PACKAGED FOOD
Biscuits and Cookies
Up to 50% Off
Kellogg's Moons & Stars Chocos Cereal 1.2 kg
50% Off Our Price ₹360
MRP ₹720
Wingreens Farms Premium Veg Mayo 800 g
50% Off Our Price ₹112
MRP ₹225
Boost 500 g (Pack of 2)
Save ₹120 Our Price ₹495
MRP ₹615
Saffola Honey 1 kg
40% Off Our Price ₹285
MRP ₹475
Tata Chakra Gold Premium Tea 500 g (Carton)
Save ₹60 Our Price ₹330
MRP ₹390
HOME & PERSONAL CARE
Surf Excel Easy Wash Detergent Powder 5 kg
33% Off Our Price ₹515
MRP ₹770
Shampoo and Conditioner
Up to 50% Off
Face Wash
Up to 50% Off
Deodorants
Up to 50% Off
Colgate Visible White Toothpaste 100 g (Pack of 2)
33% Off Our Price ₹214
MRP ₹320
Sofy Sanitary Napkin (Super XL+) 44 Pads
33% Off Our Price ₹295
MRP ₹440
10% INSTANT DISCOUNT*
AU SMALL FINANCE BANK
Bank of Baroda Credit Card
bob World Debit
IndusInd Bank
YES BANK
Terms & Conditions Apply. Offer valid till stocks last and all offers are subject to change without prior intimation/notice. The pictures/photographs of the products shown are for representation purposes only. MRP of all products are inclusive of all taxes. Unless specified, the retail prices shown are for 1 unit of the product. All offers are valid till 7th September 2023. All disputes are subject to the exclusive jurisdiction of the courts in Mumbai only.
SAATCHI & SAATCHI



సంక్షేమ పథకాల అమలే సర్కారు పనితీరుకు కొలమానం.
– వై.ఎస్. రాజశేఖర రెడ్డి

సాక్షి
శనివారం, 2 సెప్టెంబర్ 2023

'జమిలి' సర్వరోగ నివారిణా?

జమిలి ఎన్నికలపై చర్చ సద్దుమణిగిందని అనుకున్నప్పుడల్లా అది మళ్లీ మళ్లీ రాజుకోవటం ఏడెనిమిదేళ్లుగా రివాజైంది. కానీ ఈసారి ఉన్నట్టుండి అందుకు సంబంధించి తొలి అడుగుపడింది. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రక టించింది. కమిటీ విధివిధానాలు, అందులో ఉండే నిపుణుల వివరాలు ఇంకా తెలియాల్సేవున్నా ఇండియా కూటమి సమావేశాల్లో తీరిక లేకుండావున్న విపక్షాలకు ఇది ఊహించని పరిణామం. పార్లమెంటుకూ, అసెంబ్లీలకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలనీ, అందువల్ల ఎంతో ప్రజాధనం ఆదా అవుతుందనీ ఆ విధానాన్ని సమర్థిస్తున్నవారు చెబుతున్నారు. అంతేకాదు, తరచు ఎన్నికలవల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నదని కూడా వారి వాదన. కానీ ఈ రకమైన వాదనలను కొట్టిపారేస్తున్నవారు కూడా గణనీయంగానే ఉన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడ ఆటంకం ఏర్పడిందో చూపాలని సవాలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలోనో, మరే అత్యవసర సందర్భాల్లోనో ప్రభుత్వాలను ఎన్నికల సంఘం నిరోధించిన దాఖలాలు లేవు. కాకపోతే ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఉద్దేశించే పథకాలను మాత్రం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రకటించకుండా ఆపుతున్నారు. అందువల్ల జనం నష్టపోయారని చెప్పడానికి ఎటువంటి దాఖలాలూ లేవు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీల ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాలను కూడా ఈ చట్రంలోకి తీసుకురావటమే కేంద్రం ఉద్దేశం. 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' అన్న నినాదం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచీ వినిపిస్తోంది. అంతక్రితం 2003లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఈ విషయంలో కొంత ప్రయత్నం చేశారు. అప్పటి కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీతో ఆయన చర్చించారు. కానీ ఎందుకనో తదుపరి చర్యలేమీ లేవు. జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోని లా కమిషన్ సమర్పించిన 170వ నివేదిక సైతం చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంకా వెనక్కు వెళ్తే 1983లో కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈమాటే చెప్పింది. అయితే రాజ్యాంగ సవరణ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ, చట్టసభల నియమ నిబంధనల సవరణ వగైరాలు చేయకుండా జమిలి ఎన్నికలు సాధ్యంకాదని 2018లో జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలోని లా కమిషన్ తన ముసాయిదా నివేదికలో అభిప్రాయపడింది. ఒక ఏడాది వేర్వేరు నెలల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలన్నిటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం ఉత్తమమని సూచించింది.

దేశంలో జమిలి ఎన్నికలు 1952 నుంచి 1967 వరకూ జరిగాయి. కానీ దానికి తూట్లు పొడిచింది కేంద్రంలోని పాలకులే. అప్పటి నెహ్రూ సర్కారు 1959 జూలైలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలోని తొలి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని 356వ అధికరణ ప్రయోగించి బర్తరఫ్ చేసింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చక్కదిద్దేవరకూ ఆ అధికరణ దశాబ్దాలపాటు దుర్వినియోగం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించే ధోరణి వెర్రితలలు వేసి ప్రభుత్వాలు కుప్పకూలాయి. అసెంబ్లీలు రద్దయ్యాయి. ఈ కారణాలన్నిటివల్లా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలది తలోదారీ అయింది. పాలక పార్టీలను చీల్చటం, చీలికవర్గంతో కొత్త ప్రభుత్వాలను ప్రతిష్ఠించటం రివాజైంది.

తరచు ఎన్నికల వల్ల ఖజానాకు తడిసిమోపెడు ఖర్చు అవుతున్నదన్నది వాస్తవం. దీనికితోడు రాజమార్గాల్లో, దొంగదారుల్లో ఎన్నికల జాతరకు వచ్చిపడే వేల కోట్ల రూపాయలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఉదాహరణకు 2009 సార్వత్రిక ఎన్నికలకు ఖజానాకు రూ. 1,115 కోట్లు ఖర్చయితే, 2014 నాటికి ఇది రూ. 3,870 కోట్లకు పడగలెత్తింది. ఇదంతా సర్కారుకయ్యే వ్యయం. పార్టీలూ, అభ్యర్థులూ చేసే ఖర్చు ఇందుకు ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది. కానీ రోగం ఒకటైతే మందు మరొకటన్నట్టు ఈ సమస్యలకు జమిలి ఎన్నికలే పరిష్కారమని పాలకులు చేస్తున్న వాదన సరికాదు. ఎన్నికల్లో ధన ప్రభావం అరికట్టడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. ఎన్నికల విశ్వసనీయత పెంచటానికి దొంగ ఓట్లను అరికట్టడం అవసరం. అలవిమాలిన వాగ్దానాలతో ప్రజలను ఆకర్షించి, అధికారంలోకొచ్చాక వంచించే పార్టీలపై చర్యలు తీసుకోవటం అవసరం. కానీ జరిగిందేమిటి? అసలే పార్టీలు వెచ్చించే కోట్లాది రూపాయల సొమ్ము ఎక్కడిదో తెలిసే అవకాశంలేని ప్రస్తుత పరిస్థితిని మరింత జటిలం చేసేలా ఎన్నికల బాండ్ల విధానానికి తెరలేపారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' గొప్ప ఆదర్శంగా కనిపించవచ్చు. చూడదల్చుకున్నవారికి ఇందులో జాతీయతా భావన కూడా దర్శనమీయొచ్చు. కానీ ఎన్నికల ప్రక్షాళనకు ఇది దోహదపడేదెంత?

ఇంతకూ జమిలి ఎన్నికల విధానం అమలు చేయటం మొదలెట్టాక రాష్ట్రాల్లో గడువుకు ముందే అసెంబ్లీలు రద్దు చేయాల్సివస్తే ఏం చేస్తారు? 90వ దశకంలో మాదిరే కేంద్రంలోనే అస్థిరత ఏర్పడి లోక్‌సభ రద్దు చేయాల్సివస్తే మార్గం ఏమిటి? ఇవన్నీ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఎటూ పరిశీలిస్తుంది. ఇక రెండు చట్టసభలకూ ముడివేయటంవల్ల ఫెడరలిజం దెబ్బతింటుందనేవారూ... జాతీయ అంశాల ప్రాముఖ్యత పెరిగి స్థానిక అవసరాలు, ఆకాంక్షలు మరుగునపడతాయనేవారూ ఉన్నారు. అయితే 2019లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీల ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు వెలువడిన ఫలితాలు గమనిస్తే ఇది అర్ధ సత్యమే అనిపిస్తుంది. ఏదేమైనా జమిలి ఎన్నికల విధానంపై విస్తృతమైన చర్చకు చోటిచ్చి, అందులో వ్యక్తమయ్యే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి అడుగులు వేయాలి. తొందరపాటు పనికిరాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.తదియ రా.1.14 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.5.23 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె.4.44 నుండి 6.15 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.47 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** ప.12.51 నుండి 2.20 వరకు

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఆయన ఆశయం అందరి దరహాసం

రాజకీయాలను సంపాదనా మార్గంగా భావించే వారికి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితం చెంపపెట్టు. 'రూపాయి డాక్టర్'గా మూడు పదులు నిండని వయసులోనే తనదైన ముద్ర వేసిన వైఎస్ రాజకీయాల్లో ప్రవేశించి అప్రతిహత విజయాలను అందుకొన్నారు. రైతుకు నీటి సమస్యను తీర్చగలిగితే తన కాళ్లమీద తాను నిలబడి అందరికీ పట్టెడన్నం పెడతాడని నమ్మి ఏకంగా 'జలయజ్ఞం' చేశారు. అట్టడుగు వర్గాలకు ఉన్నత చదువులను అందిస్తే వారి తలరాత మారుతుందని 'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు శ్రీకారం చుట్టారు. 'ఆరోగ్య శ్రీ'తో సామాన్యునికి కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారు. సగటు మనిషి బతకడానికి కావలసిన అన్ని ఏర్పాట్లూ చేసి చిద్విలాసంగా వెళ్లిపోయారు!

మూర్తీభవించిన మానవత్వం

సందర్భం



ఎ. చంద్రశేఖర్ రెడ్డి

మానవత్వం మూర్తీభవించిన రాజకీయ నాయకుడు, ప్రజల మనిషి డాక్టర్ ఎడుగూరి సందింటి రాజశేఖర్ రెడ్డి. కడప జిల్లా జమ్మలమడుగు మిషనరీ ఆస్పత్రిలో 1949 జులై 8న వైఎస్ జన్మించారు. వైద్య విద్య (ఎంబీబీఎస్) పూర్తి చేసిన తర్వాత రూపాయికే వైద్యం అందించారు. తద్వారా చిన్న వయసులోనే ప్రజల మన్ననలు పొందారు. 28 ఏళ్ల వయసులోనే రాజకీయ నాయకుడిగా మారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరుసార్లు అసెంబ్లీకి, నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

రైతులకు అవసరమైన సాగు నీరు అందిస్తే వాళ్లు ఎవరి మీదా ఆధారపడరని వైఎస్ చెప్పేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 'జలయజ్ఞం' పేరిట సాగునీటి చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలుపై చేశారు.

బహుళజాతి కంపెనీ పత్తి విత్తనాల ధరల విషయంలో రైతుల పక్షాన నిలిచి, సుప్రీంకోర్టులో కేసు గెలిచిన ధీశాలి వైఎస్. ఈ కేసు గెలవడం ద్వారా దశాబ్ద కాలంలో రైతులకు రూ. 48 వేల కోట్లు ఆదా అయింది. అప్పట్లో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చివెళ్లిన అమెరికా అధ్యక్షుడు బుష్ శ్వేతసౌధం నుంచి ఓ లేఖ రాశారు. అందులో 'నేను చాలా దేశాలు తిరిగాను. కానీ, రైతుల సంక్షేమం కోసం ఇంత లోతుగా అధ్యయనం చేసిన నాయకుడిని ఎక్కడా చూడలేదు. వైఎస్ లాంటి నాయకుడిని తొలిసారి చూస్తున్నా' అని పేర్కొన్నారు.

2003లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,450 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసినప్పుడు వైఎస్ ప్రతి కుటుంబాన్నీ కలిసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన సీఎం అయిన తర్వాత పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చారు. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, చేనేతలు, వికలాంగులకు పింఛను ఠంచనుగా అందించడం వైఎస్ పాలనలోనే మొదలైంది. పేదవారికి కార్పొరేట్ వైద్యం అందించాలని 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని తీసుకొచ్చారు. '108 అత్యవసర అంబులెన్స్ సర్వీసు' కూడా ఆయన ప్రారంభించిందే. '104 వాహన సేవ' గ్రామీణ ప్రజ లకు ఇంటి వద్దే వైద్య చికిత్సను అందించేందుకు చేపట్టిన మరో బృహత్తర పథకం. 'పావలా వడ్డీ', 'అభయ హస్తం', 'జలయజ్ఞం', 'రైతుల పంట రుణాల మాఫీ', 'భూ పంపిణీ', 'పశు క్రాంతి', 'ఇందిరమ్మ ఇళ్లు', రేషన్ కార్డులు, పింఛన్లు, '103 రూపాయలకే నిత్యావసర సరుకులు'... ఇలా అనేక పథకాలను విజయవంతంగా అమలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేందుకు కర్నూలు జిల్లా ఓబులాపురం గ్రామానికి వెళ్లిన వైఎస్‌కు యశోదమ్మ అనే లబ్ధిదారు నూతన వస్త్రాలు పెట్టింది. కుటుంబ పోషణ భారంతో ఇల్లు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న తమకు రూపాయి ఖర్చు లేకుండా ఇల్లు కట్టించి ఇచ్చారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. 'యశోదమ్మా.. నా చెల్లెలు విమలమ్మ ఎంతో నువ్వూ అంతేనమ్మా. ఇల్లు కట్టించడం నీకు చేసిన మేలు కాదు. అది నా బాధ్యత. నీ పిల్లల చదువుల బాధ్యత కూడా తీసుకుంటా' అన్నారు. తన కార్యాలయ ఫోన్ నంబర్ ఆమెకు ఇచ్చారు. అదీ ఆయన వ్యక్తిత్వం.

కాకినాడ నుంచి వచ్చిన ఓ మహిళ తన ఏడేళ్ల కొడుక్కి చెవుడు అని, ఆపరేషన్‌కు రూ. 6–7 లక్షలు ఖర్చవుతుందని, సాయం చేయాలని వైఎస్‌ను అడిగింది. నాటి సెక్రటరీ పీకే అగర్వాల్‌ను పిలిచి, 'ఈ బాబుకు ఆపరేషన్ చేయించే బాధ్యత మీది' అని చెప్పారు. ఆపరేషన్ అయిన తర్వాత మళ్లీ వచ్చి కలువమ్మా అని ఆ మహిళకు చెప్పి, ఆమె వచ్చినప్పుడు లోపలికి పంపమని సెక్యూరిటీ వాళ్లను కూడా ఆదేశించారు. ఆపరేషన్ విజయవంతమైన తర్వాత ఆమె మళ్లీ వచ్చి కలిసింది. ఆ సమయంలోనే చెవిటి వారికి కూడా ఆరోగ్యశ్రీ కింద ఎంత ఖర్చయినా చికిత్స చేయించాలన్న నిర్ణయం తీసుకున్నారు. వైఎస్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఎప్పుడు కాకినాడ వెళ్లినా అభిమానంతో ఆయనకు సుబ్బారాయుడు అనే వ్యక్తి కొబ్బరిబొండాలు ఇచ్చేవాడు. ఆయన సీఎం అయిన తర్వాత ఏడాదికి సుబ్బారాయుడు వెళ్లి, ప్రజాదర్బారులో కలిశారు. ఆయన్ను గుర్తుపట్టిన వైఎస్.. 'ఏడాది తర్వాత నేను గుర్తొచ్చానా? ఎలా ఉన్నావు? కొబ్బరి బొండాలు తీసుకొచ్చావా?' అని అడిగారు. తీసుకొచ్చానని, సెక్యూరిటీ వాళ్లు అనుమతించలేదని చెప్పాడు. కుటుంబసభ్యుల యోగక్షేమాలు అడగ్గా.. పెద్దమ్మాయి పెళ్లికి వచ్చిందనీ, తన ఆర్థిక పరిస్థితి బాలేదనీ సుబ్బారాయుడు చెప్పారు. స్పందించిన ఆయన సొంత ఖర్చులతో అమ్మాయి పెళ్లి చేశారు.

వైఎస్ ఎప్పుడూ అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని కోరుకునేవారు. విశాఖలో ఐటీ కార్యకలాపాలను ప్రారంభించారు. బిట్స్ పిలానీ, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, అమెరికన్ కాన్సులేట్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే.. ఇలా హైదరాబాద్ నగరానికి అనేక ప్రాజెక్టులు తీసుకొచ్చారు. కాకినాడలో ఎస్ఈజెడ్, గుంటూరులో 18 టెక్స్ టైల్స్ పార్కులు, చిత్తూరు శ్రీ సిటీ.. ఇలా అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు.

వ్యాసకర్త డాక్టర్ వైఎస్సార్ ప్రెస్ సెక్రెటరీ



నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి

వ్యవసాయ పునరుజ్జీవన పథగామి

విశ్లేషణ



ఎం.వి.ఎస్. నాగిరెడ్డి

డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 2004 మే నెల రెండవ వారంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే నాటికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం దెబ్బతిని ఉంది. సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల నుండి నీరు విడుదల గాక, పండిన పంటలకు కూడా కనీస మద్దతు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి. 'ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు అనాధలు కాకూడదు' అనే ఉద్దేశ్యంతో జూన్ మొదటి వారంలోనే వైఎస్ జీవో నం.421 విడుదల చేసి, 2 లక్షల రూపాయల పరిహారం అందించారు. దాన్ని అంతకుముందు ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు కూడా వర్తించేలా చూశారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతుకు వెన్నెముక. రైతులు అప్పులు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీసే పరిస్థితిలో, వైద్య నాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రూ.1,800 కోట్లు ప్రభుత్వం నుండి వాటికి అందేలా చూశారు. నష్టాల్లో ఉన్న సంఘాలను పక్క సహకార సంఘంలో కలిపి సహకార వ్యవస్థను కాపాడారు. పావలా వడ్డీకే రైతులకు పంట రుణాలు అందించారు.

రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేనాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి వనరులు ఉన్న భూమి సుమారుగా 80 లక్షల ఎకరాలు మాత్రమే. ఇలాంటి పరిస్థితిలో లక్ష కోట్లతో కోటి ఎకరాలకు సాగు నీరందిస్తానని 'జలయజ్ఞం' మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మొదలు పెట్టిన తొలి ప్రాజెక్టు పులిచింతల అయితే, మొట్టమొదట పూర్తి చేసింది నిజామాబాద్ జిల్లాలోని అలీసాగర్ ప్రాజెక్టు. 'రైతు ఒక ఎకరంలో పంట పండించడం ద్వారా 60 నుండి 100 పని దినాలు కల్పిస్తున్నాడు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కల్పిస్తున్నాడు' అని వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని వైఎస్ సంకల్పిస్తే కొంతమంది ఎగతాళి చేశారు. కానీ సంకల్ప బలంతో ఆయన ప్రారంభించిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం నేడు ఆదర్శమై ఎన్నో రాష్ట్రాల్లో అమలవుతోంది.

రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల మహిళలు, విద్యార్థులు, వృద్ధుల సంక్షేమం, అభివృద్ధి కోసం 'నాన్న ఒక అడుగు వేస్తే, ఆయన వారసుడిగా నేను రెండు అడుగులు వేస్తాను' అని ప్రకటించి, నాలుగు అడుగులు వేస్తున్నారు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి. ఈ నాలుగు సంవత్సరాల మూడు నెలలలో (51 నెలలు) నేరుగా రైతులకు 'డీబీటీ'(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ. 1,07,307.68 కోట్లు జమచేశారు.

విద్యార్థి నాయకునిగా, ఒక్క రూపాయి వైద్యునిగా, యువ శాసన సభ్యునిగా, యువ ప్రతిపక్ష నాయకునిగా, ముఖ్యమంత్రిగా ప్రతి అడుగులోనూ గొప్ప మానవతావాదిగా నిలిచిన వై.ఎస్.రాజశేఖర రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఆయనకు వినమ్ర శ్రద్ధాంజలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్

దూరదృష్టి గల నేత

అభిప్రాయం



జి. శ్రీలక్ష్మి

'వైఎస్సార్' అన్న మాట వింటేనే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. ఆయన్ని తలచుకోగానే తెల్లని పంచకట్టుతో నిలువెత్తు మనిషి రూపం కళ్ల ముందు మెదులుతుంది. మహిళలు, రైతులు, విద్యార్థులు, బడుగువర్గాల వారు, ఉద్యోగులు... ఆయన పథకాల వల్ల లబ్ధి పొందిన వారే.

రాజన్నకు మహిళల పట్ల సెంటిమెంట్ ఎక్కువగా ఉండేది. చెల్లెమ్మ సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గం నుండి 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర ప్రారంభించి మరో చెల్లమ్మ గౌరు చరితా రెడ్డి నియోజకర్గం నందికొట్కూరులో ముగించారు. తన మంత్రి వర్గంలో సబితా ఇంద్రా రెడ్డికి హోం శాఖను కట్టబెట్టారు. ఆయన మహిళా సంక్షేమం పట్ల అవిశ్రాంతంగా శ్రమించారు. 'పావలా వడ్డీ', 'అభయ హస్తం' పథకాలను ప్రవేశపెట్టి ఆడపడుచులు ఆర్థికంగా స్థిరపడడానికి కృషి చేశారు.

ఒక పేదింటి బిడ్డ ఉన్నత చదువులు చదివితే ఆ కుటుంబం దశ, దిశ తిరుగుతుందని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. అందుకే 'ఫీజు రీయింబర్స్‌మెంట్' పథకం ప్రవేశపెట్టి పేదల జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఈ పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, పేద విద్యార్థులకు పెద్ద చదువులు అందు బాటులోకి వచ్చాయి.

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని గట్టిగా నమ్మే రాజన్న రైతు ముఖాన చిరునవ్వు కోసం అనేక పథకాలను తీసుకొచ్చారు. 'రచ్చబండ' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని సాధకబాధకాలు తెలుసుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లారు. అక్కడికక్కడే సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకుని వాటిని అమలుపరిచే 'చేతల మనిషి'గా నిలిచారు.

రాజకీయ ప్రస్థానంలో ఎన్నికల్లో ఓటమి ఎరుగని అరుదైన నాయకులలో ఆయన ఒకరు. పులివెందుల నియోజకవర్గం నుండి 1978, 1983, 1985 ఎన్నికల్లో అసెంబ్లీకీ; కడప లోక్‌సభ స్థానం నుండి 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో పార్లమెంట్‌కీ, ఆ తర్వాత పులివెందుల నుండి 1999, 2004, 2009 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీచేసి వరుసగా విజయాలు సాధించారు.

ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఆదర్శనీయమే. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా తెల్లవారుజామునే నిద్రలేవడం, ఎవరు ఏ సహాయం కోరి ఇంటికొచ్చినా తన హోదాను పక్కనపెట్టి వారి అవసరం తెలుసుకొని సాయపడడం చేసేవారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయంటే ఆయన దూరదృష్టి, ప్రజా సంక్షేమ కాంక్షలే కారణాలు. ఒక పాలకుడిలో ఉండాల్సిన స్పష్టత, చిత్తశుద్ధి, దూరదృష్టి, దార్శని కత వైఎస్సార్‌లో ఉండడంతో ఆయన తెలుగునాట చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

వ్యాసకర్త పరిశోధకురాలు

నువ్వు ఇచ్చిన కుటుంబం

ఏమిస్తారయ్యా సామీ ఎవరైనా
కన్నబిడ్డకు ఇంతకన్నా!

ప్రజల గుండె చప్పుడు పేరుగా
సడలని కార్యదీక్ష వేరుగా
బెదరని పోరాటమే తీరుగా
తరగని అభిమానమే హోరుగా
ఒక పెద్ద కుటుంబాన్నే ఇచ్చావు

నీ నవ్వు ప్రజలకు పంచడానికి
నీ నమ్మకం జనంలో నిలవడానికి
నీ దార్శనికత ప్రపంచానికి చాటడానికి
నీ ఆశయం గడప గడపకు చేర్చడానికి
నిన్నే వదిలి వెళ్లావో
నువ్వే అతనిలోకి మళ్లావో!

నీ పాలన కొనసాగుతోంది
నీ లాలన అలరారుతోంది
నీ రూపం దీపమై వెలుగుతోంది
నీ లక్ష్యం ఏరువాకై సాగుతోంది

రాజన్నా!
నువ్వన్న మాటే గుర్తుకొస్తోంది
'ఎన్నాళ్లు బతికామన్నది కాదు
బతికినంత కాలం...
ఎలా బతికామన్నది ముఖ్యం'
నువ్వు అలాగే బతికావు
బతుకై ఉన్నావు
నువ్వు ఇచ్చిన ఇంత పెద్ద కుటుంబంలో
ఎప్పటికీ నిలిచే ఉంటావు.

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

ప్రజల గుండెల్లో చిరంజీవి

సందర్భం



నందిరాజు రాధాకృష్ణ

చాలామంది రాజకీయ నాయకుల మాదిరి కాకుండా, మాటకు కట్టుబడి నడిచే నిజమైన తెలుగు స్ఫూర్తికి ఆయన ప్రతిబింబం. అధికారంలో ఉన్నా లేకున్నా, ఆయన ఎప్పుడూ సామాన్యుల కోసం శ్రమిస్తూనే ఉండేవారు. కాంగ్రెస్ వ్యవహారాల పాత్రికేయునిగా వైఎస్ రాజ శేఖరరెడ్డితో చనువుగా మెలగిన వాడిగా ఆయన గురించి నాకున్న అవగాహనతో ఇస్తున్న అక్షర నివాళి ఇది.

అతి సామాన్య వ్యక్తులకు సేవలందిస్తూ, వారి ఆశీర్వాదాలు అందుకుని ఆ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవడానికి భగవంతుడు ప్రసాదించిన వరమే మానవ జీవితం అని రాజశేఖర రెడ్డి గాఢంగా నమ్మేవారు. 'ఇంతకాలం జీవించాలని అనుకుంటున్నామని సంవత్సరాలను లెక్క పెట్టవద్దు. సర్వశక్తిమంతుడు మీకు అందించిన అవకాశాలతో సమాజానికి ఎంత చేశారో మీరే ప్రశ్నించుకోండి' అని ఆయన సలహా ఇచ్చేవారు. ఈ మానవీయ సూత్రమే ప్రతినెలా మొదటి వారంలో నిరుపేదలకు సామాజిక భద్రతా పింఛన్‌లను అందజేసేలా ఆయనను ప్రేరేపించింది.

2003 వేసవి మండుటెండలో రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను సందర్శిస్తూ చేసిన పాదయాత్ర 2004 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించింది. ఆయన ముఖ్యమంత్రి పీఠం అలంకరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో–టెక్నాలజీ, పారి శ్రామిక, వ్యవసాయోత్పత్తిని పెంపొందించే అన్ని రంగాలకూ ప్రాధాన్యతనివ్వడంలో సమతుల్య విధానానికి ఆయన కట్టుబడి ఉండేవారు. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలు, ప్రైవేట్ పెట్టుబడులతో కూడిన అన్ని లావాదేవీలు ఒప్పందాలలో పూర్తి పారదర్శకత ఆయన సిద్ధాంతం. ముఖ్యమంత్రి అనేవారు ప్రజల విశ్వాసానికి అమూల్యమైన సంరక్షకుడని ఆయన నమ్మేవారు. పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లడమనేదే ఆయన తపన. జనాభాలో 75 శాతం మంది జీవనోపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్న నమ్మికతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎక్కువ దృష్టి పెట్టాలని ఆయన అనుకొన్నారు.

'రాజీవ్ పల్లె బాట' ద్వారా ఆదివారం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నాడిని పట్టుకోవడం డాక్టర్‌గా రాజశేఖర రెడ్డి ఆసక్తికర 'కాలక్షేపం'. రాజీవ్ పల్లె బాట ఒక సామూహిక సంప్రదింపు కార్యక్రమం. ప్రభుత్వ కార్యక్రమాలను అధికార్లు ఏ విధంగా అమలు చేస్తున్నారనేది ప్రజల నోళ్ల ద్వారా ముఖ్యమంత్రి వినడం ఈ కార్యక్రమ సూత్రంగా నిలిచింది.

రాష్ట్రంలో ఆ సమయంలో కుండ పోతగా వర్షాలు కురుస్తున్నాయి. అది 2009 సెప్టెంబర్ 2, ఆదివారం. రాష్ట్రంలో దట్టమైన క్యుములోనింబస్ మేఘాలు కమ్ముకున్నాయి. అలాంటి సమయంలో తన మానసపుత్రిక లాంటి పథకం 'రచ్చబండ' ద్వారా ప్రజల బాధలు తెలుసుకోవడానికి బయలుదేరారు వైఎస్సార్. వాతావరణం అనుకూలంగా లేదంటూ అధికారులు ఆయనకు తెలిపినా ఆయన ముందుకే కదిలారు.

ప్రియతమ నేత రాక కోసం చిత్తూరులో ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇంతలో ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న హెలి కాప్టర్ ఆచూకీ లేదనే పిడుగులాంటి వార్త! 25 గంటల తర్వాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్లను నల్లమల అడవుల్లో కర్నూలు–ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో గుర్తించారు. నాటి ప్రమాదంలో వైఎస్‌తో పాటు మొత్తం ఐదుగురు మరణించారు. ఒక శకం ముగిసింది. ఒక మహానేత కనుమరుగయ్యారు. తెలుగు రాష్ట్రం బోరున విలపించింది!

వ్యాసకర్త విశ్రాంత పాత్రికేయుడు । 98481 28215



'మనందరికి కావలసినవాడు'


డా॥ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయం. ఆ సమయంలో ఆకాశవాణి జాతీయ వార్తా విభాగం కోసం 'అహోబిలం'లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి నన్నూ, మా విలేఖరి సుదర్శనంను ఢిల్లీ నుంచి పంపారు. ఆ కార్యక్రమం అనంతరం, ఐటీ రంగం గురించి వైఎస్ అభిప్రాయాలను తెలుసుకుని 'స్పాట్ లైట్' ఆంగ్ల కార్యక్రమంలో ప్రసారం చేయమన్నారు.

ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం విలేఖరి మహ్మద్ ఖాన్ షకీల్ మమ్మల్ని సీఎల్‌పీ కార్యాలయంలో ఉన్న రాజశేఖర రెడ్డి దగ్గరకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. తొలి పరిచయంతోనే ఎంతో ఆత్మీయంగా మాట్లాడిన ఆయన, తన ఇంటర్వ్యూను రేడియోలో ప్రసారం చేస్తారంటే నమ్మలేనని అన్నారు. వారిని ఒప్పించి ఆంగ్లంలో వారి ఇంటర్వ్యూను తీసుకున్నాము.

స్పాట్ లైట్ కార్యక్రమం ప్రసారమయ్యే ఉదయమే రాజశేఖర్ రెడ్డి గారికీ, దీనికోసం అభిప్రాయాలు తెలుసుకున్న మిగిలిన నాయకులకూ రాత్రి 9.30కు కార్యక్రమం వినమని చెప్పటం జరిగింది. ఇక్కడే అనుకోని సంఘటన జరిగింది. స్పాట్‌లైట్ కార్యక్రమం ప్రసారం ముగియగానే ఆయన స్వయంగా ఆకాశవాణి ఢిల్లీ న్యూస్ రూమ్‌కు ఫోన్ చేసి విన్నానని చెప్పడమే కాకుండా, ప్రత్యేకించి నన్ను, సుదర్శనంను అభినందించడం ఓ మరపురాని జ్ఞాపకం. ఇలా ఆకాశవాణిలో తొలి సారిగా రాజశేఖర్ రెడ్డి స్వరం ఆంగ్లంలో వినిపించే అవకాశం నాకు లభించింది.

అంతకుముందు ఆయన్ని పార్లమెంటు దగ్గర ఎన్నోసార్లు చూడడం జరిగింది కానీ, పలకరింపులు కేవలం నవ్వు ద్వారా మాత్రమే. 2002లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి బదలీ మీద వచ్చిన నేను 'వార్తా వాహిని' కోసం, వివిధ కార్యక్రమాలను కవర్ చేసేవాడిని. 'సార్, మీరు సీఎం కాగానే తొలి ఇంటర్వ్యూ నాకే' అనగానే, పెద్దగా నవ్వుతూ, 'వెల్‌కమ్' అన్నారు. అన్నట్టుగానే ముఖ్యమంత్రిగా లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రమాణం చేసిన సాయంత్రమే తన ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల గురించి నాకు ఫోన్‌లో చెప్పటం, దాన్ని 'జన హృదయ నేత వైఎస్సార్' అని ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేయటం జరిగింది.

జ్ఞాపకం



అద్దంకి శ్రీరామ కుమార్

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం అయిన సందర్భంగా నా కోరికపై ఆకాశవాణి కోసం 15 నిమిషాల ఇంటర్వ్యూ ఇవ్వటం విశేషం. తెలుగు భాషకు ప్రత్యేక హోదా లభించిన రోజు, వారి స్పందన కోసం వెళ్ళాను. ఎంతో పని ఒత్తిడిలో ఉండి కూడా, 'నువ్వు ముందు మజ్జిగ తాగు, తరువాతే నేను నీ ప్రశ్నకు ఒకమాటతోనే స్పందిస్తా'నన్నారు. ఆ సాయంత్రమే 'తెలుగు పద్యానికి పట్టం, మన మాతృభాషకు జేజేలు' అని అంతా పద్యాలతో చేసిన కార్యక్రమంలో ఆయన స్పందన రేడియో శ్రోతలకు వినిపించాం.

అవి అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతున్న రోజులు. ఢిల్లీ పాత్రికేయులతో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉండగా నన్ను చూపిస్తూ...'హిందూస్తాన్ టైమ్స్' పాత్రికేయురాలు కల్యాణి శంకర్ 'మా అందరికి కావలసినవాడు రామ్ కుమార్' అంటే, రాజశేఖర్ రెడ్డి పెద్దగా నవ్వుతూ 'మనందరికి కావలసిన వాడు, అంతేకాదు అందరూ అతనికి కావలసిన వారే' అనటం మధురమైన జ్ఞాపకం.

ఆకాశవాణి విశ్రాంత ప్రతినిధి । 94405 67625

గాంధీ మార్గంలో తెలంగాణ

స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్య్ర పోరాట ఆశయాలకు అనుగుణంగా, గాంధీ మార్గంలో తెలంగాణ ఉద్యమం కొనసాగిందని.. ఆ ఆశయాలకు అనుగుణంగానే తెలంగాణలో పరిపాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. భారతదేశం ఆత్మ గ్రామాల్లోనే ఉందని మహాత్మా గాంధీ పదే పదే చెప్పేవారని.. ఆ మాటల ప్రేరణతోనే గ్రామీణ జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల దాకా.. వ్యవసాయం మొదలుకొని, పరిశ్రమలు, ఐటీ రంగాల అభివృద్ధి దాకా.. గిరిజనులు, దళితులు, మైనారిటీల నుంచి అగ్రవర్ణ పేదలదాకా అందరికీ, అన్ని అంశాలకు సమప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అందుకే ఈ రోజు తెలంగాణ మోడల్ దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. గత ఏడాది ఆగస్టు 8న ప్రారంభించిన భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ముగింపునిచ్చింది. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకల్లో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి రాష్ట్ర పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

"తెలంగాణ ఉద్యమం అంటే హింసాత్మక ఆందోళన అనే అభిప్రాయం ఉండేది. టీఆర్‌ఎస్‌ను స్థాపించినపుడు అహింసాయుతంగా, రాజ్యాంగ పరిధిలోనే ఉద్యమించి విజయం సాధిస్తామని నేను స్పష్టంగా ప్రకటించాను. ప్రాణాన్ని పణంగా పెట్టి అయినా సరే లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించుకున్నాను. ఆ నేపథ్యంలోంచి వచ్చినదే ఆమరణ నిరాహార దీక్ష ఆలోచన. స్వాతంత్య్ర పోరాట కాలంలో బ్రిటిష్ పాలనే బాగుందన్న ప్రబుద్ధుల్లాంటి కొందరు తెలంగాణ ఉద్యమ కాలంలోనూ ఉన్నారు. వారంతా తెలంగాణ వద్దు.. సమైక్య పాలనే ముద్దు అని నిస్సిగ్గుగా ప్రకటిస్తూ, ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. మన చిత్తశుద్ధి ముందు వాళ్ల ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చిత్రమేమిటంటే.. అలా అన్న వాళ్లే ఈరోజు మనకు తెలంగాణ ఉద్యమం గురించి పాఠాలు చెప్పడానికి సిద్ధపడుతున్నారు. తెలంగాణ ఏర్పాటైన ఈ పదేళ్లలోనే అద్భుత పురోగతి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశానికే దిక్సూచి అనే స్థాయికి ఎదిగింది.

స్వాతంత్య్ర పోరాట ఆశయాలకు అనుగుణంగా..

స్వాతంత్య్ర సమర యోధుల ఆశయాల వెలుగులోనే అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలకు వేదికగా నిలుస్తున్నది. గాంధీ మార్గంలో, రాజ్యాంగ పరిధిలో ఉద్యమించడం వల్లనే తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైంది. ఈ అభివృద్ధి నమూనాను ఇదేవిధంగా కొనసాగిస్తూ, సకల జనులకూ ప్రగతి ఫలాలను సమానంగా పంచడం ద్వారానే స్వాతంత్య్రోద్యమ ఆశయాలను పరిపూర్తి చేసుకోగలుగుతాం. స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలను నిజం చేద్దాం. జాతి నిర్మాణంలో తెలంగాణను అనునిత్యం అగ్రభాగంలో నిలుపుదాం.." అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

సమర యోధుల ఆశయాలను చాటేలా..: సీఎస్ శాంతికుమారి

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు వజ్రోత్సవాలను నిర్వహించిందని సీఎస్ శాంతికుమారి చెప్పారు. సమరయోధుల ఆశయాలను ప్రస్తుత తరానికి చాటిచెప్పేలా విభిన్న కార్యక్రమాలు నిర్వహించామని.. రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లలో గాంధీ చిత్రాన్ని ప్రదర్శించామని, దాదాపు 30 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ చిత్రాన్ని వీక్షించారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచాయని ఆమె అన్నారు.



వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాఘవాచారి బ్రదర్స్ నిర్వహించిన 'రఘుపతి రాఘవ రాజారాం' గానంతో సంగీత విభావరి ప్రారంభమైంది. 'ఇదిగో భద్రాద్రి.. అదిగో చూడండి' ఆలాపనతోపాటు 'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలూ' అంటూ సాగిన త్యాగరాజ కీర్తన ఆకట్టుకున్నాయి. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'భారతీయ భావన' నాట్య రూపకంలో.. కూచిపూడి, భరత నాట్యం, పేరిణి, మోహినీ అట్టం, ఒడిస్సీతోపాటు ఆరు రకాల భారతీయ నృత్యరీతులతో కూడిన ఏక ప్రదర్శన అలరించింది. ఆయాచితం నటేశ్వర శర్మ రాసిన 'తెలంగాణ అవతరణం తొలిపొద్దు నవకిరణం.. భరత మాత ఆభరణం' అంటూ సాగిన నృత్య ప్రదర్శన రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు దళితబంధు, రైతుబంధు వంటి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఒక్కో ప్రభుత్వ కార్యక్రమాన్ని వర్ణిస్తూ సాగింది. అనంతరం 'సింఫనీ ఆఫ్ ఫ్రీడం' పేరిట పలు వాయిద్యాలతో సాగిన జుగల్బందీ.. తర్వాత మంజుల రామస్వామి బృందం ప్రదర్శించిన 'వజ్రోత్సవ హారతి' నృత్య ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన సీఎం కేసీఆర్.. చాలా బాగున్నాయంటూ కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్

- వారంరోజులు యూరియా ఉత్పత్తికి బ్రేక్



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) కర్మాగారంలో మరమ్మతుల కారణంగా గురువారం రాత్రి నుంచి యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. హీటర్ సెక్షన్ పైపులు మరమ్మతులు చేయడానికి వారంరోజుల దాకా సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. శుక్రవారం మరమ్మతులు ప్రారంభించారు. వానాకాలం సీజన్ కావడంతో తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో యూరియాకు డిమాండ్ అధికంగా ఉంది.

నిత్యం సాంకేతిక సమస్యలు: ఫ్యాక్టరీలో జూన్‌లో కూడా సాంకేతిక సమస్యలతో 20 రోజులపాటు యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం ప్లాంట్ పునరుద్ధరించినా, రెండు రోజులకే మళ్లీ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. జూన్ చివరివారంలో ఉత్పత్తి ప్రారంభించారు. సాంకేతిక సమస్యలతో ఆగస్టులో ఉత్పత్తి కొంత తగ్గింది. మళ్లీ సమస్య తలెత్తడంతో కర్మాగారాన్ని తాత్కాలికంగా వారం పాటు షట్‌డౌన్ చేసి మరమ్మతుల అనంతరం ఉత్పత్తి పునరుద్ధరిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. కర్మాగారంలో గడిచిన 4 నెలల్లో 5,01,597.63 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశారు. 2023-24లో 12.70 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా ఉత్పత్తి చేయాలనేది టార్గెట్.

క్లుప్తంగా...

వచ్చే నెలలో ఢిల్లీలో జీ20 పార్లమెంట్ స్పీకర్ల భేటీ

న్యూఢిల్లీ: జీ20 కూటమి దేశాల పార్లమెంట్ స్పీకర్ల సమావేశం వచ్చే నెలలో ఢిల్లీలో జరగనుంది. అక్టోబర్ 12, 13, 14వ తేదీల్లో పార్లమెంట్ నూతన భవనం పార్లమెంట్–20 భేటీకి వేదిక కానుందని జీ20 ఇండియా స్పెషల్ సెక్రటరీ ముక్తేశ్ పర్దేశి చెప్పారు. జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాల పార్లమెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొని చర్చలు జరుపుతారని తెలిపారు. 'పార్లమెంటేరియన్లు సంబంధిత ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. కాబట్టి, పీ20 సమావేశాలు ప్రపంచ పాలనకు పార్లమెంటరీ కోణాన్ని తీసుకురావడం, అవగాహన పెంచడం, అంతర్జాతీయ నిబంధనలకు రాజకీయ మద్దతును సాధించడం, వీటిని సమర్థంగా కార్యరూపం దాల్చేలా చేయడమే ఈ సమావేశాల లక్ష్యం'అనిముక్తేశ్ వివరించారు. భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా చూపేందుకు ఉద్దేశించిన ఒక ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. 2010లో జీ20 అధ్యక్ష స్థానంలో కెనడా ఉన్నప్పటి నుంచి పీ20 గ్రూప్ భేటీలు జరుగుతున్నాయని, ఆ క్రమంలో ఇది 9వదని వివరించారు.

మహేంద్రగిరి జల ప్రవేశం

ముంబై: భారత నావికాదళం సామర్థ్యాన్ని మరింత పెంచే మహేంద్రగిరి యుద్ధనౌక శుక్రవారం ముంబైలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుదేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ యుద్ధనౌకను జలప్రవేశం చేయించారు. మహేంద్రగిరిని ప్రారంభించడం మన నావికాదళ చరిత్రలో కీలక మైలురాయిగా ధన్‌ఖడ్ సందర్భంగా అభివర్ణించారు. భారత సముద్ర నావికాశక్తికి రాయబారిగా మహా సముద్ర జలాల్లో త్రివర్ణపతాకాన్ని మహేంద్రగిరి సగర్వంగా రెపరెపలాడిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముంబైలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎల్) మహేంద్రగిరిని తయారు చేసింది. ప్రాజెక్ట్ 17ఏ సిరీస్‌లో ఇది ఏడోదని అధికారులు తెలిపారు. దేశ ఆర్థిక ప్రగతికి, ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు, సముద్ర జలాల్లో మన ప్రయోజనాలను రక్షించుకునేందుకు నావికాదళాన్ని ఆధునీకరణ చేయడం ఎంతో అవసరమన్నారు. హిందూమహా సముద్ర ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయాలు, భద్రతాపరమైన పరిస్థితుల దృష్ట్యా కూడా ఈ అవసరం ఎంతో ఉందని చెప్పారు. మహేంద్రగిరిలో వినియోగించిన పరికరాలు, వ్యవస్థల్లో 75 శాతం దేశీయంగా తయారైనవే కావడం గర్వకారణమని పేర్కొన్నారు.



ఇండియా వేదికపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, శరద్ పవార్



ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడుతున్న సోనియా గాంధీ

కలిసే పోటీ చేద్దాం

విపక్ష 'ఇండియా' కూటమి నేతల తీర్మానం
- 14 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు
- సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నిర్ణయం

ముంబై: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేయాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులు తీర్మానించారు. ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలని, రాష్ట్రాల స్థాయిలో సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నిర్ణయానికొచ్చారు. ముంబైలో 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం శుక్రవారం ముగిసింది. ముందస్తు ఎన్నికలు, ఒకే దేశం–ఒకే ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై నేతలు విస్తృతంగా చర్చించారు. పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని తీర్మానాలు చేశారు. కూటమికి సంబంధించిన కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకోవడంపాటు సీట్ల పంపకంపై చర్చించడానికి 14 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేద్దామంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలని, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించాలని తీర్మానంలో పేర్కొన్నారు. 'జుడేగా భారత్, జీతేగా భారత్' అనే థీమ్‌తో వివిధ భాషల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం ఆమోదించారు. చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన 'ఇస్రో'ను ప్రశంసిస్తూ మరో తీర్మానం ఆమోదించారు. అయితే, ఈ సమావేశంలో కూటమి కన్వీనర్ ఎంపికపై దృష్టి పెట్టలేదు.

ఈ నెల 30 నాటికి సీట్ల పంపకం పూర్తి

ఇండియా కూటమి సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌తోపాటు వివిధ పార్టీల ముఖ్య నాయకులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, సీతారాం ఏచూరి, డి.రాజా, తేజస్వీ యాదవ్, అఖిలేష్ యాదవ్, కపిల్ సిబల్, జయంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. సీట్ల కేటాయింపు ప్రక్రియ సెప్టెంబర్ 30 నాటికి పూర్తవుతుందని ఇండియా కూటమి వర్గాలు వెల్లడించాయి.

మోదీ సర్కారు ఓటమి తథ్యం: ఖర్గే

నియంతృత్వ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైందని, మోదీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు సాగించినా వచ్చే ఎన్నికల్లో పరాజయం తథ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరిట దేశ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. ప్రజలను ఎవరూ మోసం చేయలేరని స్పష్టం చేశారు. అంతకముందు విపక్ష ఇండియా కూటమి సమావేశంలో ఖర్గే ప్రసంగించారు. ప్రతిపక్ష కూటమి బలాన్ని చూసి మోదీ ప్రభుత్వం బెంబేలెత్తిపోతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకపై మరింత ఉధృతంగా విపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పే అవకాశం ఉందని, దాడులు, అరెస్టులు జరగబోతున్నాయని, కక్ష సాధింపు రాజకీయాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు.

విశ్వసనీయ ప్రత్యామ్నాయం: పవార్

బీజేపీ పాలనతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. ఇండియా కూటమి రూపంలో ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి 28 పార్టీలకు చెందిన 86 మంది నేతలు హాజరయ్యారని తెలిపారు.

'ముందస్తు'కు సిద్ధంగా ఉండాలి: నితీశ్

లోక్‌సభకు ముందస్తుగా ఎన్నికలు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని, అందుకు ఇండియా కూటమి సిద్ధంగా ఉండాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ సూచించారు.

60 శాతం జనాభాకు ప్రాతినిధ్యం: రాహుల్

దేశంలో 60 శాతం జనాభాకు 'ఇండియా' కూటమిలోని పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ పార్టీలన్నీ కలిసికట్టుగా ఉంటే బీజేపీని సులభంగా ఓడించవచ్చని అన్నారు.

కన్వీనర్ అవసరం లేదు: ఉద్ధవ్ ఠాక్రే

ప్రతిపక్ష ఇండియా కూటమికి కన్వీనర్ అవసరం లేదని శివసేన(ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. ఏకాభిప్రాయంతో ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. కూటమి లోగోపై ప్రజల నుంచి సూచనలు స్వీకరిస్తున్నామని వివరించారు.

మాకు పబ్లిసిటీ ఆఫీసర్ మోదీ: స్టాలిన్

బీజేపీ ప్రభుత్వం సాధించేదేమీ లేదని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. మోదీ సర్కారును ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని చెప్పారు. తమ కూటమికి ప్రధాని మోదీ 'పబ్లిసిటీ ఆఫీసర్'గా మారారని పేర్కొన్నారు.

సమన్వయ కమిటీలో ఎవరెవరు?

14 మందితో కూడిన సమన్వయ కమిటీ సభ్యుల పేర్లను ఇండియా కూటమి ఖరారు చేసింది. వివిధ పార్టీల నాయకులతో ఇందులో భాగస్వామ్యం కల్పించారు. కె.సి.వేణుగోపాల్(కాంగ్రెస్), శరద్ పవార్(ఎన్సీపీ), టీఆర్ బాలు(డీఎంకే), తేజస్వీ యాదవ్(ఆర్జేడీ), అభిషేక్ బెనర్జీ(తృణమూల్ కాంగ్రెస్), సంజయ్ రౌత్(శివసేన), హేమంత్ సోరెన్(జేఎంఎం), రాఘవ్ చద్దా(ఆమ్ ఆద్మీ పార్టీ), జావెద్ అలీఖాన్(సమాజ్‌వాదీ పార్టీ), లాలన్ సింగ్(జేడీ–యూ), డి.రాజా(సీపీఐ), ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబ్ ముఫ్తీ(పీడీపీ) ఇండియా కూటమి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. తమ పార్టీ తరఫు సభ్యుడి పేరును తర్వాత వెల్లడిస్తామని సీపీఎం ప్రకటించింది.

జమిలి ఎన్నికల దారిలో...
ఐదు రాజ్యాంగ సవరణలు

అయితే భారీగా ప్రజాధనం ఆదా
పార్టీలకు, అభ్యర్థులకు కూడా అంతే
అభివృద్ధికి కోడ్ అడ్డంకులూ తగ్గుతాయి

'ఒక దేశం – ఒకే ఎన్నికలు'. ఇప్పుడు దేశవ్యాప్తంగా కాక రేపుతున్న అంశం. ఈ నెల 18 నుంచి ఐదు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. అధికార బీజేపీ వేసిన ఈ ఎత్తుగడ వెనక ఉద్దేశం ఏమిటోనని విపక్షాలు ఇప్పుడు తలలు బద్దలు కొట్టుకుంటున్నాయి. ముఖ్యంగా చిరకాలంగా బీజేపీ సమర్థిస్తున్న ఒక దేశం – ఒకే ఎన్నికలు అంశాన్ని ఈసారి పార్లమెంటు ఆమోదముద్ర వేయించుకుంటుందని అవి అనుమానిస్తున్నాయి. అదే జరిగితే ఇకపై అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ లోక్‌సభతో పాటే ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి.

అంత ఈజీ కాదు...

అయితే, ఇది వినడానికి బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులువు కాదు. ఇది సాధ్యపడాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలు అవసరమని చట్ట వ్యవహారాల నిపుణులు అంటున్నారు. ఈ అంశంపై అధ్యయనానికి గతంలో ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ.. పార్టీలు మొదలుకుని కేంద్ర ఎన్నికల సంఘం దాకా అందరితోనూ లోతుగా చర్చలు జరిపింది. అనంతరం ఈ విషయమై పలు కీలక సిఫార్సులు చేసింది. ఆచరణసాధ్యమైన రోడ్ మ్యాప్, ఫ్రేమ్ వర్క్ రూపకల్పన నిమిత్తం ఇప్పుడీ అంశం లా కమిషన్ పరిశీలనలో ఉంది.

ప్రయోజనాలెన్నో...



లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఉండే మాట నిజమే అయినా దీర్ఘకాలంలో మాత్రం చాలా ప్రయోజనాలుంటాయని పరిశీలకులు అంటున్నారు. వారు చెబుతున్నది ఏమిటంటే...
- జమిలి ఎన్నికలకు భారీ సంఖ్యలో అదనపు ఈవీఎంలు, వీవీ పాట్ లు కావాల్సి వస్తాయి. ఇందుకు కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది.
- ఎన్నికల, భద్రతా సిబ్బంది కూడా భారీ సంఖ్యలో కావాల్సి వస్తారు.
- కానీ, ఈ విధానం అమల్లోకి వస్తే దీర్ఘకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానా మీద మాత్రం ఎన్నికల భారం చాలావరకు తగ్గిపోతుంది.
- పార్టీలకు, అభ్యర్థులకు కూడా ఎన్నికల, ప్రచార వ్యయం కూడా అంతే భారీగా తగ్గిపోతుంది.
- చీటికీ మాటికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చి, అభివృద్ధి పనులు కుంటుబడే దురవస్థ తప్పుతుంది.
- సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పదేపదే ఆగకుండా ఉంటుంది.
- అయితే మనది సమాఖ్య రాజ్యం గనుక ఇది జరగాలంటే పార్టీల మధ్య ఏకాభిప్రాయం అవసరం.
- అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇందుకు అంగీకరించాల్సి ఉంటుంది.

ఆ సవరణలు

జమిలి ఎన్నికలు సాధ్యపడాలంటే రాజ్యాంగానికి కనీసం ఐదు సవరణలు అవసరమన్నది న్యాయ నిపుణుల అభిప్రాయం. అవి...
- ఆర్టికల్ 83 (పార్లమెంటు సభల కాలావధికి సంబంధించినది)
- ఆర్టికల్ 85 (పార్లమెంటును రాష్ట్రపతి రద్దు చేయడానికి సంబంధించినది)
- ఆర్టికల్ 172 (రాష్ట్రాల అసెంబ్లీల కాలావధికి సంబంధించినది)
- ఆర్టికల్ 174 (రాష్ట్రాల అసెంబ్లీల రద్దుకు సంబంధించినది)
- ఆర్టికల్ 356 (రాష్ట్రాల్లో అసెంబ్లీలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించేందుకు సంబంధించినది)

పలు దేశాల్లో ఉన్నదే...

జమిలి ఎన్నికల విధానం కొత్తదేమీ కాదు. మన దేశంలో కూడా 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలు మొదలుకొని 1967 దాకా లోక్ సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. కానీ ఆ తర్వాత పలు రాష్ట్ర ప్రభుత్వాలు పలు కారణాలతో ముందుగా ఈ రద్దవడం వంటి పరిణామాలు జరుగుతూ వచ్చాయి.
- దక్షిణాఫ్రికాలో జాతీయ, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి.
- స్వీడన్‌లో కూడా అంతే. జాతీయ అసెంబ్లీ రిక్స్ దాగ్‌తో పాటు లాండ్ స్టింగ్‌గా పిలిచే ప్రాంతీయ సభలు/కౌంటీ కౌన్సిల్స్‌కు ప్రతి నాలుగేళ్లకోసారి ఒకేసారి జరుగుతాయి.

– నేషనల్ డెస్క్, సాక్షి

'జమిలి'పై కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేయనుందని సమాచారం. ఈ పరిణామాలన్నీ చూస్తే ముందస్తు ఎన్నికల హడావుడి మొదలైనట్లే కనిపిస్తోంది. జమిలి ఎన్నికలపై ఇప్పటికే పార్లమెంటరీ స్థాయీ సంఘం, లా కమిషన్ అధ్యయనం చేసి, తమ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాయి. జమిలి ఎన్నికల పట్ల అవి సానుకూలంగా స్పందించాయి.

భాగస్వామ్యపక్షాల అభిప్రాయాలు తెలుసుకోనున్న కమిటీ

'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై తొలిసారిగా 2019 జూన్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ, టీఆర్ఎస్(ఇప్పటి బీఆర్ఎస్), శిరోమణి అకాలీదళ్ వంటి పార్టీలు ఆ ఆలోచనకు మద్దతు ప్రకటించాయి. ఆ తర్వాత 2020 నవంబర్‌లో 80వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సదస్సులో 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దాదాపు 3 సంవత్సరాల అనంతరం కేంద్ర ప్రభుత్వం దీనిపై కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన చట్టపరమైన అంశాలను కమిటీ పరిశీలిస్తుంది. నిపుణులు, రాజకీయ పార్టీల నేతలతోపాటు సామాన్య ప్రజల అభిప్రాయాలను సైతం స్వీకరిస్తుంది. భాగస్వామ్యపక్షాల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత తన నివేదికను కేంద్ర పభుత్వానికి సమర్పిస్తుంది. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలతోపాటే మొత్తం 12 రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో జమిలి ఎన్నికలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకోవచ్చని ప్రచారం జరుగుతోంది.

కోవింద్‌తో జేపీ నడ్డా భేటీ

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. కోవింద్ నేతృత్వంలో కమిటీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొద్దిసేపటి తర్వాత ఈ భేటీ జరిగింది. కమిటీ కూర్పుపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. కమిటీలో సభ్యులుగా ఎవరెవరు ఉండాలన్న దానిపై అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

ప్రత్యేక సమావేశాల అజెండా త్వరలోనే: ప్రహ్లాద్ జోషి

ఈ నెల 18వ తేదీ నుంచి జరుగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా రూపకల్పన తుది దశలో ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. అజెండాలో పొందుపరిచే అంశాలపై మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. అతి త్వరలోనే అజెండాను బహిర్గతం చేస్తామన్నారు. ప్రత్యేక సమావేశాలకు కావాల్సినంత సమయం ఉందన్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల చివరి రోజైన ఈ నెల 22న పార్లమెంట్ సభ్యుల గ్రూప్ ఫొటోల చిత్రీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా ఇలాంటి ఫొటోలను పార్లమెంట్ టర్మ్ మొదలైన తొలి రోజు లేదా చివరి రోజు చిత్రీకరిస్తుంటారు.

షినవత్రకు థాయ్‌లాండ్ రాజు క్షమాభిక్ష

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాజీ ప్రధానమంత్రి థక్సిన్ షినవత్ర(74)కు రాజు క్షమాభిక్ష ప్రసాదించారు. అవినీతి ఆరోపణలపై ఆయనకు కోర్టు విధించిన ఎనిమిదేళ్ల జైలు శిక్షను ఒక్క ఏడాదికి తగ్గించారు. ఇందుకు సంబంధించి రాజు మహా వజ్రాలొంగ్‌కర్న్ నిర్ణయాన్ని రాయల్ గజెట్ శుక్రవారం ప్రచురించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దేశంలో దోషులకు క్షమాభిక్ష ప్రసాదించే అంతిమ అధికారం రాజుదే. 2001, 2005ల్లో జరిగిన ఎన్నికల్లో షినవత్ర ప్రధాని అయ్యారు. 2006లో జరిగిన సైనిక కుట్రలో ప్రధాని పదవి నుంచి షినవత్రను గద్దె దించారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2008లో ఆయన దేశం విడిచి వెళ్లిపోయి, అజ్ఞాతంలో గడిపారు. వారం క్రితం దేశంలోకి ప్రవేశించిన వెంటనే అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఆరోగ్యం క్షీణిస్తున్నందున క్షమాభిక్ష కోరుతూ రాజుకు విజ్ఞాపన పంపారు. షినవత్ర రాకతో దేశంలో మూడు నెలలుగా నెలకొన్న రాజకీయ అస్థిరత సమసిపోయే పరిణామాలు సంభవించాయి. షినవత్ర స్థాపించిన ఫ్యూథాయ్ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలుగా పార్లమెంట్‌లో మద్దతు పెరగడం విశేషం.

ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదు

దేవెగౌడ మనవడికి కర్ణాటక హైకోర్టు షాక్



బెంగళూరు: మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ్ మనవడు, లోక్‌సభ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని కర్ణాటక హైకోర్టు ప్రకటించింది. హసన్ నుంచి 2019 ఎన్నికల్లో ప్రజ్వల్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారంటూ నియోజకవర్గానికి చెందిన జి.దేవరాజెగౌడ అనే ఓటరుతోపాటు అప్పటి ఎన్నికల్లో ప్రజ్వల్ చేతిలో ఓటమి పాలైన బీజేపీ అభ్యర్థి ఎ.మంజునాథ్ వేసిన పిటిషన్లపై జస్టిస్ కె.నటరాజన్ విచారణ జరిపారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటంతోపాటు తన ఆస్తుల వివరాలను వెల్లడి చేయలేదంటూ పిటిషనర్లు చేసిన ఆరోపణలు వాస్తవమేనని ధ్రువీకరించారు. ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని న్యాయమూర్తి ప్రకటించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. ప్రజ్వల్ స్థానంలో ఎ.మంజును విజేతగా ప్రకటించాలన్న పిటిషనర్ల వినతిని తోసిపుచ్చారు. మంజు కూడా ఆ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కాగా, 2019 ఎన్నికల్లో కర్ణాటకలో జేడీఎస్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ ఒక్కరే లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన ప్రధాన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఎ.మంజు జేడీఎస్‌లో చేరి ఎమ్మెల్యే అయ్యారు.

జంట హత్యల కేసు.. మాజీ ఎంపీకి జీవిత ఖైదు

ఇలాంటి కేసును ఇదివరకెన్నడూ చూడలేదన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: 1995లో జరిగిన జంట హత్యల కేసుల్లో లోక్‌సభ మాజీ ఎంపీ ప్రభునాథ్ సింగ్(70)కు సుప్రీంకోర్టు జీవిత ఖైదు విధించింది. రెండు బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. బిహార్ ప్రభుత్వం కూడా బాధితులకు ఇంతే మొత్తం చెల్లించాలని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఇలాంటి కేసును గతంలో ఎన్నడూ చూడలేదన్న ధర్మాసనం.. ఈ కేసులో నిందితుడు ప్రభునాథ్ సింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ దిగువ కోర్టు, పట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పులను కొట్టివేసింది. సాక్ష్యాలన్నిటినీ మాయం చేసేందుకు ప్రభునాథ్ సింగ్ ప్రయత్నాలు చేశాడని పేర్కొంది. దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవ్యవస్థ తమ విధులను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాయంది. ఇద్దరి హత్యతోపాటు మరో మహిళపై హత్యాయత్నం కేసుల్లో ఆగస్ట్ 18వ తేదీన ప్రభునాథ్ సింగ్‌ను సుప్రీంకోర్టు దోషిగా నిర్ధారించింది. 1995 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభునాథ్ సింగ్ బిహార్ పీపుల్స్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. ఓటింగ్ రోజు చప్రాలోని పోలింగ్ స్టేషన్ నుంచి వస్తున్న కొందరు స్థానికులను ఎవరికి ఓటేశారంటూ కారులో వచ్చిన సింగ్ ఆరా తీశాడు. వేరే పార్టీకి ఓటేశామంటూ రాజేంద్ర రాయ్, దరోగా రాయ్ మరికొందరు సమాధానమిచ్చారు. ఆగ్రహంతో సింగ్ తన వద్ద ఉన్న రైఫిల్‌తో వారిపైకి కాల్పులు జరపగా ముగ్గురు గాయపడ్డారు. వీరిలో రాజేంద్ర రాయ్, దరోగా రాయ్ అనంతరం చికిత్స పొందుతూ చనిపోయారు. ఘటనపై చప్రా పోలీస్‌స్టేషన్‌లో 1995 మార్చి 25న కేసు నమోదైంది. 1995లోనే జనతాదళ్ ఎమ్మెల్యే అశోక్ సింగ్ సొంతింట్లో హత్యకు గురైన కేసులో సింగ్ ప్రస్తుతం హజారీబాగ్ జైలులో ఉన్నాడు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 9 మంది జవాన్లు మృతి


పెషావర్: పాకిస్తాన్‌లో ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్ బన్ను జిల్లాలో గురువారం జరిగిన ఆత్మాహుతి దాడిలో తొమ్మిదిమంది సైనికులు మృతి చెందారు. నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)కి చెందిన ఉగ్రవాది బైక్‌పై వచ్చి భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. భారీ పేలుడు సంభవించడంతో వ్యానులోని 9 మంది మరణించగా మరో అయిదుగురు గాయపడ్డారని సైన్యం తెలిపింది. దాడికి తామే కారణమంటూ టీటీపీ ప్రకటించుకుంది. పలు ఉగ్ర సంస్థలు కలిసి 2017లో టీటీపీగా ఏర్పాటయ్యాయి. అల్ ఖాయిదాతో సంబంధాలున్నట్లు అనుమానాలున్న టీటీపీ ఇటీవల తరచూ దాడులకు తెగబడుతోంది. జనవరిలో పెషావర్‌లోని ఓ మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిలో 101 మంది చనిపోగా మరో 200 మంది గాయపడ్డారు.

నేడే పీఎస్‌ఎల్‌వీ సీ57 ప్రయోగం

- శుక్రవారం ఉదయం ప్రారంభమైన కౌంట్‌డౌన్
- శనివారం ఉదయం 11.50 గంటలకు ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనలే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఆదిత్య–ఎల్1 ఉపగ్రహం ప్రయోగానికి సర్వం సిద్ధమయింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా సతీష్ ధవన్‌స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ57 ఉపగ్రహ వాహకనౌక ఆదిత్య–ఎల్1ను మోసుకెళ్లనుంది. శుక్రవారం ఉదయం 12.10 గంటలకు మొదలైన కౌంట్‌డౌన్ ప్రక్రియ 23.40 గంటలు కొనసాగిన అనంతరం శనివారం ఉదయం 11.50 గంటలకు పీఎస్ఎల్వీ సీ57 ప్రయోగాన్ని చేపడతారు. శుక్రవారం ఉదయం షార్‌కు విచ్చేసిన ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ముందుగా శ్రీ చెంగాళమ్మ ఆలయం పూజలు చేసుకున్నారు. కౌంట్‌డౌన్ ప్రక్రియలో భాగంగా ముందుగా రాకెట్‌కు నాలుగో దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక రాకెట్‌కు రెండో దశలో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ ప్రయోగంలో సూర్యుడిపై పరిశోధనలకు 1,480.7 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపుతున్నారు. షార్ నుంచి చేసిన ప్రయోగాల్లో ఇది 92వది. పీఎస్ఎల్వీ సిరీస్‌లో 59వది.

పీఎస్–4 దశతో మరో సరికొత్త పరిశోధన: పీఎస్ఎల్వీ సీ57 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్–4)తో మరో సరికొత్త పరిశోధనకు ఇస్రో శ్రీకారం చుట్టింది. నాలుగో దశతో వివిధ రకాల విన్యాసాలు చేసి 01.03.31 గంటలకు ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని వదిలిపెడుతుంది. గతంలో ఎప్పుడు కూడా ఉపగ్రహాన్ని వదిలిపెట్టేందుకు ఇంత సమయం తీసుకున్న పరిస్థితి లేదు. ముందుగా ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టే కక్ష్య దూరం కూడా ఈసారి కొత్తగానే వుంది. అపోజి అంటే భూమికి దూరంగా 36,500 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అలాంటిది కేవలం 19,500 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉపగ్రహాన్ని ప్రవేశపెడుతున్నారు. ఉపగ్రహాన్ని వదిలిపెట్టిన తరువాత రెండు రకాల విన్యాసాలను చేసి కక్ష్య దూరాలను పరిశోధించే పనిని చేపడుతున్నారు. ఎంఓఎస్ పొసిషేషన్ పేరుతో 4042.52 సెకన్లకు ఒకసారి, ఎంఎంహెచ్ పొసిషేషన్ పేరుతో 4382.52 సెకన్లకు ఒకసారి రీస్టార్ట్ చేసి సరికొత్త పరిశోధనలు చేస్తున్నారు.



రోజుకు 1,440 చిత్రాలు

ఆదిత్య–ఎల్1 నిర్దేశిత కక్ష్యలోకి చేరిన వెంటనే అందులో అమర్చిన విజిబుల్ లైన్ కొరోనాగ్రాఫ్(వీఈఎల్‌సీ) పేలోడ్ నిమిషానికి ఒకటి చొప్పున రోజుకు సుమారు 1,440 చిత్రాలను తీసి విశ్లేషణ కోసం గ్రౌండ్ స్టేషన్‌కు పంపుతుందని ప్రాజెక్టు సైంటిస్ట్ అండ్ ఆపరేషన్ మేనేజర్ డాక్టర్ ముత్తు ప్రియాల్ చెప్పారు. ఫిబ్రవరి చివరినాటికి మొదటి చిత్రం అందుతుందని భావిస్తున్నామన్నారు.

రాకెట్ వివరాలు
- పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ పొడవు 44.4 మీటర్లు.
- రాకెట్ ప్రయోగ సమయంలో 321 టన్నుల బరువుంటుంది. నింగికి పయనమైన 01–03–31 (3799.52) నిమిషాల్లో ప్రయోగం పూర్తవుతుంది.
- మొదటి దశలో 139 టన్నుల ఘన ఇంధనం కోర్ అలోన్ దశ, ఈ ప్రయోగానికి రాకెట్ చుట్టూరా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. ఒక్కో బూస్టర్‌లో 12.2 టన్నుల ఘన ఇంధనం నింపుతారు.
- 212.02 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశ 109.40 సెకన్లలో పూర్తవుతుంది.
- 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించి 262.38 సెకన్లకు రెండోదశ పూర్తవుతుంది.
- 7.65 టన్నుల ఘన ఇంధనం సాయంతో 581.42 సెకన్లకు మూడో దశను పూర్తిచేస్తారు.
- మళ్లీ నాలుగోదశ (పీఎస్–4) 3127.52 సెకన్లకు స్టార్ట్ చేసి 3599.52 సెకన్లకు కటాఫ్ చేస్తారు.
- శిఖరభాగాన అమర్చిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని 3799.52 సెకన్లకు (01.03.31 గంటల వ్యవధి)లో భూమికి దగ్గరగా (పెరిజి) 235 కిలోమీటర్లు, భూమికి దూరంగా (అపోజి) 19,500 కిలోమీటర్ల ఎత్తులోని ఎసింట్రిక్ ఎర్త్ బౌండ్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. 175 రోజుల తరువాత సూర్యుడి సమీపంలోని లాంగ్రేజియన్ బిందువు–1 వద్ద ప్రవేశపెట్టి సూర్యుడిపై అధ్యయనం చేస్తారు.

పెళ్లిళ్లు చెల్లనివే అయినా... సంతానానికి సర్వహక్కులు

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: చెల్లని వివాహాల ఫలితంగా పుట్టిన వారు సక్రమ సంతానమే అవుతారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. హిందూ వారసత్వ చట్టం ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిపాస్తులపై వారికి అన్ని హక్కులూ ఉంటాయని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకొని జంటకు పుట్టిన పిల్లలకు హిందూ చట్టం ప్రకారం తల్లిదండ్రుల వారసత్వ ఆస్తి మీద అధికారం ఉంటుందా అంటూ దాఖలైన 2011 నాటి పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. ' చెల్లని పెళ్లికి ఫలితంగా పుట్టిన పిల్లలకు అన్ని హక్కులూ దఖలు పడతాయి. హిందూ వివాహ చట్టం సెక్షన్ 16 (2) ప్రకారం సదరు పెళ్లి చెల్లదని కోర్టు తీర్పు ఇవ్వడానికి ముందు కలిగిన సంతానం సక్రమ సంతానమే అవుతుంది' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో కూతుళ్లకు కూడా కొడుకులతో సమానంగా హక్కులు ఉంటాయని వివరించింది. 'చెల్లని పెళ్లి చేసుకున్న వారికి హిందూ చట్టం ప్రకారం భార్యాభర్తల హోదా రాదు. రద్దు చేయదగ్గ పెళ్లి విషయంలో మాత్రం వారికి ఆ హోదా ఉంటుంది. అలాగే చెల్లని పెళ్లి రద్దుకు ప్రత్యేకంగా కోర్టు ఆదేశాలు అవసరం లేదు. రద్దు చేయదగ్గ పెళ్లి విషయంలో మాత్రం ఆదేశాలు అవసరం'అని వివరించింది.

సింగపూర్ అధ్యక్షుడిగా షణ్ముగరత్నం

సింగపూర్: భారత సంతతికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త థర్మన్ షణ్ముగరత్నం(66) సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. దేశంలో 2011 తర్వాత అధ్యక్ష ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. షణ్ముగరత్నంపై ఇద్దరు చైనా సంతతి నాయకులు పోటీకి దిగారు. ఆయన ఏకంగా 70.4 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. షణ్ముగరత్నం సింగపూర్‌లో జన్మించారు. 2001లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023







నృత్య సోయగం శోభాయమానమైంది. నాట్య సౌరభం తళుకులీనింది. దేశ ఔన్నత్యాన్ని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు తెలంగాణ ప్రగతికి అద్దం పట్టాయి. శుక్రవారం నగరంలోని హెచ్ఐసీసీ వేదికగా స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్రం సాధించిన సమగ్రాభివృద్ధిని కళ్లకు కట్టాయి.

న్యూస్‌రీల్

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలి




ఆటోడ్రైవర్లకు రెయిన్‌కోట్‌లను అందజేస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ చేసి నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు రెయిన్ కోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... స్వచ్ఛ ఆటోడ్రైవర్లు కాలనీలతో పాటు స్లమ్ ఏరియాలోకల కూడా చెత్తను సేకరించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా చెత్తను బయట పారవేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్ల ఆరోగ్య రక్షణ కోసం రబ్బర్ గ్లౌజ్‌లతో పాటు డ్రెస్‌కోడ్, హెల్‌కార్డుల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

2 లక్షల మట్టి వినాయక ప్రతిమలు: కృష్ణ ఆదిత్య

సనత్‌నగర్: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తరఫున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 లక్షల మట్టి వినాయక ప్రతిమల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు బోర్డు సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. వీటిలో లక్ష ప్రతిమలను జీహెచ్ఎంసీ పరిధిలో పంపిణీ చేస్తామన్నారు. మట్టి వినాయక ప్రతిమలపై విస్తృత అవగాహన కల్పించేందుకు టీఎస్‌పీసీబీ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్స్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు సభ్య కార్యదర్శి శుక్రవారం సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకు మొదటి బహుమతి రూ.10,000, రెండో బహుమతి 5,000, మూడో బహుమతి 3,000 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 లక్షలు బహుమతుల రూపంలో అందజేస్తామన్నారు.



కుమారుడి పేరుతో అల్లుడు!

పాకిస్తానీ ఫయాజ్‌కు సహకరించిన అత్తామామలు

- తమ కొడుకు వివరాలతో ఆధార్ కార్డుకు యత్నం
- నగరానికి రూ.4 లక్షలతో వచ్చిన నిందితుడు
- సమీప బంధువు ద్వారా పోలీసులకు సమాచారం



సాక్షి, సిటీబ్యూరో: భార్య, కుమారుడి కోసం అత్తామామల ప్రోద్బలంతో అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన పాకిస్తానీ ఫయాజ్ మహ్మద్ వ్యవహారాన్ని లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సౌత్ జోన్ డీసీపీ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. ఇతడికి సహకరించిన అత్తామామలు అఫ్జల్‌బేగం, జుబేర్ షేక్‌ల కోసం గాలిస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఫయాజ్‌పై ఫారెనర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని తెలిపారు. ఇతడి అత్తమామలు వారి కుమారుడి పేరుతో అల్లుడు స్థిరపడేలా ప్రయత్నించారని పేర్కొన్నారు. సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం..

- పాక్‌లోని స్వాత్ గ్రామానికి చెందిన ఫయాజ్ అక్కడి ఫైజన్ పబ్లిక్ స్కూల్‌లో 13వ తరగతి వరకు చదివాడు. స్కూల్ డ్రాపౌట్‌గా మారిన ఇతడు కరాచీలో ఉన్న డెనిమ్ క్లాతింగ్ కంపెనీలో టైలర్‌గా చేరాడు. స్టిచింగ్ అండ్ ఫినిషింగ్ విభాగంలో పని చేస్తున్న ఫయాజ్‌ను ఈ సంస్థ 2018 డిసెంబర్‌లో షార్జాలో ఉన్న సైఫ్ జోన్ అనే సంస్థకు పంపింది. అక్కడ నుంచి ఫజాయ్ డెజర్ట్ స్టూడియో గార్మెంట్స్ కంపెనీలో నెలకు 3 వేల దిరమ్స్ జీతానికి చేరాడు.
- నగరంలోని అసద్ బాబానగర్‌కు చెందిన నేహ ఫాతిమా 2018 నుంచి షార్జాలో ఉంటూ వివిధ చోట్ల టైలర్‌గా పని చేసింది. ఈమె సైఫ్ జోన్‌లో పని చేస్తుండగా పాకిస్తాన్‌కే చెందిన సోహైల్ ద్వారా ఫయాజ్‌కు పరిచయమైంది. వాట్సాప్ ద్వారా సంప్రదింపులు జరిపిన వీరి మధ్య ప్రేమ చిగురించి సహజీవనం చేశారు. 2020లో ఫాతిమా గర్భవతి కావడంతో ఫయాజ్ వివాహం చేసుకున్నాడు. అదే ఏడాది నగరానికి వచ్చిన ఫాతిమా అసద్ బాబా నగర్‌లోనే కుమారుడు ఫైజాన్‌కు జన్మనిచ్చింది. ఇతడిని తన సవతి తల్లి అఫ్జల్ బేగం వద్ద విడిచిపెట్టి షార్జా వెళ్లిపోయింది.

టూరిస్ట్ వీసా తీసుకుని..

- గత ఏడాది ఆగస్టులో ఫాతిమా తన కుమారుడితో నగరానికి వచ్చేయగా.. ఫయాజ్ పాకిస్తాన్ వెళ్లిపోయాడు. ప్రస్తుతం మూడేళ్ల వయసున్న తన కుమారుడు, భార్యను చూడాలని భావించాడు. ఇదే విషయం తన అత్తామామలకు చెప్పాడు. వీరి ప్రోద్బలంతోనే అక్రమంగా హైదరాబాద్ రావాలని నిర్ణయించుకున్నాడు. గతేడాది అక్టోబర్‌లో టూరిస్ట్ వీసా తీసుకుని ఖాట్మండు చేరుకున్నాడు. 2022 నవంబర్ 12న అక్కడకు వెళ్లిన ఫాతిమా, అఫ్జల్‌బేగం, జుబేర్ షేక్ హోటల్‌లో బస చేసిన ఫయాజ్‌ను కలిశారు. వీరంతా కలిసి ఉత్తరప్రదేశ్‌లో బోర్డర్ చెక్‌పోస్టు దాటించి రోడ్డు మార్గంలో భారత్‌లోకి తీసుకువచ్చారు. అక్కడ నుంచి నేరుగా అసద్ బాబానగర్ చేరుకున్న ఫయాజ్ మూడు నెలల పాటు అత్తామామల ఇంట్లోనే ఉన్నాడు. ఆపై ఎస్ఎం గూడలో ఓ ఇంటికి అద్దెకు తీసుకుని ఆరు నెలలుగా భార్య, కుమారుడితో కలిసి ఉంటున్నాడు.

మహ్మద్ గౌస్ తానే అంటూ..

- ఫయాజ్ తన వెంట రూ.4 లక్షల విలువైన దిరమ్స్ తీసుకువచ్చాడు. వీటిని రూపాయిలుగా మార్చి ఇప్పటి వరకు ఖర్చు పెట్టుకుంటూ వచ్చాడు. ఇతడికి ఆధార్ కార్డు ఇప్పించాలని భావించిన అత్తామామలు తమ కుమారుడైన మహ్మద్ గౌస్ సర్టిఫికెట్లు ఇచ్చారు. తానే మహ్మద్ గౌస్ అంటూ ఫయాజ్ మాదాపూర్‌లోని ఓ ఈ–సేవ కేంద్రంలో మార్చి నెలలో ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇతడు వద్ద ఉన్న డబ్బు అయిపోవడంతో ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. అదే సమయంలో సమీప బంధువు ద్వారా ఫయాజ్ వ్యవహారం పోలీసు లకు తెలిసింది. బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్ డి.అనిల్ కుమార్, డీఐ ఎస్.శ్రీశైలం వల పన్ని ఫయాజ్‌ను పట్టుకున్నారు. ఇతడిపై ఫారెనర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించారు. ఫయాజ్ సరిహద్దులు దాటడంలో బోర్డర్ చెక్‌పోస్టు సిబ్బంది పాత్ర, నిర్లక్ష్యంపైనా దర్యాప్తు చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై సంబంధిత శాఖలకు లేఖ రాయనున్నారు.

సెల్లార్‌లో మంటలు

కాలిబూడిదైన 9 ద్విచక్ర వాహనాలు

- పాక్షికంగా దగ్ధమైన ఒక కారు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాజేంద్రనగర్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిమిషాల వ్యవధిలోనే ద్విచక్ర వాహనాలకు మంటలు వ్యాపించి కాలిబూడిదైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రీన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రీన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వారు తమ వాహనాలను, కార్లను సెల్లార్‌లో పార్కు చేశారు. గురువారం రాఖీ పౌర్ణమి కావడంతో వాచ్‌మన్ తన భార్యతో కలిసి సొంతూరు వెళ్లాడు. గురువారం రాత్రి ఆరు బైక్‌లు, మూడు యాక్టివా వాహనాలు, ఒక కారును అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వారు పార్కు చేసి నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో సెల్లార్ నుంచి మంటలు, పొగలు వస్తుండడంతో స్థానికులు అపార్ట్‌మెంట్ వాసులను అప్రమత్తం చేశారు. కిందకు వచ్చేసరికి దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులు, అత్తాపూర్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అత్తాపూర్ ఫైర్ ఆఫీసర్ చంద్రానాయక్ ఆధ్వర్యంలో హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే ఆరు బైక్‌లు, మూడు యాక్టివా వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక కారు పాక్షికంగా దగ్ధమైంది. పార్కు చేసిన రెండు కార్లతో పాటు మరో బైక్‌ను స్థానికులు బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. షాట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

అంతా పారదర్శకంగానే..



'డబుల్' ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేదు

- ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదు
- కళ్లులేని కబోదులూ.. కట్టిన ఇళ్లు చూడండి
- 11,700 గృహాల పంపిణీ పండగ నేడే
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, సిటీబ్యూరో/ గన్‌ఫౌండ్రీ: పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రీమ్ ప్రాజెక్టుగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 11,700 ఇళ్లను శనివారం గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల ప్రజలకు ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల కోసం 7 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, 95 వేల మందిని అర్హులుగా రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు చెప్పారు. ఇళ్ల పంపిణీలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా లక్కీ డ్రాలో తొలిదశ లబ్ధిదారులను ఎంపిక చేశారని చెప్పారు. ఎంపికైన వారందరికీ అధికారులు సమాచారమిచ్చారని స్పష్టం చేశారు. మొదటి దశలో ఇళ్లు రాని వారు చింతించవద్దని, ఎవరెవరి దగ్గరకో తిరగవద్దని, ఇంకా అయిదారు దశల్లో డ్రా జరుగుతుందన్నారు. ప్రతి 10, 12 రోజులకోమారు డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అయిదారు దశల్లో మొత్తం ఇళ్ల పంపిణీ పూర్తవుతుందన్నారు. ఎలాంటి మానిప్యులేషన్‌కు అవకాశం లేదన్నారు. వీటి పంపిణీకి ఎన్నికల కోడ్ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. మంత్రి కేటీఆర్ అమెరికా నుంచి రాలేకపోతున్నందున రెండో దశ పంపిణీలో పాల్గొంటారన్నారు.

నెరవేరుతున్న సీఎం ఆశయం

దేశంలో ఎక్కడా లేని విధంగా స్వరాష్ట్రంలో పేదలు ఆత్మగౌరవంతో సంతోషంగా బతకాలని భావించిన సీఎం ఇళ్ల డిజైన్‌పై కూడా శ్రద్ధ చూపారన్నారు. ఐడీహెచ్ కాలనీలో మొదటిసారి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేటప్పుడు నాలుగుపర్యాయాలు వచ్చి పరిశీలించి, సూచనలిచ్చారని గుర్తు చేశారు. అప్పటి గవర్నర్ నరసింహన్ ఢిల్లీలోని ఐఏఎస్‌ల క్వార్టర్ల కంటే బాగున్నాయని కితాబిచ్చారన్నారు. ఇళ్ల లొకేషన్లకు లబ్ధిదారులను తీసుకువచ్చేందుకు 468 బస్సులు ఏర్పాటు చేశామని, రెవెన్యూ అధికారుల సమన్వయంతో వారిని అక్కడకు చేరుస్తారని, వారి సమక్షంలో లాటరీ ద్వారా అలాట్‌మెంట్ తర్వాత పంపిణీ జరుగుతుందని తెలిపారు. భూముల ధరలు ఎకరానికి రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లు పలుకుతున్న డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో సదుపాయంగా నిర్మించిన ఇళ్లను పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు ఇరుగ్గా ఉండేవన్నారు. ఏదో మైలేజీ కోసం తాపత్రయంతో ఇళ్లు నిర్మించలేదని విమర్శించే వారికి, కళ్లులేని కబోదులకు రేపు ఈ ఇళ్లు చూపించాలని లబ్ధిదారులకు సూచించారు. ఎన్నివేల కోట్లయినా పేదలు గొప్పగా జీవించాలనే సీఎం ఆశయం నెరవేరనుందన్నారు. 69వేల ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మిగతావి పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పేదలకు గృహలక్ష్మి వంటి పథకాల ద్వారా కూడా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ప్రజలు ఇళ్లలోకి వెళ్లాక ఇంకా ఏవైనా సదుపాయాలు అవసరమైతే సమకూరుస్తామన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ విజయలక్ష్మి, హౌసింగ్ ఓఎస్డీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పద్ధతిలో..

ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని 24 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 8 ప్రాంతాల్లో ర్యాండమైజేషన్ పద్ధతిలో 11,700 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్ఓ వెంకటాచారి పాల్గొన్నారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి



నిందితుడు రాజు



చికిత్స పొందుతున్న యువతి

జగద్గిరిగుట్ట: ఆన్‌లైన్‌లో యువతిని పరిచయం చేసుకున్నాడు. కొద్దిరోజులకు ప్రేమిస్తున్నానని చెప్పాడు. యువతి కాదన్నందుకు కత్తితో దాడి చేశాడు. ఆ తర్వాత ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రాజు (27) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఆల్విన్‌కాలనీ పరిధిలోని విజయనగర్‌లో ఉంటున్న ఓ యువతి (24) ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. రాజు 6 నెలల క్రితం ఫేస్‌బుక్‌లో ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ప్రేమిస్తున్నానని ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడు. ఇటీవల యువతి నుంచి స్పందన లేకపోవడంతో శుక్రవారం విజయనగర్ కాలనీకి వచ్చాడు. యథావిధిగా తనను ప్రేమించాలని, లేదంటే చంపేస్తానని బెదిరించాడు. దీనికి సదరు యువతి అంగీకరించకపోవడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె మెడపై దాడి చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో తాను కూడా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. గాయపడిన యువతిని కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అవయవాలు దానం చేయాలని కోరుతూ సెల్ఫీ తీసుకుని...

మానసిక ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య



రామచంద్ర రావు (ఫైల్)

అత్తాపూర్: తన అవయవాలను దానం చేయాలని సెల్ఫీ తీసుకుని.. ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన రామచంద్రరావు (30)కి తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. మారుతీనగర్‌లో ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయిన రామచంద్రరావు.. తన నివాసంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.



కూచిపూడి.. నాట్యమాడి..

శ్రీ గీతిక కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవాలను శుక్రవారం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వర్ధమాన సినీనటి శ్రీలీల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 25 ఏళ్లుగా ఎంతో మంది కళాకారులను తయారు చేయడం అభినందనీయమన్నారు. చిన్నతనం నుంచే పిల్లలను కూచిపూడి రంగంలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ, అకాడమీ డైరెక్టర్ అనంత కృష్ణ, మన బ్రాహ్మణ సమాజం సంస్థ అధ్యక్షుడు అవధానుల నరసింహ ప్రసాద్ శర్మ, విద్యా శక్తి పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ నారాయణ చక్రవర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు. గన్‌ఫౌండ్రి

కేర్-గ్రో వైజ్ మధ్య అవగాహన ఒప్పందం



సాక్షి, సిటీబ్యూరో: వైద్య ఆరోగ్య రంగం సజావుగా ముందుకు సాగడానికి ఈ రంగంలో విభిన్న స్థాయిల్లో తమ విధులను నిర్వర్తించే ఉద్యోగులు ఎంతో కీలకమని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ వీపీ ప్రసేన్‌జిత్ ఘోష్ అన్నారు. జాబ్ షాడోవింగ్ కార్యక్రమంలో భాగంగా కేర్ హాస్పిటల్స్.. ప్రముఖ ఎడ్యుటెక్ సంస్థ గ్రోవైజ్ అకాడమీతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకుని..వైద్య రంగంలో ఉద్యోగపరమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ జాబ్ షాడోవింగ్ భాగస్వామ్యాన్ని రెండు సంస్థలు ప్రకటించాయి. ఈ సందర్భంగా గ్రోవైజ్ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు లీనా కాంజీవరం మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు హెల్త్‌కేర్ విభాగంలో అనుభవజ్ఞులతో మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఎంఓయూ కార్యక్రమంలో గ్రోవైజ్ కో-ఫౌండర్లు ప్రీతం నాలం, మహమ్మద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టాలి

- వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు కమ్యూనిస్టుల సత్తా చూపిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నాగోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని, కేంద్రంలో బీజేపీని మళ్లీ అధికారంలోకి రాకుండా ప్రజలను చైతన్య పర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎల్బీనగర్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం బండ్లగూడలోని గిరిప్రసాద్ భవనంలో నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అధ్యక్షతన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులను అన్నింటినీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. దేశంలో మతం పేరుతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ యూనిఫాం సివిల్ కోడ్‌ను బలవంతంగా ప్రజల నెత్తిన రుద్దాలని చూస్తే సీపీఐ మిలిటెంట్ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కేసీఆర్ మునుగోడులో వామపక్షాల బలంతో నెగ్గి..ఇప్పుడు వాపుని బలుపు అనుకుంటూ కమ్యూనిస్టులను మోసం చేశాడని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు వామపక్షాల దెబ్బేంటో రుచి చూపిస్తామని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో గెలుపోటములు నిర్ధారణ చేసే శక్తిగా కమ్యూనిస్టులు ఉన్నారన్నారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి.సాయిలు గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, జి.దామోదర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రవీణ్ కుమార్‌గౌడ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మేంద్ర, పార్టీ నాయకులు బొడ్డుపల్లి క్రిష్ణ, లక్ష్మణాచారి, సక్రునాయక్, సుభద్ర, బాతరాజు నర్సింహ, శ్రీను, కందుల సుధాకర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. కాగా సీపీఐ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ సామిడి శేఖర్‌రెడ్డి, కో కన్వీనర్లుగా బాతరాజు నరసింహ, రాంనారాయణలను పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైటెక్స్‌లో ఇండియా హోరేకా ఎక్స్‌పో షురూ



ఎక్స్‌పోను పరిశీలిస్తున్న టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం హోరేకా ఇండియా ఎక్స్‌పో-2023 ప్రారంభమైంది. ఫుడ్ సర్వీసెస్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రవణ్, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మనోహర్‌లు ఎక్స్‌పోను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎక్స్‌పోలో బేకర్లు, రెస్టారెంట్‌లు, హోటళ్ళు, హోమ్ చెఫ్‌లు, ఆహార వ్యాపార వేత్తలకు కావాల్సిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. శనివారం హస్పిసోర్స్ ఇన్నోవేషన్ అవార్డు వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎక్స్‌పోలో హోటల్ ప్రాజెక్టు డిజైన్, బేకరీ ప్రోడక్ట్స్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ టెక్నాలజీ వంటి అంశాలలో దేశంలోని నిపుణులైన వారితో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ద్వారా దాదాపు 200 మందికి వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నట్టు తెలిపారు. సందర్శకులకు ప్రవేశం ఉచితం. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వార్తాపత్రికలు విధిగా చదవాలి

ఐపీఎస్ అధికారిణి డాక్టర్ సంధ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారిణి సంధ్య

ఫిలింనగర్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయడం ద్వారా బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవచ్చునని కేరళ ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ డీజీ, ఐపీఎస్ అధికారిణి డాక్టర్ బి.సంధ్య అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో నిర్వహించిన సైబర్ క్లబ్ యాక్టివిటీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నో టూ డ్రగ్స్‌పై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పది నిమిషాలు వార్తాపత్రికలు చదవడం ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చునని, వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగుపర్చుకోవచ్చునని వెల్లడించారు. మంచి అలవాట్లపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సైబర్ క్రైం నుంచి ఎలా బయటపడవచ్చో వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం ఇచ్చిన వారికే కురుమల మద్దతు



అభివాదం చేస్తున్న బాపు మల్‌శెట్టి కురుమ తదితరులు

పంజగుట్ట: రాష్ట్రంలో సుమారు 50 లక్షల జనాభా ఉన్న కురుమ కులస్థులకు బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి కురుమ ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుమలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తూ తమ డిమాండ్లు నెరవేర్చిన పార్టీకే వచ్చే ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు తెలుపుతామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలు తమ జనాభా దామాషా ప్రాకారం 12 ఎమ్మెల్యే, 2 ఎంపీ, 2 ఎమ్మెల్సీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చాలా నియోజకవర్గాల్లో గెలుపు ఓటములు శాసించే స్థాయిలో కురుమలు ఉన్నారని, తమకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వని పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి రాంచంద్రయ్య, రాష్ట్ర ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్.కిష్టయ్య, వివిధ జిల్లాల అధ్యక్షులు మల్లేశం, రామయ్య, నాగయ్య, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో నిందితుడికి రెండు రోజుల జైలు



నిందితుడు ప్రసాద్

బంజారాహిల్స్: మద్యం మత్తులో అర్ధరాత్రి వీధుల్లో సంచరిస్తూ అనుమానాస్పదంగా తిరుగుతూ స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న నిందితుడికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు, రూ. 50 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్ బస్తీకి చెందిన కె.ప్రసాద్(24) ఇటీవల కాలంలో ఆవారాగా తిరుగుతూ స్థానికంగా అనుమానాస్పదంగా తిరుగుతూ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించడమే కాకుండా దారికాచి పాదచారులను వేధింపులకు గురి చేస్తున్నాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఈ-పెట్టి కేసు నమోదు చేసి శుక్రవారం నాంపల్లిలోని 10వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి. రాజేంద్రకుమార్ ఎదుట హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి పైమేరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రక్షణ శాఖ నుంచి అభినందన లేఖ

సాక్షి, సిటీబ్యూరో: నిరంతరం దేశ సేవలో నిమగ్నమైన ఇండియన్ ఆర్మీకి మన వంతు సహకారం అందించడం మన బాధ్యతని 'అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్' సంఘం కార్యదర్శి టీఎంబీ బుచ్చిరాజు అన్నారు. ఆర్మీలో మరణించిన జవాన్ల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రక్షణ శాఖలో ఏర్పాటు చేసిన సహాయ నిధికి తమ సంఘం తరఫున రూ.2,13,708 లను అందించామని పేర్కొన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంఘం తరపున అందించిన సహకారానికి భారతీయ రక్షణ శాఖ తమ సంఘాన్ని అభినందిస్తూ లేఖను పంపించిందని వివరించారు.

రేపటి నుంచి నోవాటెల్‌లో జీ-20 వర్క్‌షాప్

శంషాబాద్: వ్యవసాయ రంగంలో వాతావరణ సంబంధిత అంశాలపై నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 3 నుంచి 6 వరకు జీ-20 వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు 20 దేశాలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వ్యవసాయరంగ నిపుణులు హాజరుకానున్నారు. జీ-20 వర్క్‌షాప్‌కు విదేశీ ప్రతినిధులు, వీఐపీల రాక సందర్భంగా సైబరాబాద్ పోలీసులు పటిష్టమైన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు పలుమార్లు సమీక్ష నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చందన్ కుమార్(19) తుక్కుగూడలోని మహ్మద్ ఇబ్రహీంకు సంబంధించిన కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే గురువారం రాత్రి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మంఖాల్ వద్ద తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న చందన్‌ను చూసిన కార్మికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు 75 గజాల ఇంటి స్థలం

- 220 మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి సబితారెడ్డి
- ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు శంకుస్థాపన



ఘట్టుపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి తదితరులు

మహేశ్వరం: గ్రామాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే ఇళ్లు లేని పేదలకు 75 గజాల ఇంటి స్థలంలో పాటు పట్టా పత్రాలు పంపిణీ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని ఘట్టుపల్లిలో 6.5 ఎకరాలు, మన్సాన్‌పల్లిలో ఐదెకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు 75 గజాల స్థలం కేటాయించి పట్టా పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలం ఉన్న గ్రామాల్లో పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఘట్టుపల్లిలో 6.20 ఎకరాల భూమిలో 220 మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. అర్హత ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. పేదోడి సొంతింటి కలను సొంతం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మండల పరిధిలోని సిరిగిరిపురం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, గొల్లూరులో ప్రభుత్వ స్థలాలు గుర్తించి ఇంటి స్థలాలకు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతానాయక్, ఘట్టుపల్లి, మన్సాన్‌పల్లి సర్పంచ్‌లు కె.అనితారెడ్డి, కంది అరుణ, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్, నర్సింహ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పాండు యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వీరాంజనేయ స్వామి ఆలయ ట్రస్టీ మెంబర్ కె.ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్ యాదవ్, సాదయ్య, రాకేశ్‌రెడ్డి, జాన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండి.సాదత్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు భవనాలకు రూ.50లక్షలు

కుల సంఘాలకు సంక్షేమానికి ప్రభుత్వం ఆత్మ గౌరవ భవనాలను నిర్మిస్తోందని మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మన్సాన్‌పల్లిలో నాయీ బ్రాహ్మణ(మంగలి), శాలివాహ(కుమ్మరి), వడ్డెర, విశ్వబ్రాహ్మణ, రజక(చాకలి) కుల సంఘాలకు ఒక్కో సంఘానికి 400గజాల చొప్పున స్థలం కేటాయించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున కేటాయించారు. ఈ పనులను ఆమె జెడ్పీచైర్ పర్సన్ అనితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

క్లుప్తంగా...

ప్రతికూలతలను అవకాశాలుగా మార్చుకోవాలి

బంజారాహిల్స్: ప్రతికూలతలను అవకాశాలుగా మార్చుకోవాలని బీఎన్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్‌షోలో వక్తలు ఉద్ఘాటించారు. చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తల కోసం సెలబ్రేటింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ది జాయ్ రైడ్ ఆఫ్ రోలర్ కోస్టర్ అనే టాక్‌షోను పార్క్‌హయత్ హోటల్‌లో బిజినెస్ నెట్‌వర్కింగ్ ఇంటర్నేషనల్ నిర్వహించింది. ఈ టాక్‌షోలో పవర్ ప్యాక్‌డ్ ప్యానెల్ సభ్యులు నిమాన్, అమర్‌ప్రీత్ సింగ్, మనీషా సబు, ఎ.అనీష్, సంజనా షా, వేణుగోపాల్ రావు తమ అనుభవాలను పంచుకున్నారు. పారిశ్రామికవేత్తలకు ఎన్నో విలువైన సూచనలు చేశారు. సవాళ్లను ఎలా అధిగమించాలి, వ్యాపారంలో ముందుకు ఎలా వెళ్లాలో తెలిపారు. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో హైటెక్స్‌లో కామధేను ఎస్టేట్స్ బీఎన్ఐ గోనాట్ 2023 నాల్గో ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



డీఏవీ స్కూల్‌లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని డీఏవీ స్కూల్‌లో పోలింగ్ బూత్‌లను శుక్రవారం బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేందర్ పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్లకు దారితీసే గేట్లు, పోలింగ్ బూత్‌లలో వెలుతురు, ఫ్యాన్లు, కిటికీల పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సౌకర్యాలు సమకూర్చాల్సి ఉంటుందా అని అక్కడే ఉన్న నిర్వాహకులను అడిగారు.

పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేస్తాం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న అన్ని పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసి అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ నాగార్జుననగర్‌లో రూ.30 లక్షల 50 వేలతో సీవరేజ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, అప్పుఖాన్, తన్నుఖాన్, మధు, మారుతి, చినబాబు, ఫయా, శివ, సోను, సత్యనారాయణ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల పరిశీలన

హిమాయత్‌నగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా పరిశీలనపై అన్ని పార్టీల నేతలు దృష్టి సారించారు. ఈమేరకు శుక్రవారం భారతీయ జనత పార్టీ నాయకురాలు భార్గవిరెడ్డి ఇతర కార్యకర్తలతో కలసి పలు బూత్‌లలో పర్యటించారు. బూత్‌నెంబర్-7లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు లిస్టులో ఉన్న పేర్లకు సంబంధించిన వ్యక్తులు ఆయా ఇళ్లల్లో ఉంటున్నారా లేదా అనేది గుర్తించారు. ఇలా డోర్ టూ డోర్ వెరిఫికేషన్ చేయడం వల్ల నకిలీ ఓట్లు ఏమైనా ఉంటే బయటపడతాయని భార్గవిరెడ్డి తెలిపారు.

5 నుంచి అంతర్జాతీయ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఏడీఏపీపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ప్రియా హసన్ తెలిపారు. భౌతిక శాస్త్రం, గణితశాస్త్ర విభాగంతో పాటు పూణేలోని యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు పైథాన్‌తో ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణపై నాలుగు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

'సంకల్ప' కృషి అభినందనీయం

సనత్‌నగర్: గత 15 సంవత్సరాలుగా పర్యావరణం పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్‌ను టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య అభినందించారు. సభ్యకార్యదర్శిని సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సుభాష్‌చంద్రబోస్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంకల్ప సంస్థ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 18న ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రుల సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ వివరాలను సభ్యకార్యదర్శికి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్, ప్రకృతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆరేపల్లి రాజేంద్రప్రసాద్, పీసీబీప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, మీడియా కో-ఆర్డినేటర్ సోమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

411 మంది ఉపాధ్యాయుల... బదిలీలకు రంగం సిద్ధం



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

కోర్టు వివాదాలతో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలకు ఎట్టకేలకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపడంతో ఉపాధ్యాయులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల జీవోపై గత మార్చి 14న హైకోర్టు స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ ఉత్తర్వులను మూడు రోజుల క్రితం హైకోర్టు ఎత్తివేసి బదిలీలను కొనసాగించడానికి అనుమతి ఇవ్వడంతో బదిలీలకు మార్గం సుగమం అయ్యింది.

- ఈ నెల 3 నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో మొదలైన ప్రక్రియ
- ఉపాధ్యాయవర్గాల్లో హర్షాతిరేకం

బంజారాహిల్స్: విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ వర్గాల్లో బదిలీలపై ఆశలు చిగురించాయి.

- జోన్ పరిధిలో ఉన్న 17 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 309 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా ఇందులో 237 మంది బదిలీ కానున్నారు. అలాగే 47 ప్రాథమిక పాఠశాలల్లో 206 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా ఇందులో 174 మంది బదిలీ కానున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 411 మంది టీచర్లు బదిలీలకు నోచుకోనున్నారు.
- మరోవైపు భార్యాభర్తలు కలిసి ఉండేందుకు వీలుగా అదనపు పాయింట్ల విషయంలో అంగీకారం తెలపకపోవడంతో జోన్ పరిధిలో పని చేస్తున్న వారికి కొంత అయోమయం నెలకొంది. తుది తీర్పుకులోబడి బదిలీలు, పదోన్నతులు చేపట్టుకోవచ్చని మాత్రం కోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో బదిలీల నిరీక్షణకు కొద్ది రోజుల్లో తెరపడనుంది. అదే విధంగా బదిలీల షెడ్యూల్ జారీని శుక్రవారం జారీచేయడంతో ఈ ప్రక్రియ త్వరితగతిన ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తున్నది.

మరిన్ని దరఖాస్తులు...

- బదిలీల ప్రక్రియ నిలిచిపోయి ఆరు నెలలు గడిచిపోతుండటంతో ఎనిమిదేళ్లు, అయిదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సంఖ్య మరింత పెరగనుంది. కిందటిసారి 2015లో భారీగా ఉపాధ్యాయుల బదిలీల కాగా వారిలో గత జూలై చివరి వారంలో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు అధిక సంఖ్యలో ఉన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.
- అదే విధంగా 2018లో 317 జీవో ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ కొనసాగింది. అనంతరం 2023 జనవరిలో ప్రభుత్వ ఉత్తర్వు 5 ద్వారా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేశారు.
- బదిలీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిన అనంతరం కొంత మంది ఉపాధ్యాయులు ఆ జీవోపై కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ వాయిదా పడింది. ఇటీవలనే కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేస్తూ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు ఆశలు చిగురించాయి.
- షెడ్యూల్ జారీ చేయడంతో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన వారిలో కదలిక మొదలైంది. హైకోర్టు ఇచ్చిన తీర్పును జోన్ పరిధిలోని ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు.

17 మంది పర్మినెంట్ హెచ్ఎంలు

- ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 ఉన్నత పాఠశాలలు ఉండగా అన్నిట్లోనూ ప్రస్తుతం ఇన్‌చార్జ్ హెచ్ఎంలే కొనసాగుతున్నారు. తాజాగా కోర్టు పచ్చజెండా ఊపడంతో పదోన్నతులు పెరిగి కొత్తగా ఈ 17 పాఠశాలలకు పర్మినెంట్‌గా హెచ్ఎంలు నియామకం కానున్నారు. అలాగే 47 ప్రాథమిక పాఠశాలలకు సైతం హెచ్ఎంలు పర్మినెంట్‌గా రానున్నారు.

జహీరానగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



జహీరానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధి కిందకు వచ్చే జహీరానగర్‌లో శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులతో పర్యటించారు. ఇక్కడ సమస్యలపై దృష్టిసారించారు. స్థానికంగా ఏకే టవర్స్ గల్లీలో 300 మీటర్ల మేర డ్రెయినేజీ పైప్‌లైన్ల నిర్మాణం పనులకు ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్‌ను ఆదేశించారు. ఇదే లైన్‌లో కొత్తగా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సర్కిల్-18 జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇక్కడే రెండు లైన్లలో ఫ్లోరింగ్ బండలు వేయాలని సూచించారు. మట్టి కొట్టుకుపోయి రోడ్డంతా మట్టితో నిండిపోతున్నదని ఇక్కడ ప్రహరీ నిర్మించాలని కూడా ఆయన సూచించారు. సీవరేజి పైప్‌లైన్ పూర్తయిన ప్రాంతాల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని తెలిపారు. స్థానికంగా రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు పైప్‌లైన్ ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి వాటి ప్రతిపాదనలు తనకు పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పర్యటిస్తున్న విషయం తెలుసుకున్న జహీరానగర్, నాయుడునగర్, ఉదయ్‌నగర్, గౌరీశంకర్ కాలనీ, సింగాడికుంట, సింగాడిబస్తీ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేయడంతో స్థానికంగా దానం నాగేందర్ జిందాబాద్ నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి, వెంకటేశ్వరకాలనీ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్ పాల్గొన్నారు.

వేడుకగా వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న కీర్తిరెడ్డి తదితరులు

వెంగళరావునగర్: భారతీయ జనతాపార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకురాలు జూటూరి కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో శ్రావణమాసం మూడో శుక్రవారం శ్రీమంగళగౌరీ, వరలక్ష్మి వ్రతం పూజా కార్యక్రమాలు యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వరలక్ష్మి వ్రతంతో పాటుగా పసుపు-కుంకుమ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన దాదాపు 500 మందికి పైగా మహిళలు ఈ పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. పూజలకు హాజరైన మహిళలకు కీర్తిరెడ్డి కానుకగా చీర, పసుపు, కుంకుమ, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌తో పాటుగా రాష్ట్రంలోనూ బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావాలని అమ్మవారిని కోరుతున్నామన్నారు. బీజేపీ సీనియర్ నేతలు కుంభాల గంగరాజు, అల్లం సంగీత, సుప్రియ, బి.రూప, అనంతలక్ష్మి, స్వప్న, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వంటకాలు

బంజారాహిల్స్: సంప్రదాయ ఆసియా వంటకాలతో కూడిన పా పా యా మోడ్రన్ ఏషియన్ హోటల్ జూబ్లీహిల్స్ రోడ్ నెం 82లో శుక్రవారం మాసీవ్ రెస్టారెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జోరావర్ కల్రా ప్రారంభించారు. పా పా యా అనేది సంప్రదాయ ఆసియా వంటకాలకు మారుపేరని ఆ పాకశాస్త్ర వారసత్వాన్ని హైదరాబాద్ వాసులకు అందించాలనే ఇక్కడ ప్రారంభించామన్నారు.



వంటకాలు చూపిస్తున్న జోరావర్ కల్రా

వైభవంగా అష్టలక్ష్మీ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా అష్టలక్ష్మీ హోమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

'సీపీఎస్'తో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం: పీఆర్‌టీయూ



ఆందోళనలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

వెంగళరావునగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. సీపీఎస్ విధానం కారణంగా టీచర్లు పదవీ విరమణ పొందిన తర్వాత తమకు ఎంత పింఛన్ వస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో సీపీఎస్‌ను రద్దు పరిచి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని తీర్మానాన్ని చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నరసింహా, హనుమంతరావు, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య

బంజారాహిల్స్: కులమతాలకు అతీతంగా పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలని బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య కోరారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని అవర్ ప్లేస్ హోటల్‌లో వినాయకచవితి, మిలాద్ ఉన్నబీ పండగలు ఒకే రోజు వస్తుండటంతో మైత్రీ కమిటీ సమావేశం శుక్రవారం సెక్టార్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ రెండు పండగలు ఒకేరోజు వస్తున్నందున సామరస్య పూర్వక వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని, పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మిలాద్ ఉన్ నబీ పండగ రెండు రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని ఈ విషయంలో త్వరలోనే స్పష్టత రానున్నదని అలా జరిగితే రెండు పండగలు ఎవరికి వారే మరింత సంతోషంగా ఊరేగింపు నిర్వహించుకోవచ్చునన్నారు. తమకు తెలిసిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ వెంటనే పోలీసులకు తెలియచేయ్యాలన్నారు. పోలీసులు, ప్రజలు పరస్పర సహకారం అందించుకున్నప్పుడే ప్రశాంతంగా పండగలు నిర్వహించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

మనం స్టోర్ యజమానిపై కేసు నమోదు

బంజారాహిల్స్: సరైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోకుండా రోడ్ల పక్కన అక్రమ పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్న బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని మనం కార్ఖానా యజమాని చైతన్యపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 341 కింద కేసు నమోదైంది. వివరాలివీ... ఇటీవలనే రోడ్ నెం. 12లో మనం కార్ఖానా పేరుతో చాక్లెట్ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఈ రోడ్డంతా అక్రమ పార్కింగ్‌లతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఫ్రీ ఫ్లోకు అంతరాయం ఏర్పడుతున్నది. గురువారం రాత్రి పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎన్నిసార్లు చెప్పినా సదరు యజమాని వినిపించకోకపోవడంతో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు యజమాని ముప్పాల చైతన్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ నమ్మాళ్వార్ల అధ్యయనోత్సవం పరమపదోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం యదావిధి ఆరాధనలు, అర్చనలు, సేవాకాలం, సాయంత్రం శ్రీ స్వామివారి సేవ, ఆళ్వారాధుల సేవ, ప్రబంధ సేవాకాలం, ఆరగింపు, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని అధ్యయనోత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వైష్ణవ సంప్రదాయాల్లో ఈ ఘట్టం ఒక విశేషమని ఆళ్వారాధులు ఎక్కడైతే ఉంటారో అక్కడ తీర్థప్రసాదాలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని ఆలయ అర్చకులు శేషాచార్యులు తెలిపారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విజయనగర్‌కాలనీ: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో శుక్రవారం ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, జీబ్రా క్రాసింగ్ వద్ద వెళ్తున్నప్పుడు వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాస్, ప్రొఫెసర్ వినోద్ గణేష్‌లతో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబంలోని ఓటర్లందరికీ ఒకే బూత్ కేటాయించాలి: బీజేపీ

రహమత్‌నగర్: ఓ కుటుంబంలో ఉన్న ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం కల్పించాలని బీజేపీ నాయకులు ఎన్నికల అధికారిని కోరారు. బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ నేతృత్వంలో యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉండటంతో వారంతా అయోమయానికి గురవుతున్నారని అన్నారు. అలాగే బీఎల్ఓలుగా విధులు నిర్వహిస్తున్న కొంత మంది నిరక్షరాస్యులు కావడంతో సరిగా విధులు నిర్వర్తించలేకుండా పోతున్నారని ఆయన ఆరోపించారు. బోరబండ డివిజన్‌లో దాదాపు నలభై పోలింగ్ స్టేషన్లలో భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరుగా ఉన్నాయని వారందరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడు పూజారి శరణ్‌రెడ్డి, నగర మోర్చా ప్రధాన కార్యదర్శి కుమాన్‌నాయక్, బీజేవైఎం నగర నాయకుడు గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

'కేంద్ర విధానాల వల్లే నిత్యావసరాల పెంపు'



ముషీరాబాద్: దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పేద ప్రజలపై భారాన్ని మోపాయని సీపీఎం ముషీరాబాద్‌జోన్ కార్యదర్శి దశరథ్ ఆరోపించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తా, బడీ మసీదు వద్ద నిరసన చేపట్టారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఎం.దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలను ప్రైవేటు పరం చేస్తూ.. నిరుద్యోగుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నిర్వహించడం లేదన్నారు. ధరలు తగ్గించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు పద్మ, ముషీరాబాద్ జోన్ నాయకులు శ్రీరాములు, బాబు, పాషా, కృష్ణస్వామి, మోహన్, శేఖర్, ఆంజనేయులు, నరేష్ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

పంజగుట్ట: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గత నెల 21వ తేదీన రాత్రి పంజగుట్ట పోలీసులు గస్తీ చేస్తుండగా వారికి అమీర్‌పేట ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడంటూ ఫోన్ వచ్చింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని గమనించగా బ్లాక్ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు వేసుకుని అమీర్‌పేట పిల్లర్ నెంబర్ 1080, అరవింద్ స్టోర్స్ ముందు ఫుట్‌పాట్‌పై పడి ఉన్నాడు. ఇతని వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చి బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి 30వ తేదీన మృతి చెందినట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

3న పద్మశాలీ శంఖారావం

కాచిగూడ: పద్మశాలీ సమాజ సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా ఈనెల 3న ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న పద్మశాలీ శంఖారావం సభను విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలందరూ.. కుటుంబ సమేతంగా పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. పద్మశాలీలను విస్మరించిన పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, అవ్వారు భాస్కర్ తదితరులున్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే...



డాక్టర్ పద్మ వీరపనేని

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజల్లో మార్పు మరింతగా ఏర్పడిందని, బీజేపీతోనే దేశాభివృద్ధి, తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని బీజేపీ జాతీయ మహిళామోర్చా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పోయాయన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని, బీజేపీకి చాన్స్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర రూ. 200 తగ్గించారని, ఉజ్వలయోజన ద్వారా రూ. 400 తగ్గిందని గుర్తుచేశారు. బీజేపీ ప్రజల కష్టాలను తొలగించి, వారి అభ్యున్నతి కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు ఓటుతో తమ గళాన్ని వినిపించి బీజేపీకి అఖండ విజయాన్ని తెలంగాణలో, కేంద్రంలో అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కృష్ణాష్టమి నృత్య ప్రదర్శనకు దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: శ్రీ కృష్ణ జన్మష్టమి సందర్భంగా బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శ్రీకృష్ణవేషధారణ, సంగీతం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లున్న బాలబాలికలు ఈ ప్రదర్శనలో పాల్గొనవచ్చని ఆసక్తి కలిగినవారు ఈనెల 2 లోగా తమ పేర్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494523562.

ఘనంగా భాషా నిలయం వ్యవస్థాపక దినోత్సవం



సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం వ్యవస్థాపక దినోత్సవాలు శుక్రవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని భాషా నిలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్మారక పురస్కారాన్ని కవయిత్రి చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మకు ప్రదానం చేశారు. అదేవిధంగా మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి కవి డాక్టర్ నాళేశ్వరం శంకరానికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం ఎంతో సాహితీ చరిత్ర ఉందన్నారు. భాషా నిలయం అధ్యక్షుడు సూతి శంకర్‌రావు, గౌరవ కార్యదర్శి ఉదయవర్లు, చంద్రప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'రైతే రాజైతే.. వ్యవసాయం పండుగే' పుస్తకావిష్కరణ నేడు

సాక్షి, హైదరాబాద్‌: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం 'రైతే రాజైతే.. వ్యవసాయం పండుగే' పుస్తకాన్ని మధ్యప్రదేశ్‌ మాజీ సీఎం, ఎంపీ దిగ్విజయ్‌సింగ్‌ ఆవిష్కరించనున్నారు. మాజీ ఎంపీ డాక్టర్‌ కేవీపీ రామచంద్రరావు, ఏపీ పీసీసీ మాజీ చీఫ్‌ ఎన్‌.రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో రూపొందిన 'రైతే రాజైతే..' పుస్తకావిష్కరణ హోటల్‌ దసపల్లాలో శనివారం సాయంత్రం 5 గంటలకు జరగనుందని ఎమెస్కో ప్రచురణ సంస్థ బాధ్యుడు విజయ్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్‌ బి.సుదర్శన్‌రెడ్డి పుస్తక తొలి ప్రతిని స్వీకరించనున్నారు. పాత్రికేయుడు పాలగుమ్మి సాయినాథ్‌ కీలకోపన్యాసం చేస్తారు. ఈ సందర్భంగా వైఎస్‌ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించనున్నట్టు విజయకుమార్‌ తెలిపారు.

రెరా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

రెరా చైర్మన్‌ డాక్టర్‌ ఎన్‌.సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రెరా (రియల్‌ ఎస్టేట్‌ రెగ్యులేటరీ అథారిటీ) చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని రెరా చైర్మన్‌ డాక్టర్‌ ఎన్‌.సత్యనారాయణ స్పష్టం చేశారు. రెరా చట్టం అమలు తీరుతెన్ను లు, వివిధ సెక్షన్లపై శుక్రవారం రెరా అధికా రులకు, సిబ్బందికి ప్రజా ఆరోగ్యశాఖ ఇంజనీర్‌ ఇన్‌ చీఫ్‌ కార్యాలయ సమావేశ మందిరంలో బెంగళూరుకు చెందిన అడ్వొకేట్‌ ఈ సోహెల్‌ అహ్మద్, చార్టెర్డ్‌ అకౌంటెంట్‌ వినయ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమాన్ని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాలలో రెరా చట్టం అమలు తీరుతెన్నులపై ఉద్యోగులు అవగాహన తెచ్చుకోవాలన్నారు. కొనుగోలుదారుల ఆసక్తి, హక్కుల మేరకు బిల్డర్లు, ప్రమోటర్లు సకాలంలో నివేదికలు సమర్పించాలని సూచించారు. అడ్వొకేట్‌ ఈ సోహెల్‌ అహ్మద్, చార్టెడ్‌ అకౌంటెంట్‌ టి.వినయ్‌ రెరా చట్టంపై శిక్షణ ఇస్తూ.. బిల్డర్లు, ప్రమోటర్లు ఇచ్చిన హామీల మేరకు నిర్మాణాలు, మౌలిక సౌకర్యాలు విధిగా ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో రెరా సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మీనారాయణ, లీగల్‌ అధికారి చంద్రశేఖర్‌ రెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సత్తయ్య, రెరా పరిపాలన అధికారి గంగాధర్, జాయింట్‌ డైరెక్టర్‌ అశ్విని పాల్గొన్నారు.

వివేకా హత్యతో లబ్ధి పొందింది సునీత, ఆమె భర్తే

ఇతరులెవరికీ ఎలాంటి ప్రయోజనం లేదు



- వివేకా ఆస్తులన్నీ ఆమె, ఆమె భర్త దక్కించుకున్నారు
- హత్య చేసే కారణం కూడా వారికే ఉంది
- దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు సునీత ప్రయత్నిస్తున్నారు
- సునీత బాధితురాలు కాదు.. వివేకానే ఆమె బాధితుడు
- వారి బండారం బయట పడుతుందనే ఇంప్లీడ్‌ పిటిషన్లు... సీబీఐని సునీత శాసిస్తున్నారు
- సునీత ఇంప్లీడ్‌ పిటిషన్‌ను కొట్టేయండి
- హైకోర్టుకు నివేదించిన సునీల్‌ యాదవ్‌ తరపు న్యాయవాది
- విచారణ 8కి వాయిదా

సాక్షి, అమరావతి/సాక్షి, హైదరాబాద్‌: మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్యతో లబ్ధి పొందింది ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాత్రమేనని వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్‌ యాదవ్‌ తరఫు న్యాయవాది టీఎల్‌ నయన్‌ కుమార్‌ తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. హత్య చేసే కారణం కూడా వారికే ఉందని వివరించారు. వివేకా హత్య వల్ల ఇతరులు పొందే ప్రయోజనం ఏమీ లేదన్నారు. వివేకా ఆస్తులన్నీ సునీత, ఆమె భర్త సొంతమయ్యాయని తెలిపారు. తండ్రి ఆస్తులను దక్కించుకున్న తరువాత సీబీఐ దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా సునీత వ్యవహరిస్తున్నారని వివరించారు. ప్రతి కోర్టులో, ప్రతి పిటిషన్‌లో ప్రతివాదిగా చేరుతూ (ఇంప్లీడ్‌) పిటిషన్ల మీద పిటిషన్లతో, అవాస్తవాలతో కోర్టులను తప్పుదోవ పటిస్తున్నారని వివరించారు. ఆమె వాదనలను సీబీఐ న్యాయవాదుల ద్వారా చెప్పిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో సునీత బాధితురాలు కాదని, మృతుడు వివేకానందరెడ్డే ఆమె బాధితుడని చెప్పారు. వారి బండారం బయట పడుతుందన్న భయంతోనే ఇంప్లీడ్‌ పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం దాఖలు చేసిన ఇంప్లీడ్‌ పిటిషన్‌ సైతం ఆ కోవలోకే వస్తుందన్నారు. అందువల్ల దాన్ని కొట్టేయాలని నయన్‌ కుమార్‌ కోర్టును కోరారు. సునీత భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి సహా మరికొందరిపై కడప కోర్టులో ప్రైవేట్‌ ఫిర్యాదు పెండింగ్‌లో ఉందన్నారు.

2021 ఆగస్టు 2 నుంచి జైలులో ఉన్నానని, చార్జిషీట్‌ కూడా దాఖలు చేసినందున, తనకు బెయిల్‌ మంజూరు చేయాలని కోరుతూ సునీల్‌ యాదవ్‌ దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్‌ కూనూరు లక్ష్మణ్‌ శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా నయన్‌ కుమార్‌ వాదనలు వినిపిస్తూ.. 'వివేకా హత్య కేసులో కీలక నిందితుడు, కిరాయి హంతకుడు షేక్‌ దస్తగిరి పిటిషన్‌ను తప్ప ఇతర నిందితుల బెయిల్‌ పిటిషన్లను కొట్టివేయాలని సునీత కోర్టులను కోరుతూ వస్తున్నారు. వివేకానందరెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వాంగ్మూలం ఇచ్చి, ఆయన హత్య చేసిన వారిలో తానూ ఉన్నానని చెప్పిన దస్తగిరికి ఆమె సహకరిస్తున్నారు. అతనికి కింది కోర్టు క్షమాభిక్ష ప్రసాదించడాన్ని, అప్రూవర్‌గా మారేందుకు అనుమతివ్వడంపై సునీత నోరెత్తలేదు. ఆమె న్యాయం కోసం నిస్వార్థంగా వ్యవహరించడం లేదు. స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సమాంతరంగా కేసులను పర్యవేక్షిస్తూ దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారు. ఒక రకంగా సీబీఐని శాసిస్తున్నారు. దీంతో సీబీఐ దర్యాప్తు సైతం పక్కదారి పట్టింది. అంతేకాకుండా కోర్టులకు నిందితులపై తీవ్ర దురభిప్రాయాన్ని కలిగిస్తూ న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు' అని నయన్‌ కుమార్‌ వివరించారు.

ఆస్తి పోతుందన్న భయం సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిలో పెరిగిపోయింది

'తన తండ్రి షేక్‌ షమీమ్‌ అనే మహిళను వివాహం చేసుకున్నారని, వారికి ఒక కొడుకు ఉన్నాడని, వారికి రూ.8 కోట్లు కూడా ఇవ్వాలని తన తండ్రి భావించారని, ఈ కారణంగానే తండ్రితో సత్సంబంధాలు లేవని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్పష్టంగా చెప్పారు. ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి కూడా ఇదే చెప్పారు. ఆస్తి పోతుందన్న భయం సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిలలో పెరిగిపోయింది. రాజశేఖర్‌రెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్‌ రెడ్డి, మరికొందరు వివేకా హత్యకు కారణమంటూ మరో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ కడప జిల్లా కోర్టులో ప్రైవేట్‌ ఫిర్యాదు దాఖలు చేశారు. అది పెండింగ్‌లో ఉంది. తులసమ్మ, షేక్‌ షమీమ్‌ మరికొందరు సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం వివేకాను హత్య చేసే కారణం సునీతకు, ఆమె భర్తకే ఉంది. సునీల్‌ యాదవ్‌కు ఈ హత్యతో ఎలాంటి సంబంధం లేదు. కావాలనే అతన్ని ఇరికించారు. వివేకా ప్రజా జీవితంలో తన వ్యక్తిత్వానికి మచ్చ లేకుండా, నిస్వార్థ మానవుడిగా, ప్రజల ప్రియతమ నాయకుడిగా పులివెందుల ప్రజల హృదయాల్లో ఇప్పటికీ ఉన్నారు' అని నయన్‌ నివేదించారు.

న్యాయమూర్తిపైనే ఆరోపణలు చేసే స్థాయికి వెళ్లింది

'నిందితులకు వ్యతిరేకంగా కోర్టులో ప్రతి విచారణకు ఆమె హాజరవుతున్నారు. న్యాయమూర్తి ముందు కూర్చోవడమే కాకుండా తన న్యాయవాదితో వెనక నుంచి చర్చిస్తూ, సూచనలిస్తూ, దర్యాప్తు వివరాలను తానే అందిస్తున్నా అనేలా వ్యవహరిస్తున్నారు. ఈ చర్యల వల్ల.. ఓ వర్గం మీడియా ఏకంగా హైకోర్టు న్యాయమూర్తిపైనే తీవ్రస్థాయి అవినీతి ఆరోపణలు చేసే స్థాయికి వెళ్లింది. ఇదే కేసులో మరో నిందితుడి బెయిల్‌ పిటిషన్‌ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ బెయిల్‌ పిటిషన్‌లో సీబీఐ తరఫున వాదించడానికి ఢిల్లీ నుంచి సీనియర్లు వస్తున్నారు. వారికి స్థానిక న్యాయవాదులు, అధికారులు సహకరిస్తున్నారు. సునీత వాదనలు అనవసరం. హత్య జరిగిన రోజున సునీల్‌ యాదవ్‌ ఎక్కడెక్కడికి వెళ్లారో చెప్పేందుకు గూగుల్‌ టేక్‌ అవుట్, దస్తగిరి వాంగ్మూలంపై సీబీఐ ఆధారపడింది. గూగుల్‌ టేక్‌ అవుట్‌లో పేర్కొన్న సమయాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. గూగుల్‌ టేక్‌ అవుట్‌ విషయంలో తప్పు జరిగిందని సీబీఐ కూడా ఒప్పుకుంది. అని నయన్‌కుమార్‌ కోర్టుకు వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, సీబీఐ వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు.

అజేయ కల్లం పిటిషన్‌పై కౌంటర్‌ దాఖలు చేయండి

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 15కి వాయిదా
- సీబీఐ నా వాంగ్మూలాన్ని వక్రీకరించింది
- ఆ విషయాలను చార్జిషీట్‌ నుంచి తొలగించేలా ఆదేశించండి
- హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసిన కల్లం

సాక్షి, హైదరాబాద్‌: మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తన వాంగ్మూలాన్ని వక్రీకరించిందని, తాము చెప్పని విషయాలను చెప్పినట్లు చార్జిషీట్‌లో పేర్కొందని, వాటిని చార్జిషీట్‌ నుంచి తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లం దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌లో పూర్తి వివరాలతో కౌంటర్‌ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. పిటిషన్‌ కాపీని సీబీఐ న్యాయవాదికి అందచేయాలని కల్లం తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కూనురు లక్ష్మణ్‌ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. తాను చెప్పని విషయాలను చెప్పినట్టు సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొన్నందున వాటిని చార్జిషీట్‌ నుంచి తొలగించాలంటూ అజేయ కల్లం ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. నంబర్‌ కేటాయించేందుకు నిరాకరించింది. దీంతో ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్‌ లక్ష్మణ్‌ రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి, కల్లం పిటిషన్‌కు నంబర్‌ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రీ కల్లం పిటిషన్‌కు నంబర్‌ కేటాయించింది. ఈ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్‌ లక్ష్మణ్‌ ముందు విచారణకొచ్చింది. ఈ సందర్భంగా అజేయ కల్లం తరఫున సీనియర్‌ న్యాయవాది తోట సూర్యకరణ్‌రెడ్డి, న్యాయవాది పి.వీర్రాజు వాదనలు వినిపించారు. '2023 ఏప్రిల్‌ 29న సీఆర్‌పీసీ సెక్షన్‌ 161 కింద అజేయ కల్లం వాంగ్మూలాన్ని సీబీఐ విచారణాధికారి వికాస్‌కుమార్‌ నమోదు చేశారు. చార్జిషీట్‌లో మాత్రం ముఖేశ్‌శర్మ అనే అధికారం సంతకం చేశారు. ఈ ముఖేశ్‌శర్మ ఎవరనేది కల్లంకు అసలు తెలియదు. విచారణాధికారి వికాస్‌కుమార్‌ పూర్తి ఏకపక్షంగా వ్యవహరించారు. ఈ కారణంగానే ఆయనను సుప్రీంకోర్టు మార్చింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి నుంచి చట్టపరంగా వాంగ్మూలం నమోదు చేసే విధానం ఏంటో వికాస్‌కుమార్‌కు తెలియదు. కల్లం చెప్పని విషయాలను చెప్పినట్టు రికార్డ్‌ చేయడమే కాకుండా, చెప్పిన విషయాలను మరో అర్థం వచ్చేలా మార్చారు. ఇది చాలా తీవ్రమైన అంశం. అందుకే తమకు జరిగిన అన్యాయాన్ని హైకోర్టు దృష్టికి తెచ్చేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశాం. సీబీఐ తప్పుగా, అర్థం మారేలా నమోదు చేసిన వివరాలను చార్జిషీట్‌ నుంచి తొలగించేలా ఆదేశాలివ్వండి' అంటూ వారు కోర్టును కోరారు.

విభజన రాజకీయాలను తిప్పికొడదాం

మండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌ ముదిరాజ్‌



సాక్షి, హైదరాబాద్‌: భిన్న కులాలు, జాతులు, మతా ల సమాహారమైన భారత్‌లో కులమతాల పేరిట ప్రజలను విభజించి గద్దెను ఎక్కేందుకు కొన్ని పార్టీలు చేస్తున్న ప్రయత్నాలను పౌరసమాజం తిప్పికొట్టాలని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌ ముదిరాజ్‌ పిలుపునిచ్చారు. శాసనమండలి కార్యాలయంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్‌ జూలూరు గౌరీశంకర్‌ సంపాదకత్వంలో వెలువరించిన 'మణిపూర్‌ మంటలు'అనే పుస్తకాన్ని శుక్రవారం బండా ప్రకాశ్‌ ఆవిష్కరించారు. 140 కోట్ల మంది ప్రజలను తల్లికోడిలా రెక్కల కింద దాచుకోవలసిన కేంద్ర ప్రభుత్వం, మణిపూర్‌లో జరుగుతున్న అమానుష హింసాకాండను పట్టించుకోవడం లేదని అన్నారు. జూలూరు గౌరీశంకర్‌ మాట్లాడుతూ గంగా జమునా తెహజీబ్‌ సంస్కృతికి ఆల వాలమైన తెలంగాణ.. మతసామ రస్యానికి ప్రతీకగా దేశానికి మోడల్‌ గా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌ బుక్‌ ఫెయిర్‌ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

'పెరికలకు ప్రాధాన్యమివ్వండి'

సాక్షి, హైదరాబాద్‌: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పెరిక కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని, మంచిర్యాల, వరంగల్‌తూర్పు, పరకాల, మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని పెరికల రాజకీయ ఐక్యత –పెరిక కుల కార్పొరేషన్‌ సాధన సమితి కాంగ్రెస్‌ నేతలను కోరింది. ఈ మేరకు టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మన్‌ ముత్తినేని వీరయ్య వర్మ, ముత్తె సత్తయ్య వర్మ, వెంబడి రవీందర్‌వర్మల నేతృత్వంలో పలువురు పెరిక కులస్తులు కాంగ్రెస్‌ మాజీ ఎంపీ వి.హను మంతరావును కలిశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వీహెచ్‌.. పార్టీలో ఈ విషయమై చర్చిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను వినతిపత్రాన్ని అందజేశారు.




టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌ గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న పెరికల రాజకీయ ఐక్యత కమిటీ నేతలు

కాలేజ్‌ ఆఫ్‌ వార్‌ఫేర్‌ కమాండ్‌ ఆఫీసర్‌గా వడోద్కర్‌

సాక్షి, హైదరాబాద్‌ : సికింద్రాబాద్‌లోని ఎయిర్‌ వార్‌ఫేర్‌ కాలేజీ కమాండ్‌ ఆఫీసర్‌గా ఎయిర్‌ వైస్‌ మార్షల్‌ పీఎస్‌ వడోద్కర్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నేషనల్‌ డిఫెన్స్‌ కాలేజీ పూర్వ విద్యార్థి అయిన వడోద్కర్, 1990లో భారత వాయుసేనలో చేరారు. భారత వాయుసేనకు చెందిన వివిధ ఎయిర్‌క్రాఫ్టలను 3వేల గంటలపాటు నడిపిన అనుభవం ఉంది. ఫైటర్‌ స్క్వాడ్రన్‌లోనూ ఆయన పలు కీలక ఆపరేషన్లకు నాయకత్వం వహించారు. ఎయిర్‌ ఆపరేషన్స్‌తోపాటు గ్రౌండ్‌ ఎటాక్, వ్యూహాత్మక దాడుల్లోనూ ఎయిర్‌ వైస్‌ మార్షల్‌ వడోద్కర్‌ నిపుణుడు.

నగర వార్తలు

3న వ్యవస్థాపక దినోత్సవం



ఏజీవర్సిటీ: ఈ నెల 3న ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్య అతిథిగా నల్సార్‌ విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ కృష్ణదేవ రావు హాజరవుతారని చెప్పారు.

సాక్షి రియల్టీ



ఆఫీసు స్పేస్‌ అధరహో..

- ఈ ఏడాది 4 నుంచి 4.5 కోట్ల చ.అ. లావాదేవీలు
- స్థిరమైన ఆర్థిక వృద్ధే ఇందుకు కారణం
- హైదరాబాద్‌లో 40–60 లక్షల చ.అ. లీజులు
- కొలియర్స్‌ తాజా నివేదిక అంచనా

నగరాల వారీగా ఆఫీసు స్పేస్‌ లావాదేవీలు (చ.అ. లక్షల్లో)

నగరం	క్యూ1	క్యూ2	వృద్ధి%
బెంగళూరు	32	34	5
ఢిల్లీ–ఎన్‌సీఆర్	22	31	41
చెన్నై	16	33	113
హైదరాబాద్	13	15	19
ముంబై	10	16	61
పుణే	8	17	109


సాక్షి, హైదరాబాద్‌: ఈ ఏడాది దేశంలోని ఆరు ప్రధాన నగరాలలో 4–4.5 కోట్ల చ.అ. కార్యాలయ స్థల లావాదేవీలు జరుగుతాయని కొలియర్స్‌ నివేదిక అంచనా వేసింది. స్థిరమైన ఆర్థిక దృక్పథంతో పాటు అమెరికా, యూకే, యూరప్‌ దేశాలకు ప్రధాన వ్యాపార వనరు ఇండియా కావటంతో ఇక్కడి ఆఫీసు స్పేస్‌పై సానుకూల ప్రభావం ఉంటుందని తెలిపింది. మరోవైపు రెపో రేట్లు స్థిరమైన దశలోకి చేరుకున్నప్పటికీ జీఎస్‌టీ వసూళ్లు, తయారీ, సేవా రంగాలు, ఈక్విటీ మార్కెట్ల వేగంతో ఈ వృద్ధి అవకాశాలున్నాయని కొలియర్స్‌ ఆఫీసు సర్వీసెస్‌ ఎండీ పీష్‌ జైన్‌ అన్నారు.

- ఆరు నగరాలలో ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.01 కోట్ల చ.అ. స్థూల ఆఫీసు స్పేస్‌ లావాదేవీలు జరిగాయి. రెండో త్రైమాసికం (క్యూ2) నాటికి 46 శాతం వృద్ధి రేటుతో 1.46 కోట్ల చ.అ. లీజు కార్యకలాపాలు జరిగాయి. ఈ ఏడాది క్యూ1లోని ఆఫీసు స్పేస్‌ లావాదేవీలలో టెక్నాలజీ రంగం వాటా 24 శాతంగా ఉండగా.. 18 శాతం ఫ్లెక్సిబుల్‌ స్పేస్, 17 శాతం ఇంజనీరింగ్‌ మరియు తయారీ రంగం వాటాలున్నాయి. క్యూ2 నాటికి టెక్నాలజీ, బీఎఫ్‌ఎస్‌ఐ రంగాలు 50% వృద్ధిని సాధించాయి. ఇంజనీరింగ్, తయారీ రంగాలు క్యూ1తో పోలిస్తే రెండు రెట్లు పెరిగాయి. కీలక రంగాలలో ఆరోగ్యకరమైన వృద్ధి, లీజుదారులకు విశ్వాసం పెరగడం వంటి కారణంగా ఈ వృద్ధి కొన సాగే అవకాశం ఉంది.

నగరంలో 40–60 లక్షల చ.అడుగులు

- హైదరాబాద్‌లో క్యూ1లో 13 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్‌ లావాదేవీలు జరగగా.. క్యూ2 నాటికి 19 శాతం వృద్ధి రేటుతో 15 లక్షల చ.అ.లకు పెరిగింది. ఈ ఏడాది ముగింపు నాటికి సుమారు 40–60 లక్షల చ.అ. లీజు కార్యకలాపాలు జరుగుతాయని కొలియర్స్‌ అంచనా వేసింది. వివిధ విభాగాలలో డిమాండ్, వ్యాపార సెంటిమెంట్‌ ఈ వృద్ధికి కారణమని పేర్కొంది.

విలువల భాండాగారం ఉపాధ్యాయులే



సదస్సులో మాట్లాడుతున్న ఐక్యరాజ్యసమితి భారతదేశ మాజీ ప్రతినిధి సయ్యద్‌ అక్బరుద్దీన్‌

సనత్‌నగర్‌: సాంకేతికపరంగా కృత్రిమ మేధస్సు ఎంతగా అభివృద్ధి చెందినా ఉన్నత విలువల భాండాగారం ఉపాధ్యాయులేనన్న విషయాన్ని నేటితరం మరిచిపోకూడదని ఐక్యరాజ్యసమితి భారతదేశ మాజీ ప్రతినిధి సయ్యద్‌ అక్బరుద్దీన్‌ స్పష్టం చేశారు. బేగంపేటలోని హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌ (హెచ్‌పీఎస్‌) సెంటెనరీ ఎడ్యుకేటర్స్‌ కాన్ఫరెన్స్‌ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సయ్యద్‌ అక్బరుద్దీన్‌ మాట్లాడుతూ మనం డిజిటల్‌ విద్యా యుగంలో ఉన్నామని, అందుకనుగుణంగా తరగతి గదులను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుకుంటూనే సాంకేతిక నైపుణ్యానికి పదును పెట్టుకుంటున్నామన్నారు. అయితే డిజిటల్‌ తరగతి గదులు, రోబోట్‌లు విలువలను నేర్పుతాయనుకుంటే పొరపాటేనని, ఉపాధ్యాయులతోనే ఆ విలువలు అలవడతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు సహజంగా రాయగల సామర్థ్యాన్ని కోల్పోతున్నారని అభిప్రాయపడ్డారు. యునెస్కో ఎంజీఐఈపీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ అనంత దురైయప్ప మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పదేళ్ల లోపు ఉన్న 70 శాతం మంది పిల్లలు చదవలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక వికాసం కోసం ప్రభుత్వాలతో పాటు బహుళ జాతి సంస్థలు తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. పిల్లలను వారి అభిరుచులకు తగ్గట్లుగా ఉన్నతంగా తీర్చి దిద్దాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్‌ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జే నోరియా, ప్రిన్సిపాల్‌ స్కంద్‌బాలితో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ సంస్కరణలు ఆదర్శనీయం



చర్లపల్లి జైల్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కర్ణాటక జైళ్లశాఖ అధికారిణి

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమం కోసం తెలంగాణ జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలు ఆదర్శనీయమని కర్ణాటక జైళ్లశాఖ అధికారిణి మాలిని కృష్ణమూర్తి ఐపీఎస్‌ అన్నారు. శుక్రవారం ఆమె బెంగుళూరు అగ్రహారం సీనియర్‌ సూపరింటెంట్‌ సురేష్‌తో కలిసి చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌ కుమార్‌ రాయ్‌ ఆధ్వర్యంలో ఆమెకు స్వాగతం పలికి గౌరవ వందనం చేశారు. అనంతరం వారికి జైలు పనితీరు, ఖైదీల సంక్షేమానికి తెలంగాణ జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలు, జైల్‌లో ఖైదీల ఉత్పత్తులు, ఆసుపత్రి, అన్నపూర్ణల పనితీరును సంతోష్‌ కుమార్‌ రాయ్‌ వివరించారు. అనంతరం వారు ఖైదీలతో మాట్లాడారు. ఉత్పత్తులను పరిశీలించి బేష్‌ అంటు కితాబునిచ్చారు. కార్యక్రమంలో జైల్‌ ఉప పర్యవేక్షణాధికారి ఎం. కృష్ణమూర్తి, వి.శశికాంత్, వైద్యాధికారి డాక్టర్‌ వెంకటేష్‌ పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



శంషాబాద్‌ రూరల్‌ : సామాజిక ఆరోగ్యానికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మండలంలోని ముచ్చింతల్‌ శివారులో ఉన్న స్వర్ణ భారత్‌ ట్రస్టు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న కేన్సర్, ఇతర వ్యాధులను అరికట్టడానికి మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పునరుద్ధరించుకోవడం అత్యవసరమని చెప్పారు. ఈ దిశగా వైద్య నిపుణులు ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావాలన్నారు. కేన్సర్‌ వ్యాధిగ్రస్తులు తీవ్ర బాధను అనుభవించడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో పొగాకు వాడకంతో ఊపిరితిత్తుల కేన్సర్‌ పెరుగుతున్నట్లు వైద్య అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పొగాకు వాడకం ఎక్కువగా ఉందని, వీటి ఉత్పత్తుల సేవనంతో వచ్చే నష్టాలను వైద్యులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసే పోషకాహార ఉత్పత్తులను పెంచడానికి ఫుడ్‌ ప్రాసెసింగ్‌ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు హైదరాబాద్‌ చాప్టర్‌ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్‌ విష్ణుస్వరూప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని మార్చండి

రాజేంద్రనగర్‌: రాష్ట్ర హోంమంత్రిని మార్చి చురుకైన వారిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఉత్తరప్రదేశ్‌ హోమ్‌ మినిస్టర్‌ను చూసి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఎంతో తెలుసుకోవాల్సి ఉందన్నారు. శుక్రవారం ఉదయం రాజాసింగ్‌ రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం హత్యకు గురైన రాహుల్‌సింగ్‌ కేసు విషయమై రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. రాజాసింగ్‌ వచ్చిన సమయంలో ఏసీపీతో పాటు సిఐ, డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎవరు లేకపోవడంతో అరగంట పాటు అక్కడే ఉండి ఎస్సైతో మాట్లాడి వెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మంగళవారం హత్యకు గురైన రాహుల్‌సింగ్‌ కేసులో ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. నలుగురిని పోలీసులు పట్టుకున్నారని తెలుస్తుందని వారు ఎవరు, వారి వెనకాల ఉన్నది ఎవరు, హత్యకు గల కారణాలు పూర్తిగా విచారించాలన్నారు. డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌పై తమకు నమ్మకం ఉందని కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. రాష్ట్రంలో గుండాలు, రౌడీల రాజ్యం నడుస్తోందన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యత తమకు అప్పగిస్తే తాము ఏమిటో చూపిస్తామన్నారు. రౌడీయిజం, మర్డర్లు చేసేవారు ఒకటికి వంద సార్లు ఆలోచిస్తారన్నారు.



రాజేంద్రనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఎస్‌ఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌

కొత్త ఓటరు లిస్టు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

పంజగుట్ట: ఓట్లలిస్టులో ఎన్నో అవకతవకలు ఉన్న నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ఓట్ల లిస్టు పూర్తిగా రద్దుచేసి నిజాయతీతో, జవాబుదారీతనంగా కొత్తలిస్టు తయారు చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీవోడబ్ల్యూ సంధ్య, సామాజిక కార్యకర్తలు లుబ్నాసర్వత్, సారామాథ్యూస్, జాస్మిన్, సజయలు పాల్గొన్నారు సారామాథ్యూస్‌ మాట్లాడుతూ .. గత ఎన్నికల కన్నా ముందు తన ఓటు చెక్‌ చేసుకోగా ఓటు ఉందని, కాని ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు వెళితే తన ఓటుగల్లంతయ్యిందన్నారు. ఓటు మిస్‌ అయితే తిరిగి పొందేందుకు ఎలాంటి ఆప్షన్‌ లేకపోవడం బాధాకరమని, కొత్త ఓటు కోవాల్సిందే అని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. లుబ్నాసర్వత్‌ మాట్లాడుతూ .. 2020లో గ్రేటర్‌ మున్సిపల్‌ ఎన్నికల సమయంలో ఓటర్‌ లిస్టు ఫోటోలతో సహా వచ్చిందని అప్పుడు తాను ఆసిఫ్‌నగర్‌ 72వ వార్డు నుండి అభ్యర్థిగా ఉన్నానని, అప్పుడు చూస్తే ఒకే ఫోటోతో రెండు నుండి ఆరు ఓట్లు ఉన్నాయన్నారు.

ఉద్యాన వ్యవసాయ పోకడలపై అవగాహన సదస్సు

ఏజీవర్సిటీ: దేశాభివృద్ధిలో హార్టికల్చర్‌ ఎంతో దోహదపడుతుందని అంబాసిడర్‌ డెసిగ్నేట్‌ ఆఫ్‌ ఇండియా టు రిపబ్లిక్‌ ఆఫ్‌ కజకిస్తాన్‌ ప్రతినిధి డాక్టర్‌ టీవి నాగేంద్రప్రసాద్‌ అన్నారు. శుక్రవారం శ్రీ కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉపకులపతి డాక్టర్‌ నీరజ ప్రభాకర్‌ అధ్యక్షతన ఉద్యాన వ్యవసాయ పోకడలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రస్తుతం ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారి సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారన్నారు. పీజీ డీన్‌ డాక్టర్‌ రాజశేఖర్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేంద్రప్రసాద్‌

తికమక తెలుగుతో

ప్రయాణికుల తకరారు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గందరగోళం

ఇంగ్లిష్, హిందీ వరకు ఓకే.. తెలుగులోనే ఇష్టారాజ్యం

నగం తెలుగులో.. నగం బెంగాలీలో వివరాలు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల సమాచారం తెలిపే ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల్లో వినియోగిస్తున్న సరికొత్త భాష ప్రయాణికులను అయోమయానికి గురి చేస్తోంది. సహజంగా ఊరి పేరు డిస్‌ప్లే చేస్తారు. కానీ ఘనత వహించిన దక్షిణ మధ్య రైల్వేలో మాత్రం ఊళ్ల పేర్లకు అర్థాలు వెదికీ మరీ ప్రయాణికుల ముందుంచుతున్నారు. అది కూడా గూగుల్‌తో అనుసంధానించి మరీ తర్జుమా చేస్తున్నారు. దాంతో ప్రయాణికులకు సమాచారం ఇవ్వటం అటుంచి.. వారిని మరింత తికమకపెట్టి అయోమయానికి గురి చేస్తున్నారు.

➤ దేశంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఒకటైన సికింద్రాబాద్ స్టేషన్‌లో ఈ తికమక తంతు ఎలా ఉందో కళ్లకు కట్టే ఉదాహరణ ఇది. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కేంద్రంగా ఉన్న రైల్ నిలయానికి అతి సమీపంలో ఉన్న ఈ స్టేషన్‌లో నిత్యం లక్షల మంది ప్రయాణికులు కళ్లప్పగించి చూసే రైళ్ల వివరాలను తెలిపే ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డు ఇది.





➤ తమిళనాడులోని ఎరోడ్ పట్టణానికి వెళ్లే స్పెషల్ రైలుకు సంబంధించి వివరాలు డిస్‌ప్లే బోర్డు మీద కనిపిస్తున్నప్పుడు ఇంగ్లిష్, హిందీలో సరిగానే ఉంది. కానీ తెలుగులో ప్రత్యక్షమైనప్పుడు విస్తుపోవటం ప్రయాణికుల వంతవుతోంది. ''ఎరోడ్ స్పెషల్''అన్న రెండు పదాలకు తెలుగులో ''క్షీణించు ప్రత్యేక''అని కనిపిస్తోంది. ఎరోడ్ అన్నది ఊరు పేరు అన్న విషయం కూడా మరిచి, దాన్ని ఆంగ్ల పదంగానే భావిస్తూ తెలుగులోకి తర్జుమా చేసేశారు. ఎరోడ్ అన్న పదానికి క్షీణించటం, చెరిగిపోవటం అన్న అర్థాలుండటంతో తెలుగులో క్షీణించు అన్న పదాన్ని డిస్‌ప్లే బోర్డులో పెట్టేశారు. స్పెషల్ అంటే ప్రత్యేక అన్న పదాన్ని జోడించారు.

తెలుగులోకి బెంగాలీ పదాలు..

➤ ఇది స్టేషన్‌లోనికి వెళ్లే ప్లాట్‌ఫామ్ నెం.10 వైపు ప్రధాన మార్గం. ఎదురుగా భారీ ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసి రైళ్ల వివరాలు ప్రదర్శిస్తారు. అందులో నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు రావటంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొంటూ దాని వేళలను మార్చారు. ఆ విషయం ప్రయాణికులకు తెలిపేందుకు డిస్‌ప్లే బోర్డులో ఆ వివరాలు ఉంచారు. ఇంగ్లిష్‌లో ఆ రైలు పేరు ఎదురుగా రీషెడ్యూల్ అని రాసి తర్వాత కొత్త సమయాన్ని ఉంచారు. హిందీలో పరివర్తిత్ సమయ్ అని పేర్కొన్నారు. కానీ తెలుగులో ఆ



ఎక్స్‌ప్రెస్ పేరు ఎదురుగా బెంగాలీ భాష పదాన్ని ఉంచారు. తెలుగుకు, బెంగాలీకి తేడా తెలియని సిబ్బంది నిర్వాకమిది. ఇంగ్లిష్, హిందీ తెలియని తెలుగు ప్రయాణికులకు ఈ వ్యవహారం మతి పోగొడుతోంది. అర్థం కాని తికమక వ్యవహారంతో వారికి రైళ్ల సమాచారం సరిగా చేరటం లేదు.

ప్రైవేటు సిబ్బంది నిర్వాకం

రైళ్ల వివరాలను వాయిస్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలపటం, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా తెలిపే పనిని రైల్వే టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఆ బాధ్యత చూసే సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ గందరగోళం నెలకొంది. సాంకేతికంగా ఏదైనా తప్పు జరిగితే వెంటనే గుర్తించాల్సిన రైల్వే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ తికమక తెలుగు సమస్య ఇప్పటివరకు పరిష్కారమవ్వలేదు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

వరుసగా అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల బదిలీల ఆదేశాలు జారీ చేస్తారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఏక కాలంలో చేపడతారు. అయితే, ముందుగా హెచ్‌ఎంలను బదిలీ చేస్తారు. ఈ విధంగా అయిన ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల కల్పించి, బదిలీలు చేస్తారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతుల ద్వారా భర్తీ అయిన స్థానాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించి, వారిని బదిలీలు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం అక్టోబర్ 3వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అక్టోబర్ 5 నుంచి 19 వరకూ బదిలీలు, పదోన్నతులపై అభ్యంతరాలుంటే అప్పీలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. సీనియారిటీ జాబితా రూపొందించేందుకు అవసరమైన మార్గదర్శకాలను విద్యాశాఖ విడుదల చేయాల్సి ఉంది.

జనవరి షెడ్యూల్‌కు స్వల్ప మార్పులు

ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన షెడ్యూల్‌కు స్వల్ప మార్పులు చేశారు. ఒకే స్థానంలో మూడేళ్ళు పనిచేసిన వారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. టీచర్లు గరిష్టంగా 8 ఏళ్ళు, హెచ్‌ఎంలు 5 ఏళ్ళు ఒకేచోట పనిచేస్తే విధిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ సర్వీస్ కటాఫ్ తేదీ గతంలో ఫిబ్రవరి 1గా ఉండేది. ఇప్పుడు దీన్ని సెప్టెంబర్ 1గా నిర్ణయించారు. ఈ కారణంగా మరికొంతమంది బదిలీలకు అర్హులవుతారు. రిటైర్మెంట్‌కు 3 ఏళ్ళలోపు సర్వీస్ ఉంటే బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. కటాఫ్ తేదీ మారడంతో ఈ విభాగంలోనూ కొత్తగా వచ్చే సర్వీస్‌ను పరిగణనలోనికి తీసుకుంటారు. ఆన్‌ డ్యూటీ పొందే ఉపాధ్యాయ సంఘాల నేతలకు సీనియారిటీలో పది పాయింట్లు ఇవ్వడాన్ని కోర్టు వ్యతిరేకించింది. దీంతో ఈ ఆప్షన్ తొలగించి కొత్త సీనియారిటీ జాబితాను రూపొందించాల్సి ఉంది.

సీనియారిటీ దగ్గరే తికమక

ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో జిల్లా అధికారులు టీచర్ల సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్నారు. దాదాపు 10 వేల మంది పదోన్నతులకు, 58 వేల మంది బదిలీలకు అర్హులని లెక్కగట్టారు. అయితే, సినియారిటీ జాబితా రూపకల్పన చేయాలని అధికారులు ఆదేశించినా, అందుకు తగిన మార్గదర్శకాలు ఇవ్వలేదని డీఈవోలు అంటున్నారు. ఈ కారణంగా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీని పదోన్నతి కోసం రూపొందించడంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎస్‌ఏల్లో ఫిజిక్స్, మేథ్స్.. ఇలా వివిధ సబ్జెక్టుల బోధకులు ఉంటారు. కేటగిరీ వారీగా సీనియారిటీని తీసినప్పుడు ఒకరి కన్నా ఎక్కువ మంది తేలినప్పుడు ఎవరిని మొదటి స్థానంలో ఉంచాలని, ఎవరికి హెచ్‌ఎం పదోన్నతి కల్పించాలనేది ఇబ్బందిగా ఉందని డీఈవోలు చెబుతున్నారు. హెచ్‌ఎం పోస్టులు మల్టీ జోనల్ అయినప్పుడు 14 జిల్లాల ఎస్‌ఏ సీనియారిటీని తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో ఉద్యోగి చేరిన తేదీ, డీఎస్సీలో వచ్చిన మార్కులను పరిగణనలోనికి తీసుకుని సీనియారిటీ రూపొందిస్తారు. అప్పటికీ ఒకరికన్నా ఎక్కువ ఉంటే, డీఎస్సీలో ప్రతీ సబ్జెక్టులో వచ్చిన మార్కులు, జాయినింగ్ తేదీ, ఇంకా కావాలంటే పుట్టిన తేదీని పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. వీటికి సంబంధించి మార్గదర్శకాలు వస్తే తప్ప ఇది సాధ్యం కాదని డీఈవోలు అంటున్నారు. వికలాంగుల విషయంలోనూ ఇంత వరకూ నిర్ణయం తీసుకోలేదు. 40 శాతం అంగవైకల్యాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని కోర్టు తెలిపింది. గత షెడ్యూల్‌లో 70 శాతం వైకల్యాన్ని అర్హతగా పేర్కొన్నారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ఇదీ...

తేదీ	చేయాల్సిన కార్యక్రమం
సెప్టెంబర్ 3 నుంచి 5	ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
6, 7	ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీలను డీఈవోలకు సమర్పించడం
8, 9	దరఖాస్తు చేసిన వారి పేర్ల ప్రదర్శన
10, 11	అభ్యంతరాల స్వీకరణ
12, 13	సీనియారిటీ జాబితా వెల్లడి
14	ఎడిట్ ఆప్షన్లు
15	ఆన్‌లైన్ ద్వారా హెచ్‌ఎంల బదిలీ
16	ప్రధానోపాధ్యాయ పోస్టుల ఖాళీల వెల్లడి
17 నుంచి 19	స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంలుగా ప్రమోషన్స్
20, 21	ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వెల్లడి
21	ఎస్‌ఏలకు వెబ్ ఆప్షన్లు
22	ఎడిట్ ఆప్షన్ అవకాశం
23, 24	స్కూల్ అసిస్టెంట్ బదిలీలు
24	స్కూల్ అస్టింట్ ఖాళీల వెల్లడి
26 నుంచి 28	ఎస్జీటీనుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు
29 నుంచి 31	ఎస్‌జీటీ ఖాళీల వెల్లడి
అక్టోబర్ 2	ఎస్‌జీటీ ఎడిట్ ఆప్షన్స్
3	ఎస్జీటీ, భాషాపండితులు, పీఈటీల బదిలీలు
5 నుంచి 19 వరకు	అప్పీల్ చేసుకునే అవకాశం

కొత్తవి ఇవ్వరు.. పాతవాటిలో చేర్చరు

రాష్ట్రవ్యాప్తంగా పదిలక్షలకు పైగా రేషన్ దరఖాస్తులు పెండింగ్

కొత్త రేషన్‌కార్డుల ఊసే లేదు. పాత కార్డుల్లో కుటుంబసభ్యుల పేర్ల నమోదు చేస్తారా అంటే అదీ లేదు. రాష్ట్రవ్యాప్తంగా 10,34,018 మంది కొత్తగా పేర్లు చేర్చాలంటూ దరఖాస్తు చేశారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతీదానికి రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో లక్షల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – సాక్షి, సిద్దిపేట

మీసేవ కేంద్రాల్లో 2021 ఆగస్టు నుంచి కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల ఆప్షన్ తొలగించారు. అప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ నిలిచిపోయింది. పెళ్లి తర్వాత ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడి.. కొత్త కుటుంబాల సంఖ్య పెరుగుతోంది. అయితే వీరు రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న దళితబంధు, బీసీ, మైనార్టీ బంధులకు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే అర్హులని ప్రభుత్వం ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా కార్డులు లేక అనేకమంది నష్టపోతున్నారు.



➤ రాష్ట్రంలో 90,04,563 రేషన్ కార్డులుండగా ఇందులో అంత్యోదయ కార్డులు 5,63,447, ఆహారభద్రత కార్డులు 84,35,654, అన్నపూర్ణ కార్డులు 5,462 ఉన్నాయి.

➤ ఆహార భద్రత (రేషన్) కార్డుల్లో పేర్లు సులభంగా తొలగిస్తున్నా, చేర్పులు చేపట్టకపోవడంతో కొత్త కోడళ్లకు నమోదు కావడం లేదు. పుట్టిన పిల్లలకు సైతం అవకాశం ఇవ్వలేదు.

➤ పెళ్లికాగానే కొందరు యువతులు స్వచ్ఛందంగా పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. పేర్లు తొలగించినంత ఈజీగా అత్తారింటి కార్డులో పేర్లు చేర్చడం లేదు.

➤ కొత్త కోడళ్ల పేర్ల నమోదుకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తున్నా.. అడుగు కూడా ముందుకు పడడం లేదు.

➤ ఆరోగ్యశ్రీ, ఇతర ప్రభుత్వ పథకాల అమలుకు రేషన్‌కార్డుల్లో పేర్లు లేకపోవడంతో అవి వర్తించడం లేదు. దీంతో అమ్మగారిఇంట్లో కార్డు పేరు ఎందుకు తొలగించుకు న్నామా అని తలలు పట్టుకుంటున్నారు.

➤ పేర్లు తొలగించుకున్న కొత్త కోడళ్లకు బతుకమ్మ చీరలు కూడా అందడం లేదు.

ఆరుసార్లు దరఖాస్తు చేశా....



నా ఇద్దరు పిల్లలపేర్లు రేషన్ కార్డులో నమోదు చేయాలని మీ సేవలో ఆరుసార్లు దరఖాస్తు చేశా. ఐదు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులో మా పిల్లల పేర్లు నమోదు చేయాలి.

–బోలుమల్ల మహేందర్, రాంచంద్రాపూర్, కోహెడ

రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుల్లో చేర్పులకు పెండింగ్ దరఖాస్తులు ఇలా (ఆయా లాగిన్‌లలో)	
రెవెన్యూ ఇన్‌స్పెక్టర్	5,67,927
తహసీల్దార్	68,462
డీఎస్‌ఓ	3,97,629

మీ సేవ సర్వర్ దరఖాస్తు తీసుకోవడం లేదు..

నాకు ముగ్గురు పిల్లలు. రెండేళ్ల క్రితం రెండో బాబు పుట్టిన తర్వాత రేషన్‌కార్డులో పేరు నమోదుకు దరఖాస్తు చేశా. అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఇంతలోనే మూడో బాబు పుట్టిన తర్వాత మళ్లీ పేరు నమోదుకు మీసేవ కేంద్రానికి వెళ్తితే సర్వర్ అప్లికేషన్ తీసుకోవడం లేదు. పాత అప్లికేషన్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. దీంతో కొత్తగా తీసుకోవడం లేదు.

– రంగు ఆంజనేయులు, పాలమాకుల

రూ. 200 కోట్ల భూ దందా..



ఏజీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీలో అక్రమాలు!

ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి తక్కువ భూమి కేటాయింపు

కొంత భూమి వివాదాల్లో ఉందని నమ్మబలికి నయవంచన

ఇప్పుడు వివాదాల్లో ఉన్న భూమిలో విల్లాలు కడుతూ అమ్మకానికి ఏర్పాట్లు

ఆ భూమి విలువ దాదాపు రూ. 200 కోట్లు ఉంటుందని అంచనా

సహకార శాఖకు కొందరు సభ్యుల ఫిర్యాదు... కొనసాగుతున్న విచారణ

➤ అకౌంటెంట్ జనరల్ ఆఫీస్ ఎంప్లా యీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమి టెడ్‌లో అక్రమాలు చోటుచేసుకు న్నాయని అం దులోని కొందరు సభ్యు లు ఆరోపిస్తు న్నారు. ఈ మేరకు సహ కార శాఖకు ఫిర్యా దు చేశారు. సొసైటీ సభ్యుల కోసం కొన్న భూమిలో కొంత వివాదా స్పద స్థలం ఉందని చెప్పి, ఆ మేరకు కోత విధించి ఇళ్ల స్థలాలు కేటాయించారు. చివరకు వివాదా స్పదం అని చెబుతూ వచ్చిన భూమిలో విల్లాలు నిర్మించి అమ్ముకునేందుకు మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు రంగం సిద్ధం చేస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: అకౌంటెంట్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ లాభాపేక్ష లేకుండా ఉద్యోగుల కోసం ఏర్పడింది. సాధారణ అటెండర్ మొదలుకొని అకౌంటెంట్ జనరల్ వరకు కూడా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఉద్యోగుల భాగస్వామ్యంతో డబ్బులు సమకూర్చుకొని భూమి కొనుగోలు చేసి దాన్ని లే ఔట్ చేసి సభ్యులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నది దీని లక్ష్యం. ఈ సొసైటీ కింద ఇప్పటి వరకు 14 వెంచర్లు వేశారు. సొసైటీలో 5 వేల మంది వరకు సభ్యులున్నారు. అత్తాపూర్, శ్రీనగర్‌కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, నలందా నగర్, అత్తివెల్లి, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వెంచర్లు వేశారు. మేనేజింగ్ కమిటీనే ఈ వెంచర్లు, లేఔట్లు వేసే బాధ్యత తీసుకుంది. 13వ వెంచర్‌కు సంబంధించి ఏజీ సొసైటీ మేడ్చల్ మండలం అత్తివెల్లి గ్రామంలో 94.12 ఎకరాలు కొనుగోలు చేసింది. ఈ 13వ వెంచర్‌లో 1112 మంది సభ్యులున్నారు. ప్రతి ఒక్కరూ ఎవరి స్థాయిలో వారు కొనుగోలు చేసేలా 67 గజాలు, 150 గజాలు, 200, 267, 333, 400, 500 గజాల చొప్పున వెంచర్లు వేసి వాటికి లేఔట్ వేశారు.

మొత్తం 94.12 ఎకరాల్లో 91 ఎకరాలు క్లియర్‌గా ఉందని 2020లో కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు రాసిన లేఖలో దాని అధ్యక్షుడు పేర్కొన్నారు. మిగిలిన 3.12 ఎకరాలపై అస్పష్టత నెలకొందని తెలిపారు. అయితే రెండేళ్ల తర్వాత 2022లో కేవలం 79.24 ఎకరాలకు మాత్రమే ఫైనల్ లేఔట్ అనుమతి వచ్చింది. మిగిలిన ఎకరాలకు మాత్రం లేఔట్ తీసుకోలేదు. సర్వే నెంబర్‌లో భూసంబంధిత వివాదాలున్నాయంటూ పక్కన పెట్టేశారు. ఆ మిగిలిన భూముల్లో

వివాదస్పద భూమి ఉందంటూ..

ఒకటిన్నర ఎకరా మాజీ ఎమ్మెల్యే కబ్జాలో ఉందనీ, నాలుగు ఎకరాలు రైతుల ఆధీనంలో ఉందన్న వాదనలు వెల్లువెత్తాయి. కాగా, 2022 జూన్, జూలై నెలల్లో కోఆపరేటివ్ కమిటీ విచారణ చేపట్టి భూమి మొత్తం క్లియర్‌గానే ఉందని, భూవివాదాలు, మాజీ ఎమ్మెల్యేతో, రైతులతో ఉన్న వివాదాలను సరి చేసుకున్నామని నివేదికలో పేర్కొంది. కానీ 2022 సెప్టెంబర్‌లో అధ్యక్షుడు కేవలం 79.24 ఎకరాలకు మాత్రమే లేఔట్ తీసుకొచ్చారు. అంతా క్లియర్‌గా ఉన్నప్పుడు కేవలం 79.24 ఎకరాలకే ఎందుకు లేఔట్ తీసుకొచ్చారన్న ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

వివాదాస్పద భూముల్లో విల్లాలు..

మొత్తంగా లేఔట్ భూమిలో 1112 ప్లాట్లు ఇచ్చారు. 67, 150 గజాలు లేఔట్ ఉన్న వారికి పక్కాగానే ఇచ్చారు. కానీ 200 గజాలు ఇవ్వాల్సిన వారికి 166 గజాలు, 267 గజాలు ఇవ్వాల్సిన వారికి 200 గజాలు, 333 గజాలు ఇవ్వాల్సిన వారికి 233 గజాలు, 400 గజాలు ఇవ్వాల్సిన వారికి 300 గజాలు, 500 గజాలు ఇవ్వాల్సిన వారికి 350 గజాలు మాత్రమే ఇచ్చారు. అంటే 30 శాతం కోత విధించి ప్లాట్లు కేటాయించారు. వివాదంలో భూమి ఉందని చెప్పి తక్కువ కేటాయించారు. ఇక మిగిలిన 14.88 ఎకరాల్లో అనధికారికంగా విల్లాలు నిర్మించి అమ్ముకుందామని నిర్ణయించారు. ఆ మేరకు 2022లో కోఆపరేటివ్ సొసైటీ పేరు మీదనే విల్లాలు నిర్మిస్తామని బ్రోచర్ కూడా వేశారు. 150 గజాల్లో నిర్మిస్తున్న ఒక్కో విల్లా రూ. 1.08 కోట్లు అంటున్నారు. 14.88 ఎకరాలు ధర మార్కెట్లో రూ. 200 కోట్లు ఉంటుందని అంచనా. విల్లాల వ్యవహారంపై కొందరు సభ్యులు సహకారశాఖలో ఫిర్యాదు చేస్తే, బెదిరింపు కాల్స్, మెంబర్‌షిప్ క్యాన్సిల్ చేస్తామని బెదిరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదుగురు సభ్యుల మేనేజ్‌మెంట్ కమిటీనే ఈ విల్లాల కుంభకోణానికి పాల్పడిందని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అంతా అక్రమాలమయమే..

సొసైటీ పెద్దలదంతా అక్రమాలమయమే. వివాదాస్పద భూమిలో విల్లాలు కడతామని, లేకుంటే వేలం పాడుతామని చెప్తూ, తద్వారా వచ్చిన సొమ్మును అందరికీ ఇస్తామని మేనేజ్‌మెంట్ కమిటీ చెబుతోంది. కానీ ఆ అధికారం వారికి ఎక్కడిది? 1112 మంది నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్ చార్జీలు, మెంబర్‌షిప్, వెంచర్ నిర్వహణ, ఆఫీసు ఖర్చులు, అదనపు ఖర్చుల కింద 2022 నవంబర్‌లో రూ.9 కోట్లు వసూలు చేశారు. వాస్తవంగా ఒక్కొక్కరి నుంచి రూ. 9 వేలు తీసుకుంటే సరిపోతుంది. కానీ ఒక్కొక్కరి నుంచి రూ.60 వేలు వసూలు చేశారు.

– అరుణ్‌కుమార్, సొసైటీ సభ్యుడు

ఎక్కడా అక్రమాలు జరగలేదు

13వ వెంచర్‌కు సంబంధించి మేమే చేస్తున్నాం. 8.4 ఎకరాలకు ఇంకా ఇప్పటివరకు అనుమతి రాలేదు. అనుమతి వస్తే విల్లాలు కడతాం. ఆ మేరకు జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. లేకుంటే భూమిని అమ్మి అందరికీ ఇస్తామని చెప్పాం. అంతేగానీ ఎక్కడా అక్రమాలు జరగలేదు.

– నరేంద్రనాథ్, సొసైటీ అధ్యక్షుడు


సెల్‌ఫోన్ కోసం అక్కాచెల్లెళ్ల గొడవ

- క్షణికావేశంలో పురుగు మందు తాగి చెల్లెలు ఆత్మహత్య
- దుబ్బాకలో విషాదం

దుబ్బాక టౌన్: అక్కాచెల్లెళ్ల మధ్య సెల్‌ఫోన్ చిచ్చు రాజేసింది. ఫోన్‌కోసం ఇద్దరి మధ్య గొడవ జరగ్గా, చెల్లెలు క్షణికావేశంలో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మర్గల శంకర్, వసంత దంపతులకు ముగ్గురు కూతుర్లున్నారు. రెండో కుమార్తె నందిని డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. చిన్న కుమార్తె నవిత అలియాస్ నవ్య (18) డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. గురువారం ఉదయం ఇద్దరూ సెల్‌ఫోన్ విషయమై గొడవ పడ్డారు. ఇది గమనించిన తల్లి, వారిని మందలించి ఫోన్‌ను బీరువాలో పెట్టి తాళం వేసి పని కోసం వెళ్లింది. దీంతో అప్పటికే ఆవేశంలో ఉన్న నవిత గడ్డిమందు తాగింది. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన నందిని, చెల్లి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకున్నారు. వెంటనే నవితను దుబ్బాక ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేట హాస్పిటల్‌కు, అక్కడి నుంచి గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున నవ్య మృతిచెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను హత్య చేసి.. రోడ్డు ప్రమాదంలో మరణించి..

ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



అరుణ్




దీప



ఘటనా స్థలంలో అరుణ్ మృతదేహం

ఆదిలాబాద్ రూరల్: అనుమానంతో భార్యను హత మార్చాడు.. అనంతరం భర్త సైతం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా బంగారు గూడలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారు గూడకు చెందిన జయవంత్‌రావు, పద్మ దంపతుల కుమారుడు మోహితే అరుణ్ (30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపిచంద్, లక్ష్మి దంపతుల చిన్న కూతురు దీప (22)తో 4 నెలల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజుల తర్వాత ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు భర్త అనుమానించాడు. దీంతో ఇరువురి మధ్య తరచూ గొడవలవుతు న్నాయి. ఈ క్రమంలో అరుణ్ శుక్రవారం వేకువజామున భార్య దీప తలను మంచం కోడుకు బాది హత్య చేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోవడానికి ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. మరోవైపు ఇంట్లో విగత జీవిగా పడి ఉన్న కోడలిని చూసి అరుణ్ తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. విషయాన్ని కొడుకుకు చెప్పేందుకు ఫోన్ చేశారు. దీంతో ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నట్టుగా తెలిపాడు. అక్కడినుంచి ఇంటికి రావాలని చెప్పడంతో తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. కోడలు హత్యకు గురికావడం, కొడుకు సైతం రోడ్డు ప్రమాదంలో మరణించాడని తెలియడంతో ఆ కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు అరుణ్ మృతిచెందిన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఆ తర్వాత దీప హత్యకు గురైన తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిరోజులుగా దంపతుల మధ్య కలహాలు జరుగుతున్నాయని మృతుడు అరుణ్ తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. దీప తల్లిదండ్రులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకొని కూతురు మృతదేహం వద్ద విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సతీమణికి స్వల్ప అస్వస్థత



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సతీమణి శోభారాణి స్వల్ప అస్వస్థతతో శుక్రవారం ఉదయం సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న ఆమెను సీఎం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం సాయంత్రం హెచ్ఐసీసీలో జరిగిన స్వాతంత్ర్య ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సీఎం కేసీఆర్ యశోద ఆసుపత్రికి చేరుకొని తన సతీమణి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అయితే ఆమె ఆరోగ్యం గురించి ఆందోళన అవసరం లేదని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం.వి. రావు వివరించారు.

సీపీఎస్ రద్దుచేసి మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఉపాధ్యాయసంఘాల పోరాటకమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా
- హాజరైన ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరాం



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ముషీరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి ఉపాధ్యాయ, ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరాం, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఇటీవలికాలంలో ఉద్యోగుల ఐక్య ఉద్యమాల ఉధృతికి తలొగ్గిన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలో సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించినవిధంగా తెలంగాణలో కూడా చేయాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ చరిత్ర, సైన్స్ సబ్జెక్టుల్లో ముఖ్యమైన పాఠ్యాంశాలు తొలగించి విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందనీయకుండా అడ్డుకునే ప్రయత్నం కేంద్రం చేస్తుందని ఆరోపించారు.ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, బాషాపండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై ఉన్న న్యాయ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్రాంత ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, జంగయ్య, అశోక్‌కుమార్, చావరవి, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తెలంగాణ అభివృద్ధిలో ఎన్నారైల తోడ్పాటు అవసరం

మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో ఎన్నారైల తోడ్పాటు అవసరమని, మన ప్రాంతం బాగుండాలనే వాళ్లు విశ్వమానవ సౌభ్రాతృత్వం కోరుకుంటారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి నాలుగో రోజు వాషింగ్టన్ డీసీలో తెలంగాణ ఎన్నారైలతో ఏర్పాటు చేసిన మీట్‌అండ్ గ్రీట్‌లో పాల్గొని మాట్లాడారు. ఉద్యమంలో ఎన్నారైల పాత్ర అమోఘమని కొనియాడారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశంలో రాష్ట్ర పునర్నిర్మాణంలో అద్భుతాలను సృష్టించగలుగుతున్నామన్నారు. నాడు రేషన్ బియ్యం కోసం ఎదురుచూసిన తెలంగాణ...నేడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, ఎన్‌ఆర్‌ఐలు జయంత్ చల్లా, భువనేశ్, రవి పల్లా, ఈశ్వర్ బండా తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ అకాడమీ కమాండెంట్‌గా శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్‌గా ఎయిర్ మార్షల్ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ మార్షల్ బి.చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో ఎయిర్ మార్షల్ ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీనివాస్ శుక్రవారం ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో బి.చంద్రశేఖర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన శ్రీనివాస్ జూన్ 1987లో భారత వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. మిగ్-21, కిరణ్, పీసీ-7, మైక్రోలైట్ తదితర ఎయిర్ క్రాఫ్ట్‌లను 4200 గంటలపాటు నడిపిన అనుభవం ఉన్న శ్రీనివాస్ కేటగిరీ ఏ క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్. ఫ్రంట్‌లైన్ ఫైటర్ బేస్, ప్రీమియర్ ఫ్లయింగ్ ట్రైనింగ్ బేస్, ప్రతిష్టాత్మక ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ స్కూల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ, బేసిక్ ఫ్లయింగ్ ట్రైనింగ్ స్కూల్ వంటి అనేక కమాండ్ నియామకాలను ఆయన నిర్వర్తించారు. నేషనల్ డిఫెన్స్ కాలేజీ, కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ పూర్వ విద్యార్థి అయిన శ్రీనివాస్ మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్, మాస్టర్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మాస్టర్ ఇన్ డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ పూర్తి చేశారు. వాయుసేనలో విశిష్ట సేవలకు గుర్తింపుగా శ్రీనివాస్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు.

దళితులకు ప్రాధాన్యమివ్వాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



పంజగుట్ట: దళితులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా ప్రేమించడం నేర్చుకోవాలని, ఆయన మంత్రివర్గంలో ఐదుగురు దళితులు ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక ప్రధాన సలహాదారు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక కన్వీనర్ వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్‌తో కలిసి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం మాదిగలకు రాజకీయ స్వర్ణయుగంలా ఉండేదని ఒక కేంద్రమంత్రి, ఐదుగురు రాష్ట్ర మంత్రులు ఉండేవారని, కానీ, తెలంగాణలో ఒక మాల, ఒక మాదిగకు మంత్రి పదవులు ఇచ్చేందుకు కూడా సీఎం కేసీఆర్ వెనకంజ వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు మాదిగలను ఇంతగా అణచివేసిన ముఖ్యమంత్రి మరెవ్వరూ లేరని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం మాదిగలకు 15 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగలలో కూడా జనంలో పట్టున్న నాయకుడికే టికెట్ కేటాయించాలని, కేవలం ఎన్నికల సమయంలో వచ్చేవారిని పరిగణనలోకి తీసుకోరాదని, ఈ అంశాలను కాంగ్రెస్ అగ్రనేతల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. సమావేశంలో నాయకులు జెస్సీ, బి.సురేష్, సాంబశివుడు, ఎమ్.మహేష్, ఎన్.మహేష్, రేంత్, నరేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశ గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో రూ.వెయ్యి అపరాధ రుసుముతో చేరేందుకు ఈ నెల 16 వరకూ గడువు పొడిగించారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించాలని ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో ఆదేశించింది. ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో 4,92,873 మంది చేరినట్టు తెలిపింది. గత ఏడాది 4,98,699 మంది చేరినట్టు వెల్లడించింది.

రాష్ట్రంలో రూ. 4,393 కోట్ల జీఎస్టీ వసూలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఆగస్టు నెలలో రూ.4,393 కోట్ల జీఎస్టీ వసూలైంది. ఏపీలో గతేడాదితో పోలిస్తే 10% వృద్ధితో రూ.3,479 కోట్ల జీఎస్టీ వసూలైంది. శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జీఎస్టీ గణాంకాల ప్రకారం ఈ విషయం వెల్లడైంది.

బాబూ! ఆ డబ్బెక్కడిది?

ఆ రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా పరిగణిస్తే తప్పేంటి?

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఐటీ శాఖ నోటీసులు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు చేతికి ముట్టిన రూ.118 కోట్ల అక్రమ ధనం గురించి ఆదాయపు పన్ను శాఖ ప్రశ్నించింది. ఐటీ రిటర్నుల్లో చూపని ఈ రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 4వ తేదీన ఈ నోటీసులు జారీ చేసినట్లు ప్రముఖ జాతీయ ఇంగ్లీషు దినపత్రిక 'హిందుస్థాన్ టైమ్స్' శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లను లెక్క చూపని ఆదాయంగా పరిగణిస్తూ... చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఆగస్టు 4న చంద్రబాబుకు జారీ చేసిన ఈ షోకాజ్ నోటీసులుపై ఆ పత్రిక సమగ్ర కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక ప్రచురించిన కథనం మేరకు వివరాలివీ...

మనోజ్ వాసుదేవ్ సోదాల్లో విషయం వెలుగులోకి...

మనోజ్ వాసుదేవ్‌పార్థసాని 2017 నుంచీ షాపూర్జీ పల్లోంజీ సంస్థ పాల్గొనే టెండర్ల ప్రక్రియలో చురుగ్గా ఉంటున్నారు. ఆ సంస్థ తరఫున ఈయనే మధ్యవర్తిగా వ్యవహారాలు నడిపేవారు. ఈయనకు చెందిన మనోజ్ పార్థసాని అసోసియేట్స్ కార్యాలయంలో 2019లో ఐటీ శాఖ అధికారులు జరిపిన సోదాలతో చంద్రబాబునాయుడు గుట్టుగా సాగించిన అవినీతి బయటపడింది. బోగస్ కాంట్రాక్టులు, వర్క్ ఆర్డర్ల పేరుతో షాపూర్ పల్లోంజీ నుంచి భారీ ఎత్తున నగదును తరలించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించారని కూడా గతంలో ఐటీశాఖ తన నివేదికలో వెల్లడించింది. సోదాల సమయంలో కొన్ని మెసేజ్‌లు, వాట్సాప్ చాటింగ్స్, ఎక్సెల్ షీట్లను మనోజ్ వాసుదేవ్ నుంచి స్వాధీనం చేసుకున్నామని, అందులో కొన్ని ప్రముఖ నిర్మాణ రంగ కంపెనీల నుంచి నగదును అక్రమంగా తరలించి 'మీకు చేరుస్తున్నాం' అని చంద్రబాబును ఉద్దేశించి పేర్కొనట్లు ఐటీ శాఖ వివరించింది. ఆ నోటీసుల ప్రకారం మనోజ్ పార్థసాని చంద్రబాబునాయుడుకి చెందిన వ్యక్తిగత కార్యదర్శి పి.శ్రీనివాస్‌తో 2016 నుంచీ సంబంధాలను కొనసా గిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబునాయుడికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని శ్రీనివాస్ తనను అడిగినట్లు కూడా మనోజ్ వాసుదేవ్ అప్పట్లో వెల్లడించారని ఐటీ పేర్కొంది. అయితే షాపూర్జీ పల్లోంజీ సంస్థ బడా కార్పొరేట్ కంపెనీ కనక... డబ్బును తరలించడానికి వారంతా కలిసి ఓ తెలివైన మార్గాన్ని ఎంచుకున్నారు. వాస్తవంగా ఎటువంటి పనులు చేయకుండానే షాపూర్జీ పల్లోంజీ నుంచి వివిధ ప్రాజెక్టులు చేసినట్లుగా షెల్ కంపెనీల ద్వారా నకిలీ బిల్లులు పెట్టి ఆయా కంపెనీలకు నగదును తరలించారు. ఈ విషయాన్ని 2019 నవంబరు 1న ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో కూడా మనోజ్ పార్థసాని తెలియజేశారు. కేవలం షాపూర్జీ పల్లోంజీయే కాకుండా ఎల్‌అండ్‌టీ వంటి ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి ఫోనిక్స్ ఇన్‌ఫ్రా, పోర్ ట్రేడింగ్ వంటి షెల్ కంపెనీలకు నకిలీ బిల్లుల ఆధారంగా నగదును తరలించినట్లు ఐటీ శాఖకు అర్థమయింది. ఈ విషయాలన్నీ వివరిస్తూ ఆ డబ్బుకు లెక్కలు చెప్పాలని, అవి ఎలా వచ్చాయో తెలియజేయాలని బాబుకు ఐటీ శాఖ నోటీసులిచ్చింది. శ్రీనివాస్ నుంచి చంద్రబాబు నాయుడుకు నగదు చేరినట్లుగా ధ్రువీకరించే ఆధారాలను, నేరాన్ని ధ్రువపరిచే వివిధ సందేశాలు, చాట్‌లు మరియు ఎక్సెల్ షీట్‌ల ను సైతం సెర్చ్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకు న్నట్లు డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఈ సాక్ష్యాలను మనోజ్ వాసుదేవ్‌కు చూపించి విచారించగా ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును ఎలా తరలించారన్న విధానాన్ని మొత్తం వివరించినట్లు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ బోగస్ కంపెనీల ద్వారా తరలించిన నగదు ద్వారా అంతి మంగా లబ్ధి పొందింది చంద్రబాబేనని ఐటీ శాఖ పేర్కొంది. మనోజ్ వాసుదేవ్ ద్వారా సబ్‌కాంట్రాక్టుల ద్వారా అందుకున్న రూ.118,98,13,207 మొత్తాన్ని 2020-21లో వచ్చిన అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలని నోటీసులో పేర్కొంది.

అమిత్ షాను బాబు కలవటంపై అనుమానాలు!!

2024 ఎన్నికల్లో బీజేపీతో ఎలాగైనా పొత్తు పెట్టుకోవాలని ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడుతూ నానా తంటాలూ పడుతున్న వేళ ఈ నోటీసులు రావటంపై 'హిందుస్థాన్ టైమ్స్' పత్రిక అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూన్‌లో చంద్రబాబు నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశం కావటాన్ని కూడా హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ప్రస్తావించింది. ఈ నోటీసుల విషయమై తాము అటు చంద్రబాబు నాయుడిని, ఇటు కేంద్ర కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు, కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖలను ఈ మెయిల్ ద్వారా సంప్రతించామని, ఎవ్వరూ స్పందిచలేదని కూడా పత్రిక వెల్లడించింది.

లెక్క తేలని మొత్తం రూ.2,000 కోట్లు

అమరావతిలో రాజధాని పేరిట తాత్కాలిక భవనాలను నిర్మించిన చంద్రబాబు... అందులో భారీ కుంభకోణానికి తెగడబడినట్లు తాజా ఐటీ నోటీసులతో మరోసారి బట్టబయలైంది. తాత్కాలిక నిర్మాణాల పేరుతో పనుల అంచనా విలువలను భారీగా పెంచేసి అడ్డగోలుగా దోపిడీ చేసిన వైనాన్ని అప్పట్లోనే 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. తాత్కాలిక సచివాలయాన్ని రూ.181 కోట్లతో పూర్తి చేయాలని తొలుత అంచనా వేసుకుంటే దాన్ని పెంకుంటూ రూ.1,151 కోట్లు ఖర్చు చేశారంటే... అంచనాలు ఎన్ని రెట్లు పెంచారో, అడ్డగోలు దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో తేలిగ్గానే అర్థమవుతుంది. 2020, ఫిబ్రవరి నెలలో చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాసుపై ఐటీ శాఖ అధికారులు దాడులు చేసి రూ.2,000 కోట్ల వరకు లెక్క చూపని ఆదాయానికి సంబంధించిన లావాదేవీలు బయటకు తీసిన విషయాన్ని ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులతో సహా అప్పట్లోనే 'సాక్షి' ప్రముఖంగా ప్రచురించింది. ఒకే కంప్యూటర్ నుంచి ఆయా సంస్థల చెందిన బిల్లుల చెల్లింపులు, ఐటీ రిటర్నులు దాఖలు చేశారు. చంద్రబాబు కొండంత అవినీతి చేస్తే మచ్చుకు రూ.2,000 కోట్లు మాత్రమే బయటకు వచ్చాయని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని భారీ మొత్తాలు వెలుగులోకి వస్తాయని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

అడ్డగోలు వాదన... బాబుకు అలవాటే!!

చంద్రబాబు నాయుడికైనా, రామోజీరావుకైనా అడ్డంగా వాదించటం పెన్నుతో పెట్టిన విద్య. ఎందుకంటే వీళ్లను ఎవరైనా 'మీరు ఈ నేరం చేశారా?' అని అడిగితే... తాము చేస్తే చేశామనో, లేకపోతే చేయలేదనో వీళ్లు నేరుగా చెప్పరు. చేసిన నేరాన్ని తప్పించుకోవటానికి ముందుగా ఎదుటి వ్యక్తికి తమను అడిగే అర్హత లేదనో, లేకపోతే తమకు ఆ చట్టం వర్తించదనో, లేకపోతే ఫలానా చట్టం ప్రకారం తమను ప్రశ్నించజాలరనో ఎదురు తిరుగుతారు. అలా... కేసును దశాబ్దాల పాటు సాగిస్తారు. పైపెచ్చు తమపై ఎలాంటి కేసులూ రుజువు కాలేదని, తాము శుద్ధపూసలమని చెబుతుంటారు. అసలు విచారణ జరగనిస్తే కదా... వీళ్లు తప్పు చేశారో లేదో తేలటానికి!!. ఇదే రీతిలో ఐటీ శాఖ నోటీసులకు కూడా చంద్రబాబు నాయుడు విచిత్రమైన సమాధానమిచ్చారు. సోదాల్లో చంద్రబాబు నాయుడి పాత్రను బయటపెట్టే ఆధారాలు లభించటంతో... నేరుగా ఆయన ఖాతాల్లోకి ఎంత ముడుపులు వెళ్లాయనే విషయమై ఒక అంచనాకు వచ్చి... అది ఎలా వచ్చిందో చెప్పాలంటూ నోటీసులు జారీ చేసింది. చంద్రబాబు దానికి నేరుగా సమాధానమివ్వకుండా... తనకు నోటీసులిచ్చే అధికారం సదరు సెంట్రల్ సర్కిల్ అధికారికి లేదంటూ జవాబిచ్చారు. దాన్ని పరిశీలించిన ఐటీ శాఖ... సెక్షన్లను ఉటంకిస్తూ సదరు కేసును ఆ అధికార పరిధి ఉన్న డిప్యూటీ కమిషనర్‌కు బదిలీ చేస్తూ... డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. దీన్ని అక్రమ ఆదాయంగా పేర్కొంటూ చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని ఆగస్టు 4న జారీ చేసిన నోటీసుల్లో ప్రశ్నించింది.

పాత విధానంలోనే టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి

జీవో 46ను రద్దు చేయండి ● డీజీపీ ఆఫీస్ ముట్టడికి అభ్యర్థుల యత్నం



ప్లకార్డులతో డీజీపీ కార్యాలయానికి దూసుకెళ్తున్న అభ్యర్థులను నిలువరిస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్ (నాంపల్లి): తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్(టీఎస్ఎస్పీ) కానిస్టేబుల్ పోస్టులను 2016, 2018 నోటిఫికేషన్‌లో మాదిరిగా పాతపద్ధతిలోనే భర్తీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. జీవో 46 ప్రకారం కంటిజ్యుయస్ డిస్ట్రిక్ట్ కేడర్‌లో ఉన్న రిజర్వేషన్ మేరకు టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకే 53 శాతం వెళుతున్నాయని, మిగతా 26 జిల్లాలకు 47 శాతం మాత్రమే పోస్టులు దక్కుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల గ్రామీణ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొందరు కానిస్టేబుల్ అభ్యర్థులు డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అసెంబ్లీ పరిసరాల్లో పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ డీజీపీ కార్యాలయం వైపు దూసుకు వస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'జిల్లాల నుంచి పోటీ పడుతున్న అభ్యర్థులకు టీఎస్ఎస్పీ పోస్టులు 130, ఆపై మార్కులు సాధించినా ఉద్యోగం రాని పరిస్థితి నెలకొంది. అదే హైదరాబాద్ జిల్లా నుంచి పోటీలో ఉన్నవారికి 80 ప్లస్ మార్కులు వచ్చినా ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది'అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీవో 46ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



తిరుమల ఆలయం వెలుపల భట్టి విక్రమార్క

తిరుమల: పాదయాత్ర ముగించి తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన నైవేద్య విరామ సమయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం భట్టిని ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాలుగు నెలలు తనతో పాటు పాదయాత్ర చేసిన వారితో కలసి స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి కాంగ్రెస్ పార్టీ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మంచి మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి చెందాలని, సంపద, వనరులు ప్రజలకు అందేలా ప్రత్యేక తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. కానీ దశాబ్ద కాలంగా రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని, తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ప్రజలు అభివృద్ధి చెందుతారని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు, రూ.4 వేల పెన్షన్ వంటి అనేక హామీలతో కాంగ్రెస్ ప్రజల ముందుకు రాబోతుందన్నారు. ఉచిత కరెంటు అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ రైట్ అని, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని విమర్శించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం అంటే పాత ఇంటికి రావడం వంటిదని భట్టి పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే మోదీతో కేసీఆర్‌కు లోపాయికారీ ఒప్పందం

జాగో తెలంగాణ సంస్థ ప్రతినిధి రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని జాగో తెలంగాణ సంస్థ ప్రతినిధి, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్‌కు ప్రధాని నరేంద్రమోదీతో లోపాయికారీ ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. జాగో తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కేసీఆర్ కుటుంబం రూ.60 వేల కోట్ల వరకు దోపిడీ చేసినా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకే జాగో తెలంగాణ పేరుతో ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహించి చైతన్యం చేస్తున్నామని చెప్పారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను ధ్వంసం చేసి గల్లీకొక బెల్టు షాపు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో విధ్వంసకర పాలన సాగుతోందని, ఇసుక, మట్టి, ల్యాండ్, లిక్కర్ మాఫియాలు చెలరేగుతున్నాయని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో భయంకరమైన అవినీతి కనిపిస్తోందని ధ్వజమెత్తారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ పాలమూరు జిల్లా తెలంగాణ ఉద్యమకాలంలో ఎలా ఉందో ప్రస్తుతం అలాగే ఉందని, వలసలు ఏమాత్రం ఆగలేదన్నారు. పాలమూరు రాజకీయ నేతల బానిసత్వం కూడా పోలేదన్నారు. సమావేశంలో జాగో తెలంగాణ సంస్థ ప్రతినిధులు ఖలీదా ఫర్వీన్, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ప్రొఫెసర్ పద్మజాషా, జావిద్ ఖాద్రి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు భారీ గి'రాఖీ'

- పండుగ రోజు రూ.22.65 కోట్ల ఆదాయం
- 40.92 లక్షలమంది బస్సుల్లో ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: ఈసారి రాఖీ పౌర్ణమి ఆర్టీసీకి బాగా కలిసొచ్చింది. బస్సులు కిటకిటలాడగా, ఖజానా కళకళలాడింది. డీజిల్ సెస్‌ను భారీగా పెంచిన తర్వాత గతేడాది రాఖీ పండుగ రోజు రికార్డు స్థాయిలో రూ.21.66 కోట్ల ఆదాయం రాగా, ఈసారి అంతకంటే ఎక్కువ రాబడి రావాలంటూ ఆర్టీసీ ఎండీ అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. దీంతో ఈసారి రాఖీ పండగరోజు రూ.22.65 కోట్ల ఆదాయం సాధించి పాత రికార్డును అధిగమించింది. పండగ రోజైన గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 40.922 లక్షల మంది ప్రయాణించారు. గత రాఖీ పండుగ రోజుతో పోలిస్తే లక్ష మంది ప్రయాణికులు అధికం కావటం విశేషం. ఆర్టీసీ బస్సుల్లో ఒకేరోజు ఇంత మంది ప్రయాణించటం కూడా రికార్డేనని అధికారులు పేర్కొంటున్నారు. గురువారం ఆర్టీసీ బస్సులు 36.77 లక్షల కి.మీ. తిరిగాయి. ఇది కూడా గతేడాది కంటే(35.54 లక్షల కి.మీ.) ఎక్కువే. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 86.41 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) నమోదైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరి. దిలో 104.68 శాతం నమోదైంది. నార్కట్‌పల్లి మినహా మిగతా 6 డిపోలు 100 శాతానికిపైగా సాధించాయి. ఉమ్మడి వరంగల్‌లో 97.05, ఉమ్మడి మెదక్, మహబూబ్ నగర్, కరీంనగర్ జిల్లాల్లో 90 శాతానికిపైగా ఓఆర్ నమోదైంది.

హుజూరాబాద్, నల్లగొండ, భూపాలపల్లి, హుస్నాబాద్, పరకాల, కల్వకుర్తి, తొర్రూరు, మహబూబాబాద్, మిర్యాలగూడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, గజ్వేల్- ప్రజ్ఞాపూర్, కోదాడ, నర్సంపేట, సూర్యాపేట, దుబ్బాక, జనగామ, సిద్దిపేట, గోదావరిఖని, షాద్‌నగర్ డిపోలు 100 శాతానికిపైగా ఓఆర్ సాధించాయి. కి.మీ.కు సగటున రూ.56.18 ఆదాయం రాగా, గరిష్టంగా వరంగల్-1 డిపో రూ.65.94, భూపాలపల్లి డిపో రూ.65.64 చొప్పున సాధించి రికార్డు సృష్టించాయి.

సిబ్బంది సమష్టి కృషి వల్లే...

''ఇంత భారీ ఆదాయం వచ్చేందుకు సిబ్బంది సమష్టి కృషే కారణం, ప్రజలు పండుగలో నిమగ్నమై ఉంటే ఆర్టీసీ సిబ్బంది రోడ్ల మీద ఉండి అహరహం శ్రమించారు. వారందరికీ అభినందనలు'అని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు.

నెలరోజుల్లో సింగరేణి కార్మికులకు వేజ్ బోర్డు బకాయిలు

- రూ.1,726 కోట్లను చెల్లించేందుకు కసరత్తు
- సింగరేణి డైరెక్టర్ బలరామ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ కార్మికులకు రూ.1,726 కోట్ల వేతన బోర్డు బకాయిలను వీలైనంత త్వరగా చెల్లిస్తామని, ఒక్కో కార్మికుడు సగటున రూ.4 లక్షల వరకు బకాయిలు అందుకుంటారని సంస్థ డైరెక్టర్ ఎన్.బలరామ్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల బకాయిలను నెల రోజుల్లో రెండు విడతలుగా కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ఇందుకు పర్సనల్ విభాగం, అకౌంట్స్, ఆడిటింగ్, ఈఆర్పీ, ఎస్ఏపీ, ఐటీ తదితర అన్ని విభాగాల సమన్వయంతో శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. 11వ వేజ్ బోర్డు అమలుతో సంస్థపై ఏటా రూ.1,200 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. ప్రస్తుత బకాయిలు కలిపి ఈ ఏడాది రూ.3 వేల కోట్లను చెల్లించనున్నట్లు తెలిపారు. వీటిని సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన కార్మికులకు చెల్లిస్తామన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

తొలిరోజు 329 మందికి అర్హత



అభ్యర్థుల వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్, ఆర్మీ అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్: సైన్యంలో నియామకాలకు సంబంధించి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 8వ తేదీ వరకు ర్యాలీ జరగనుండగా, రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు హాజరుకానున్నారు. శుక్రవారం తెల్లవారుజామున పోటీలు ప్రారంభించారు. తొలి రోజు 1,225 మంది అభ్యర్థులకు 926 మంది హాజరయ్యారు. వీరిలో వైద్య పరీక్షలకు 329 మంది అర్హత సాధించారు. పోటీలను కలెక్టర్ వీపీ గౌతమ్, ఆర్మీ అధికారి దాస్, డీవైఎస్‌వో టి.సునీల్‌కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. కాగా, అభ్యర్థులకు వసతి సౌకర్యం కల్పించినట్లు చెబుతున్నా.. అవగాహన కల్పించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు రహదారుల వెంట సేదదీరాల్సి వచ్చింది.

బెంగళూరుకు రేవంత్

డీకే శివకుమార్‌ను కలిసేందుకా.. ప్రైవేటు పనులపైనా !



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బెంగళూరు వెళ్లారు. శుక్రవారం ఉదయమే ఆకస్మికంగా బయలుదేరిన ఆయన రెండురోజులు అక్కడ ఉంటారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్‌ను కలిసేందుకే వెళ్లినట్టు తెలుస్తోంది. ఓవైపు వైఎస్సార్‌టీపీ విలీనం, మరోవైపు మాజీ మంత్రి తుమ్మలకు పార్టీలోకి ఆహ్వానం, ఆదివారం పీఈసీ సమావేశం, ఆ తర్వాత స్క్రీనింగ్ కమిటీ పర్యటన నేపథ్యంలో రేవంత్ బెంగళూరు పర్యటన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా రాజకీయ పరిణామాలు, త్వరలోనే హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణలాంటి అంశాలపై డీకేతో చర్చించేందుకే వెళ్లారని తెలుస్తోంది. అయితే రేవంత్ ప్రైవేటు పనులపై వెళ్లారే తప్ప రాజకీయ అంశాలకు, బెంగళూరు పర్యటనకు సంబంధం లేదనే చర్చ జరుగుతోంది. రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌కు వస్తారని గాంధీభవన్‌వర్గాల ద్వారా తెలిసింది.

క్షేత్రస్థాయిలో 'స్క్రీనింగ్'

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారులో భాగంగా స్క్రీనింగ్ కమిటీ క్షేత్రస్థాయిలో కూడా అభిప్రాయాలను సేకరించనుంది. మురళీధరన్ నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ ఈ నెల 4,5,6 తేదీల్లో రాష్ట్రంలోనే ఉంటుంది. ఈ మూడు రోజుల్లో ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యు లతో మాట్లాడి ఆ తర్వాత జిల్లాల్లో పర్యటించాలని ఆ కమిటీ భావించింది. కానీ, షెడ్యూల్ మార్చుకొని హైదరాబాద్‌లోనే క్షేత్రస్థాయి నేతలతో సమావేశం కానుంది. ఈనెల 4న పీఈసీ సభ్యులతో భేటీల తర్వాత, 5న డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశమవు తుందని తెలుస్తోంది. ఈ మేరకు క్షేత్రస్థాయి నాయకత్వానికి సమాచారం కూడా అందింది.

మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

తెలంగాణ, ఏపీ మధ్య రూ.4 కోట్ల బకాయి వివాదంపై హైకోర్టు సూచన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సర్కార్‌కు, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మధ్య ఉన్న రూ.4 కోట్ల బకాయిల వివాదాన్ని మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఇరుపక్షాలు ఈ నెల 12న హైకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రంలో జస్టిస్ చల్లా కోదండరాం ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత నివేదికను తమకు అందజేయాలని రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ సర్కార్ నుంచి రూ.4 కోట్లు రావాల్సి ఉందని, వడ్డీసహా చెల్లించేలా ఆదేశించాలని ఏపీ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని శ్రీకాంత్‌రెడ్డి కోరగా, వివాదాన్ని మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని ధర్మాసనం సూచించింది. ఈ మేరకు ఇరుపక్షాల న్యాయవాదులు అంగీకారం తెలిపారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ కొత్త చైర్మన్‌గా ప్రొ.అశోక్



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సిల్వర్‌జూబ్లీ శిల్పాన్ని ఆవిష్కరించిన కొత్త చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం (హైదరాబాద్): ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ నూతన చైర్మన్‌గా ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన పాలక మండలి ప్రత్యేక సమావేశంలో ఒక ప్రకటన చేశారు. 1998లో ఆరంభం నుంచి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ చైర్మన్‌గా కొనసాగిన ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త చైర్మన్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ఇతర ప్రొఫెసర్లతో కలసి నూతనంగా రూపొందించిన సిల్వర్‌జూబ్లీ శిల్పాన్ని ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్ వాలా మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందేలా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రొఫెసర్ పీజే నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్.. దేశంలో నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు.



కొంతమంది శరీరతత్వాన్ని బట్టి బరువు పెరగడం, తగ్గడమనేది పెద్ద టాస్కే. మంచి పౌష్టికాహారం, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా బరువు పెరగడం సులభమే. కానీ దాన్ని తగ్గించుకోవాలంటే మాత్రం చుక్కలు కనిపిస్తాయి. ఇందుకు చాలా మంది సినీ తారలు కూడా నిదర్శనం. నిత్యం యోగా చేసే సినీతారలు, తదితర వంటి సెలబ్రిటీలే ఇంత కష్టపడుతుంటే.. మనలాంటి సామాన్యులు బరువు తగ్గడం సాధ్యమేనా అని నిరాశ పడొద్దు. బిజీ లైఫ్ వల్ల చాలామందికి వ్యాయామం చేయడానికి సమయం చిక్కదు. అలాగని డైటింగ్ చేస్తూ కడుపు మాడ్చుకోవడం కూడా కష్టమే. అందుకే చాలా మంది సులభంగా బరువు తగ్గే మార్గాలను ఎంచుకుంటారు. అలాంటివారికి ఈ కింది చిట్కాలు ఉపయోగపడవచ్చు.



బరువు తగ్గడం అంత బరువేం కాదు!

మంచి నీటిని తరచు తాగడం వల్ల ఆహారం తక్కువగా తీసుకుంటాం. ముఖ్యంగా భోజనానికి ముందు నీరు తాగడం వల్ల కొద్దిగా తింటే చాలు పొట్ట నిండిన భావన కలుగుతుంది. 12 వారాల పాటు చేసిన ఓ అధ్యయనంలో భోజనానికి ముందు నీళ్లు తాగని వారితో పోలిస్తే.. తాగేవారు త్వరగా బరువు తగ్గుతారని తేలింది. బరువు తగ్గేందుకు ఏమేం చేయాలో, ఏం చేయకూడదో తెలుసుకుందాం.

- ఆహారాన్ని కంగారుగా తినకూడదు. నెమ్మదిగా నమిలి తినాలి. దీనివల్ల తక్కువ ఆహారం తీసుకుంటారు.
- నెమ్మదిగా ఆహారం తీసుకోవడం వల్ల కడుపు త్వరగా నిండిన ఫీలింగ్ వస్తుంది.
- మీరు రోజూ తీసుకొనే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండాలి.
- ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు త్వరగా నిండుతుంది.
- ఆకలి తగ్గితే శరీరంలోకి తక్కువ క్యాలరీలు చేరతాయి.
- జీఎల్‌పీ-1, ఘెర్లిన్ హార్మోన్లపై ప్రొటీన్లు ప్రభావం చూపడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది.
- తియ్యని శీతలపానీయల జోలికి వెళ్లొద్దు.
- సోడా కలిగిన డ్రింక్స్ వల్ల రోగాల ముప్పు పెరుగుతుంది.
- చక్కెర శాతం ఎక్కువగా ఉండే పానీయాల వల్ల శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరతాయి.
- కంటి నిండా నిద్రలేకపోయినా సరే బరువు పెరిగే అవకాశాలు ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- నిద్రలేమి వల్ల లెప్టిన్, ఘెర్లిన్ హార్మోన్లపై ప్రభావం పడుతుంది.
- ఒత్తిడి వల్ల కార్టిసాల్ అనే హార్మోన్ విడుదలై ఆకలి పెరుగుతుంది.
- ఆకలి పెరగడం వల్ల అనారోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటారు.
- దానివల్ల శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరతాయి.
- నిద్రలేమి, ఒత్తిడి వల్ల మధుమేహం, ఊబకాయం వంటి అనేక రుగ్మతలు వస్తాయి.
- యోగర్ట్, లెంటిల్స్, క్వినోవా, చికెన్ బ్రెస్ట్, చేపలు, ఆల్మండ్స్‌లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి.
- పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల తొందరగా ఆకలి వేయదు.
- మొక్కల నుంచి లభించే విస్కోస్ ఫైబర్ అనే పీచుపదార్థం బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- బీన్స్, ఓట్స్ సెరల్స్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్, ఆస్పరాగస్, నారింజ, అవిసె గింజల్లో విస్కోస్ ఉంటుంది.
- ఆహారాన్ని మితంగా తీసుకోవాలి.
- కంచం నిండుగా భోజనం చేస్తే బరువు కూడా అదే స్థాయిలో పెరుగుతారు.
- ఆకలి వేసినప్పుడు మధ్య మధ్యలో బాదం తదితర డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది.
- టీవీ లేదా ల్యాప్‌టాప్‌లో సినిమాలు, వీడియోలు చూస్తూ తినడం వల్ల కూడా బరువు పెరుగుతారు.
- ఎందుకంటే.. వాటి ధ్యాసలో పడి అతిగా తినేస్తారు కాబట్టి ధ్యాసతో తినడం మంచిది.

మీకు తెలుసా?
కాఫీ సంగతులు

గర్భవతులు లేదా తల్లిపాలు ఇస్తున్న వారు కాఫీకి దూరంగా ఉండటం శ్రేయస్కరం. గర్భస్రావం, అకాల ప్రసవం, తక్కువ బరువుతో పిల్లల పుట్టడం వంటి ముప్పులను నివారించడానికి గర్భవతులు కాఫీ తాగకపోవడమే మంచిది. ఒకవేళ కాఫీ తాగాలి అనుకున్నా 200 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా తీసుకోకూడదు. కెఫిన్ ఫలానా మోతాదులో తీసుకుంటే మంచిదని ఎవరు చెప్పలేరు కాబట్టి ప్రెగ్నెన్సీతో ఉన్నవారు కాఫీ తాగే ముందు ఒకసారి డాక్టర్‌ను కలవాలి. అలాగే పాలిచ్చే తల్లులు కాఫీ ఎక్కువసార్లు తాగడం వల్ల డీహైడ్రేషన్ కు గురి అయ్యే అవకాశం ఉంది. అందువల్ల వీరు కూడా పాలిచ్చే రోజుల్లో కాఫీని మానేయటం ఉత్తమం. అదేవిధంగా మెటబాలిజమ్ స్లోగా ఉన్నవారుమెటబాలిజమ్ స్లోగా ఉన్నవారు కాఫీకి దూరంగా ఉండాలి. ఎందుకంటే కాఫీని అరిగించుకునే శక్తి వీరికి ఉండదు. కాఫీ తాగిన తర్వాత నిద్రపోలేకపోతే.. వారికి మెటబాలిజం స్లోగా ఉందని అర్థం. స్లో మెటబాలిజం ఉన్నవారు మధ్యాహ్నం 3 తర్వాత కాఫీ తాగకూడదు. అలానే ఎక్కువసార్లు తీసుకోకూడదు.



ఆకస్మిక మైకం.. తరచు తలనొప్పా?



ఈ రెండూ లోబీపీకి ప్రధానం సూచన కావొచ్చు. తక్కువ ఆక్సిజన్ స్థాయి కారణంగా ఒక్కోసారి అపస్మారక స్థితి ఏర్పడవచ్చు. మెడ మీద గట్టిగా పట్టుకున్నట్లు అనిపిస్తుంది. ఆ ప్రాంతంలో ఆగీ ఆగీ నొప్పి కూడా రావొచ్చు. అకస్మాత్తుగా ఊపిరి ఆడకపోవటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పరిస్థితి కూడా కనిపిస్తుంది. ఇందులోని మరో లక్షణం ఏమిటంటే, శరీరం ఒక్కసారిగా చెమటలు పట్టడం, శరీరంలో వేడి జ్వరంలా పెరిగిపోవడం, అలసిపోయినట్లుగా కుప్పకూలిపోవడం సంభవిస్తుంది.



హృదయ స్పందన రేటు పెరుగుతుంది. సక్రమంగా గుండె కొట్టుకోకపోవడం వల్ల అలసట కనిపిస్తుంది. ఆహారం జీర్ణం కాక వికారంగా అనిపిస్తుంది. వాంతులు, వికారం, విపరీతమైన అలసట వల్ల ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. లోబీపీ ఉంటే మూత్ర విసర్జన కూడా తగ్గుతుంది.

లోబీపీ ఉంటే ఏం చేయాలి

లో బీపీ అకస్మాత్తుగా జరగదు. శరీరంలో ఏ సమస్య వచ్చినా బీపీ తగ్గుతుంది. ఇది డీహైడ్రేషన్ మరియు గుండె సంబంధిత సమస్యలను కూడా కలిగిస్తుంది. రక్తస్రావం అయ్యే అవకాశాన్ని కొట్టి పారేయలేము. శరీరంలోని ఏ భాగంలో అయినా మార్పులు సంభవిస్తే రక్తప్రసరణలో తేడా వచ్చి బీపీ పడిపోతుంది. మితిమీరిన ఆలోచనలు, ఒత్తిడితో కూడిన జీవితం బీపీలో హెచ్చుతగ్గులు ఉంటాయి. మధుమేహం వల్ల కూడా ఇది జరగవచ్చు. అలాంటప్పుడు తగిన చికిత్సను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని వైద్యనిపుణులు చెబుతున్నారు. రక్తపోటులో ఆకస్మిక తగ్గుదలకు సరైన చికిత్స అవసరం. ఆ సమయంలో స్వీయ చికిత్స కంటే ఆసుపత్రిని సందర్శించడం మంచిది. ఒక గంటలోపు ఆసుపత్రికి రావడం వల్ల ప్రమాదకర పరిణామాలను నివారించవచ్చు. అక్కడ లో బీపీకి కారణాన్ని గుర్తించి చికిత్స అందిస్తారు.

మనం పైన చెప్పుకున్నట్టుగా... లో బీపీ లక్షణాలు కనిపించగానే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలి. వారి సలహా మేరకు మీ జీవనశైలిని సరిచేసుకోవాలి. తగిన పోషకాహారం, తగినంత నిద్ర, తేలికపాటి వ్యాయామాలు తప్పనిసరిగా మీ దినచర్యలో చేర్చుకోవాలి.

అపోహ... వాస్తవం
పచ్చసొన పారేస్తున్నారా?



చాలామంది గుడ్డులోని తెల్లసొన మాత్రం తిని పచ్చసొన వదిలేస్తుంటారు. ఎందుకంటే పచ్చసొన మంచిది కాదేమోనని కొందరి అనుమానం. నిజానికి పచ్చసొన మీకు ఎటువంటి హానీ కలిగించదు. పైగా గుడ్డులోని తెల్లటి భాగాన్ని మాత్రమే తినడం వల్ల పచ్చసొనలో ఉండే ఎ, బి, ఇ, కె. విటమిన్లని పొందలేరు. పచ్చసొన తినకపోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం

పోషకాల లోపం

గుడ్డులోని పచ్చసొనలో కోలిన్ అనే పోషకం ఉంటుంది. ఇది చికెన్, చేపలు, బంగాళదుంపలు, బియ్యం వంటి వాటిలో కనిపిస్తుంది. పూర్తిగా ఉడికించిన గుడ్డులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే పచ్చసొనలో ఐరన్, జింక్ ఉంటాయి. మీరు దీనిని తినకపోతే ఈ పోషకాలు కోల్పోతారు.

రోగనిరోధక శక్తి కోల్పోవడం:

గుడ్లలో ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎసెన్షియల్ మినరల్స్, అమినో యాసిడ్స్, విటమిన్ డి, బి12 ఉంటాయి. అనేక అధ్యయనాల ప్రకారం గుడ్లు తినడం వల్ల శక్తి పెరుగుతుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. కళ్లను సురక్షితంగా ఉంచడమే కాకుండా చర్మం, జుట్టుకి కూడా మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయి ఎక్కువగా ఉన్న చాలామంది వ్యక్తులు గుడ్డులోని పసుపు భాగాన్ని తినకుండా వదిలేస్తారు. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో డైటరీ కొలెస్ట్రాల్ ఉంటుంది. దాదాపు ఒక గుడ్డులో 187 మి.గ్రా. కొలెస్ట్రాల్ ఉంటుంది. అయితే ఇది ఎప్పుడూ తీసుకునే మటన్, ఐస్ క్రీం వంటి ఆహార పదార్థాలతో పోలిస్తే తక్కువే. ఇలాంటి పరిస్థితులలో గుడ్డులోని పసుపుభాగం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఒకటి తెలుసుకోవాలి.. ప్రకృతి మనకు గుడ్డులో తెల్లసొన, పచ్చసొన కలిపే ఇచ్చింది. అంటే కలిపే తినమని అర్థం. కాబట్టి అది మంచిది కాదేమోననే అనుమానంతో దానిని వేరు చేయాల్సిన అవసరం లేదు.

సినిమా



● ప్రభాస్

సలార్ వాయిదా?

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్' తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు గతంలో యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ సినిమా విడుదల వాయిదా పడిందనే టాక్ వినిపిస్తోంది. డిసెంబరు లేదా జనవరిలో విడుదల చేసే ఆలోచనలో ఉందట చిత్రం యూనిట్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న 'సలార్'లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తండ్రీకొడుకులుగా ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటించారు.

పాపే ప్రాణం

కథను కీలక మలుపు తిప్పే 'కీ' రోల్స్ దాదాపు ప్రతి సినిమాలోనూ ఉంటాయి. ఈ కీ రోల్స్‌కి ఏజ్‌తో సంబంధం ఉండదు. చిన్నారులు కూడా కథలో పెద్ద మార్పుకు కారణం అవుతుంటారు. 'ఆర్ఆర్ఆర్', 'బింబిసార' వంటి సినిమాల్లో చిన్ని పాపలు కథకు ప్రాణంగా నిలిచారు. ఇలా 'పాపే ప్రాణం' అంటూ సాగే కథలతో రానున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.



● సైంధవ్ పోస్టర్



● చిరంజీవి

సంరక్షకుడు?

'పసివాడి ప్రాణం, జగదేకవీరుడు అతిలోకసుందరి, అంజి'... వంటి సినిమాల్లో చిన్నారులతో చిరంజీవి చేసిన అల్లరి సన్నివేశాలు, అదే సమయంలో వారి ప్రాణ రక్షకుడుగా చేసిన సాహసాలు ప్రేక్షకులను అలరించాయి. మళ్లీ వెండితెరపై ఓ పాపకు సంరక్షకుడిగా ఉండే పాత్రలో చిరంజీవి నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌ను బట్టి ఇది సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ చిత్రంలో ఓ పాప కీలక పాత్రలో నటించనుందని, ఈ పాప సంరక్షకుడిగా చిరంజీవి చేసే సాహసాలు అబ్బురపరచేలా ఉంటాయని టాక్. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్ ఆరంభించి, వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో యూనిట్ ఉందని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... వశిష్ఠ దర్శకుడిగా పరిచయం అయిన 'బింబిసార' చిత్రంలో ఓ పాప సెంట్రల్ క్యారెక్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

హార్ట్ ఆఫ్ సైంధవ్

శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా.. ఇలా ముచ్చటగా ముగ్గురు హీరోయిన్లు ఉన్నా కూడా హీరో 'సైంధవ్' మనసులో తొలి స్థానం చిన్నారి సారాదే. సారా అంటే 'హార్ట్ ఆఫ్ సైంధవ్' అన్నమాట. వెంకటేశ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఈ సైంధవ్ సినిమాకు 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సైంధవ్ హార్ట్ సారా అని చిత్ర యూనిట్ అంటోందంటే కథలో చిన్నారి సారా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని ఊహించవచ్చు. తమిళ నటుడు ఆర్య, హిందీ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలు చేస్తున్న 'సైంధవ్' చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది.

హాయ్ నాన్న

తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో తెలుగులో రూపొందుతున్న మరో చిత్రం 'హాయ్ నాన్న'. ఈ ఎమోషనల్ మూవీలో నాని హీరోగా నటిస్తున్నారు. 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రకథ ఓ పాప పాత్ర చుట్టూ తిరుగుతుందని, ఈ క్రమంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని తెలుస్తోంది. 'హాయ్ నాన్న' డిసెంబరు 21న రిలీజ్ కానుంది.



● 'హాయ్ నాన్న' పోస్టర్

గరుడ సాహసాలు

'గరుడ' సినిమా పోస్టర్ చూశారుగా.. సత్యదేవ్ వీపుపై కూర్చున్న ఓ చిన్నారి ఎంత భయంగా చూస్తుందో కదా! పైగా అది అడవి ప్రాంతం. ఆ చిన్నారి భయాన్ని పోగొట్టి, తనను సురక్షితంగా గరుడ ఎలా రక్షించాడనేది వెండితెర పైనే చూడాలంటోంది యూనిట్. సత్యదేవ్ హీరోగా క్రాంతి బాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గరుడ'. సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో సాగే అడ్వంచరస్ మూవీగా ఈ చిత్రం ఉంటుందట. ఈ చిత్రం తొలి భాగం 'గరుడ: చాప్టర్ 1' త్వరలోనే రిలీజ్ కానుంది.



● 'గరుడ' పోస్టర్

ఇలా చిన్నారులు కీలకంగా నిలిచే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

ఏక్ దమ్ స్టెప్పులు

ఏక్ దమ్ ఎనర్జీతో స్టెప్పులేశారు రవితేజ. స్టువర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. రవితేజ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. వంశీ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'ఏక్ దమ్... ఏక్ దమ్' అంటూ జోష్‌గా సాగే పాట లిరికల్ వీడియోను ఈ నెల 5న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. నూపుర్ సనన్‌ను రవితేజ ఆటపట్టించే సందర్భంలో ఈ పాట వస్తుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.



● రవితేజ, నూపుర్

క్లైమాక్స్ బాగుంటే హిట్టే
- శివ నిర్వాణ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఖుషి'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శివ నిర్వాణ మాట్లాడుతూ– ''శాస్త్రాలు, సిద్ధాంతాలు వేరు కావొచ్చు. కానీ ఎవరు ఏది నమ్మినా నమ్మకున్నా మనం మనల్ని ప్రేమించే మనుషులతో కలిసి ఉండాలని 'ఖుషి'లో చెప్పాం. క్లైమాక్స్ బాగుందని ప్రశంసలు వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. క్లైమాక్స్ బాగుంటే సినిమా హిట్టే.. ఫెయిల్ అయిన చరిత్ర లేదు'' అన్నారు. ''షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయని రిపోర్ట్స్ వస్తున్నాయి. 'ఖుషి' మంచి మూవీ కాబట్టి అవార్డులూ రావొచ్చు'' అన్నారు నవీన్. ''కథని నమ్మి 'ఖుషి'ని నిర్మించాం. మా నమ్మకానికి తగ్గట్టు ఫలితాలు సానుకూలంగా వస్తున్నాయి'' అన్నారు వై. రవిశంకర్. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్, సినిమాటోగ్రాఫర్ మురళి, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి పాల్గొన్నారు.



● హేషమ్, రవిశంకర్, శివ నిర్వాణ, నవీన్

అందుకే తెలుగువారంటే ఇష్టం
- సోనూ సూద్



● ఎండీ ఆసిఫ్ జాని, సోనూ సూద్

''నేను హిందీ సినిమాలు వదిలేసి తెలుగు సినిమాలు చేస్తున్నప్పుడు చాలా మంది 'ఎందుకు తెలుగు సినిమాలే చేస్తున్నారు?' అని అడిగారు. నన్ను నటుణ్ణి చేసింది, క్రమశిక్షణ నేర్పింది తెలుగు సినిమా. అందుకే తెలుగువారన్నా, తెలుగు సినిమా అన్నా నాకు ఇష్టమని చెప్పాను'' అని నటుడు సోనూ సూద్ అన్నారు. నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ చౌదరి, ఐశర్య ఉల్లింగాల, పులి సీత, విజయ, శ్రీయాంక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. శివ కల్యాణ్ దర్శకత్వంలో ఎండీ ఆసిఫ్ జాని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అతిథిగా పాల్గొన్న సోనూ సూద్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే మంచి కథ ఉందని తెలుస్తోంది. మంచి హిట్ అయి, వచ్చే ఏడాది పార్ట్ 2, పార్ట్ 3 కూడా తీయాలి'' అన్నారు. ''తుపాకులగూడెం అనే గ్రామంలో విష్ణు.. ఈశ్వర.. బ్రహ్మ అనే ముగ్గురు పాత్రల చుట్టూ ఈ కథ నడుస్తుంది'' అన్నారు శివ కల్యాణ్. ''మంచి కథతో రూపొందిన మా 'తురుమ్ ఖాన్‌లు' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు ఎండీ ఆసిఫ్ జాని. శ్రీరామ్ నిమ్మల, అవినాష్ చౌదరి తదితరులు మాట్లాడారు.


కామెడీ.. థ్రిల్



● పరుచూరి సుదర్శన్

పరుచూరి సుదర్శన్, శ్రీ జంటగా రవికిషోర్ బాబు చందిన దర్శకత్వంలో ఓ కామెడీ థ్రిల్లర్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ సినిమాకు 'రూమర్స్ డిస్ట్రాయ్ లైఫ్స్' అనేది ఉపశీర్షిక. యస్. పాండు రంగారావు, కోయ చిన్నరెడ్డయ్య నిర్మిస్తున్న చిత్రం ఇది. శనివారం సుదర్శన్ బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. యోగి, దొరబాబు, జబర్దస్త్ రాజమౌళి, జబర్దస్త్ బాబి, సునీతా మోహన్, రాజేశ్వరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య.

ప్రేమదేశంలో..



● విరాట్, ప్రియాంక, యామిన్

''ఎంతో కష్టపడితే దర్శకుడిగా 'ప్రేమదేశపు యువరాణి'తో తొలి చాన్స్ వచ్చింది. సినిమా బ్లాక్‌బస్టర్ అయిందా లేదా అన్నది కాదు.. నిర్మాతకు డబ్బులొస్తే అదే పెద్ద సక్సెస్'' అని సాయి సునీల్ నిమ్మల అన్నారు. యామిన్ రాజ్, విరాట్ కార్తీక్, ప్రియాంక రేవ్రి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ప్రేమదేశపు యువరాణి'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథులుగా హాజరైన నటులు అరవింద్ కృష్ణ, శివారెడ్డి మాట్లాడుతూ– ''ఈ చిత్రం ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. సినిమా హిట్టవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు, డ్రామా ఉన్నాయి'' అన్నారు యామిన్ రాజ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 556	నిఫ్టీ ▲ 182
65,387	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,010	▼	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▼	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత) 59,251	▲	4
వెండి (కిలో) 74,838	▼	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	103.01	106.40
€	యూరో	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	60.21	62.17
SAR	సౌదీ రియాల్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	21.62	23.42
¥	చైనా యువాన్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రైట ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవ స్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. "ఎయిరిండియాలో టాటా ఎస్‌ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్ట్‌లో ఆల్‌టైమ్ 'రయ్'!




న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్‌ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- "2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టీ20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలన వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరి పెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**



కుమారుడితో ఇస్నర్



ప్రైవేటు స్కూలు ఫీజుల వివరాలు వెబ్‌లో ఉంచాలి

- ఫీజుల నిర్ధారణకు ప్రతిస్కూలులోనూ కమిటీ ఏర్పాటు చేయాలి
- ఉత్తర్వులు విడుదల చేసిన విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు స్కూళ్లల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులు పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకు సంబంధించి శుక్రవారం కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. 1994లో వచ్చిన జీవో 1లో ఉన్న నిబంధనలే దాదాపు పొందు పర్చినప్పటికీ, ప్రైవేటు స్కూళ్ళు వసూలు చేసే ఫీజులను సంబంధిత స్కూల్ వెబ్‌సైట్‌లో అందిరికీ అందుబాటులో ఉంచాలని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ ఫీజుల వివరాలను విద్యాశాఖకు పంపించాలని పేర్కొన్నారు. ప్రైవేటు స్కూళ్ళ ఫీజుల నిర్ధారణకు ప్రతి స్కూలులోనూ కమిటీ ఏర్పాటు చేయాలని, ఇందులో విద్యా సంస్థ నిర్వాహకుడు లేదా కరస్పాండెంట్ అధ్యక్షుడుగా ఉండాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల్లో ఒకరు, పేరెంట్స్ ఆ కమిటీలో సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు.

ఏడాదిలో మూడుసార్లు కమిటీ సమావేశమవ్వాలి

ఈ తరహాలో ఏర్పడిన పాలక మండలి ఏడాదిలో మూడు సార్లు సమావేశమై, పాఠశాల ఆర్థిక వ్యవహారాలను సమీక్షించాలని సూచించారు. ఏడాదిలో స్కూల్ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి చేసే ఖర్చును ఆడిట్ చేయించి, ఈ వ్యయం ఆధారంగా ఫీజులు వసూలు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం ఫీజులో యాజమాన్య ఆదాయం 5 శాతం, స్కూల్ నిర్వహణకు 15 శాతం, పాఠశాల అభివృద్ధికి 15 శాతం, ఉపాధ్యాయుల జీతాలకు 50 శాతం, పాఠశాల ఉద్యోగుల గ్రాట్యుటీ, పీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి వాటికి 15 శాతం వసూలు చేసేందుకు వీలు కల్పించారు. పాఠశాల ఆదాయ వ్యయ వివరాలను విధిగా గుర్తింపు కలిగిన ఆడిటర్ చేత ఆడిట్ చేయించి, విద్యాశాఖకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఐఎంఏ రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా కిరణ్ మాదల



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ శాఖ ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్‌గా డాక్టర్ కిరణ్ మాదల నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సెకండ్ ఏఎన్‌ఎంలతో చర్చలు సఫలం

- డిమాండ్ల అమలు సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటుకు అంగీకారం
- ఈ మేరకు ఉత్తర్వులు వెలువడగానే సమ్మె విరమిస్తామని సెకండ్ ఏఎన్ఎంల హామీ

సాక్షి, హైదరాబాద్: సర్వీస్ క్రమబద్ధీకరణ, వేతనాల స్థిరీకరణ తదితర డిమాండ్లతో గత నెల 15 నుంచి సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి. ఇప్పటికే పలుమార్లు వారితో చర్చించిన ప్రభుత్వం శుక్రవారం మరోసారి వారిని చర్చలకు ఆహ్వానించింది. ఈ భేటీకి ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఆర్‌టీయూ తదితర సంఘాల నాయకులు, సెకండ్ ఏఎన్ఎంల ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో సెకండ్ ఏఎన్ఎంలకు మంచి వేతనాలను చెల్లిస్తూ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్న విషయాన్ని ప్రతినిధులకు గుర్తుచేసినట్లు ఆయన తెలిపారు. సమ్మె వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను వారికి వివరించినట్లు చెప్పారు. డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తున్నందున సమ్మె విరమించి విధుల్లో చేరాలని వారికి సూచించామన్నారు. డిమాండ్ల అమలుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా అందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు శ్రీనివాసరావు చెప్పారు. ఈ విషయాన్ని సెకండ్ ఏఎన్ఎంలకు వివరించి సమ్మె విరమించాలని కోరగా వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ నెల 4 నాటికి కమిటీ వేస్తూ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అయితే ఆయా అంశాలపై ప్రభుత్వం జీవో విడుదల చేసే వరకు సమ్మె కొనసాగుతుందని ఏఐటీయూసీ నేత నరసింహ పేర్కొన్నారు.

పని తక్కువ.. షో ఎక్కువ!

పనిలో నిమగ్నమయ్యే కొందరు.. హడావుడి చేసే మరికొందరు

వివిధ దేశాల్లో 18వేల మంది ఐటీ ఉద్యోగులపై 'స్లాక్' అధ్యయనం

కంచర్ల యాదగిరిరెడ్డి



ప్రతి ఆఫీసులో రెండు రకాల ఉద్యోగులు ఉంటారు.. పనిలో ఆనందం పొందాలనుకునే వారు కొందరైతే.. పనిచేస్తున్నట్టుగా హడావుడి (షో) చేసేవాళ్లు ఇంకొందరు.

ఎవరు ఏమిటన్నది తెలుసుకోవడం కొంచెం కష్టమైన పనే.. కానీ ఐటీ కంపెనీల్లో ఇలాంటి వారిని గుర్తించేందుకు ఈ–కమ్యూనికేషన్ టెక్ కంపెనీ 'స్లాక్' ఒక అధ్యయనం చేసింది. ఆశ్చర్యకరమైన ఫలితాలను ప్రకటించింది.

మన దేశంలో ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో షో చేసేవాళ్లు 43 శాతందాకా ఉన్నారని వెల్లడైనట్టు తేల్చి చెప్పింది. అంటే ప్రతి వంద మందిలో 57 మంది చక్కగా పనిచేసుకుంటూంటే.. మిగతా వారు చేసేపనికన్నా ఎక్కువగా 'షో' చేస్తున్నారని అభిప్రాయపడింది. ఇక్కడే కాదు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లోని కంపెనీల్లో ఇలాంటి ఉద్యోగులు గణనీయంగానే ఉన్నారని పేర్కొంది.

షో రాయుళ్ల శాతం ఇదీ..

'షో' చేసేవారు	దేశం
43%	ఇండియా
37%	జపాన్
36%	సింగపూర్
31%	ఫ్రాన్స్
30%	యూకే
29%	ఆస్ట్రేలియా, జర్మనీ
28%	అమెరికా, ద.కొరియా

(స్లాక్ అధ్యయనం ప్రకారం..)

18వేల మందిని ప్రశ్నించి..

ఆఫీసుల్లో సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు వినియోగించే అప్లికేషన్ 'స్లాక్'. వాట్సాప్, మెసెంజర్, సిగ్నల్ మాదిరిగానే ఉంటుంది. కానీ ఇది ఆఫీసు బృందాలకు మాత్రమే పరిమితం. అయితే ఉద్యోగుల్లో పనిచేసేవాళ్లు, చేస్తున్నట్టు నటించే/హడావుడి చేసేవారిని గుర్తించేందుకు స్లాక్ సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒక అధ్యయనం చేపట్టింది. వివిధ దేశాల్లోని ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న 18వేల మందిని రకరకాల ప్రశ్నలు వేసి.. వారు ఏ రకానికి చెందినవారో తెలుసుకునే ప్రయత్నం చేసింది. తాజాగా ఆ అధ్యయనం నివేదికను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలతో పోలిస్తే ఇండియా, జపాన్, సింగపూర్ వంటి ఆసియా దేశాల్లో పనిచేస్తున్న వారిలో 'షో' చేసేవారే ఎక్కువని పేర్కొంది.ఇండియాలో 43 శాతం, జపాన్‌లో 37 శాతం, సింగపూర్‌లో 36 శాతం ఇలాంటి ఉద్యోగులు ఉన్నారని తెలిపింది. కానీ ఆసియాలో భాగమే అయినా దక్షిణ కొరియాలో మాత్రం దాదాపు 72 శాతం మంది ఒళ్లు వంచి బుద్ధిగా పనిచేస్తున్నారని పేర్కొంది. యూరప్, అమెరికాలలో హడావుడి చేసే ఉద్యోగులు కొంత తక్కువగా ఉన్నట్టు వెల్లడించింది.

ఉద్యోగులు ఏమంటున్నారు?

స్లాక్ సర్వే ప్రకారం.. పలువురు ఐటీ ఉద్యోగులు తమ పనితీరును లెక్కగట్టే విధానంలో మార్పులు రావాలని కోరుకుంటున్నారు. కేవలం ఆన్‌లైన్ స్టేటస్, ఈ–మెయిళ్లకు ఇచ్చిన సమాధానాలు వంటివాటిపై మాత్రమే కాకుండా.. పనికి సంబంధించి మేనేజర్లతో మాట్లాడిన సందర్భాలు, ఏదైనా పని పూర్తి చేసేందుకు పట్టిన గంటలు వంటివాటి ఆధారంగా పనితీరును మదింపు చేయాలని అంటున్నారు. కోవిడ్ సమయంలో మాదిరిగా రిమోట్ వర్కింగ్ లాంటి పద్ధతులే మేలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది పనివేళలు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని కోరుకుంటే.. ఇష్టమైన చోట పనిచేసే అవకాశం ఉండాలని 36శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ఆఫీసుల్లో ప్రోత్సాహకాలు భిన్నంగా ఉండాలని, కార్యాలయాల్లో వసతులు పెరగాలని 32శాతం మంది భావిస్తే.. వర్క్ ఫ్రం హోమ్ కాకుండా మళ్లీ ఆఫీసులకు వచ్చి పనిచేయడంపై నిర్ణయం తీసుకోవాలని మరికొందరు ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.
- ఆఫీసులలో ఒకరిద్దరు కాకుండా బృందాలుగా పనిచేయాలని, బృందంగా మేధోమథనం చేయడం ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు.
- సహోద్యోగులతో కలివిడిగా ఉండవచ్చునని, నాలుగు మాటలు మాట్లాడుకోవచ్చని తెలిస్తేనే మళ్లీ ఆఫీసులకు వెళతామని మైక్రోసాఫ్ట్ నిర్వహించిన ఒక అధ్యయనంలో 84శాతం మంది ఉద్యోగులు చెప్పడం గమనార్హం.

పని చేయకున్నా 'ఆన్‌లైన్'

కొందరు ఉద్యోగులు తాము పెద్దగా పనేమీ చేయకపోయినా యాక్టివ్‌గా ఉన్నామని చూపుకొనేందుకు ప్రయత్నిస్తుంటారని స్లాక్ అధ్యయనం వెల్లడించింది. ఇలాంటి 63 శాతం మంది ఉద్యోగులు యాప్స్‌లో తమ స్టేటస్ 'ఆన్‌లైన్' అని ఉండేలా చూసుకునేందుకు ప్రయత్నిస్తారని పేర్కొంది.

మీటింగ్‌లతోనే సరి!

తమకు మీటింగ్‌లలో, ఈ–మెయిళ్లకు సమాధానాలు ఇవ్వడంతోనే రోజంతా గడచిపోతోందని.. దీనివల్ల తాము ఉత్పాదకత ఎక్కువగా ఉండే పనులు చేయలేకపోతున్నామని సింగపూర్ ఉద్యోగుల్లో 44 శాతం మంది పేర్కొన్నట్టు స్లాక్ అధ్యయనం వెల్లడించింది.


స్లాక్ ఏమంటోంది?


ఒక ఐటీ కంపెనీ ఉద్యోగి పనితీరును, ఉత్పాదకతను అంచనా వేసేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్రమాణాలు విజిబిలిటీ, యాక్టివిటీ అని రెండు రకాలు. ఉద్యోగి ఆన్‌లైన్‌లో ఎన్ని గంటలు ఉన్నాడు? ఎన్ని ఈ–మెయిళ్లు పంపాడు? వంటి వివరాల ఆధారంగా 27శాతం మేనేజర్లు ఉత్పాదకతను నిర్ణయిస్తుంటారని స్లాక్ సర్వే చెప్తోంది. ఉద్యోగులు అసలు పనిలో ఉత్పాదకత ఎంత పెంచారనేది మేనేజర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని స్లాక్ టెక్నాలజీ ఎవాంజలిస్ట్ డెరెన్ లానే పేర్కొన్నారు. ఫలితాలను బట్టి కాకుండా, కంటికి కనిపించే అంశాల ఆధారంగా ఉత్పాదకతను నిర్ణయిస్తే.. ఆ కంపెనీ ఉద్యోగులు పనిచేస్తున్నట్టు నటించేందుకే ఇష్టపడతారని చెప్పారు. ఈ తీరువల్ల ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందని.. పనితో సంబంధం లేకుండా ఆఫీసుల్లో ఎక్కువ సమయం గడపడం, వచ్చిన ఈ–మెయిళ్లకు వెంటనే సమాధానాలు చెప్పడంలో బిజీగా మారిపోతున్నారని, లేదంటే అవసరమున్నా లేకపోయినా అన్ని మీటింగ్‌లకూ హాజరవుతున్నారని స్లాక్ అధ్యయనంలో తేలిందని వివరించారు.



విఠలాచార్య సినిమాల్లో మాంత్రికుడి గుహల్లో ఉండే విచిత్రాకారాన్ని తలపిస్తున్నట్లు ఉంది కదూ.. అయితే, నిజానికిదో చేప.. పేరు అట్లాంటిక్ స్టార్‌గేజర్. ఇసుకలో దాక్కుని.. కేవలం కళ్లు, మూతి బయటపెట్టి.. ఎర కోసం ఇలా ఎదురుచూస్తుంటుంది. ఇంతకీ విషయమేమిటంటే.. ఈ ఏడాది వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారానికి 95 దేశాల నుంచి ఎంట్రీలు రాగా.. తుది జాబితాకు ఎంపికైన చిత్రాల వివరాలను వెల్లడించారు. అందులో ఈ ఫొటో కూడా ఒకటి. ఫొటోగ్రాఫర్ పిట్రో ఫార్మిస్ క్రొయేషియాలో ఈ చిత్రాన్ని క్లిక్‌మనిపించారు. లండన్‌కు చెందిన నేచురల్ హిస్టరీ మ్యూజియం ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తోంది.

టుడేస్ గ్రాఫిక్





ఒకటి రెండు కాదు.. లక్షలు, కోట్ల కొద్దీ కొత్త నక్షత్రాలు పుట్టుకొస్తున్న 'మెస్సియర్ 51' నక్షత్ర సమూహం (గెలాక్సీ) చిత్రమిది. పెద్ద ఎత్తున ఖగోళ పదార్థాలు, వాయువులు, ధూళి మేఘాలతో నిండిపోయి సుడి గుండంలా కనిపిస్తున్న ఈ గెలాక్సీని ప్రఖ్యాత జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా చిత్రీకరించింది. ఈ ఫొటోలను యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ విడుదల చేసింది. భూమికి సుమారు మూడు కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ గెలాక్సీపై పరిశోధన చేయడం ద్వారా నక్షత్రాలు ఎలా ఏర్పడుతాయి? ఇందులో గురుత్వాకర్షణ, ఇతర శక్తుల ప్రభావం ఏమేర ఉంటుందన్నది తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

గుడ్ బ్యాంక్.. రూపాయి కూడా దొరకలేదు

- నెన్నెల తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు ఓ దొంగ కితాబు
- ఖాళీగా కనిపించిన క్యాష్‌కౌంటర్.. తెరుచుకోని స్ట్రాంగ్‌రూం



నెన్నెల: ఓ ఆగంతకుడు ఆశగా అర్ధరాత్రి బ్యాంకులో చొరబడ్డాడు. ఆబగా నగదు కోసం వెతికాడు. క్యాష్‌కౌంటరేమో ఖాళీగా కనిపించింది. స్ట్రాంగ్‌రూం తాళం యమా స్ట్రాంగ్‌గా ఉండటంతో తెరుచుకోలేదు. ఎక్కడ వెతికినా ఏమీ దొరకలేదు. ఆనక చేసేదేమీలేక 'గుడ్ బ్యాంక్.. ఒక్క రూపాయి కూడా దొరకలేదు'అని కితాబు ఇస్తూ ఓ పేపర్‌పై రాసి వెళ్లిపోయాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో చోటు చేసుకుంది. ముసుగు వేసుకుని గురువారం అర్ధరాత్రి దొంగతనానికి వచ్చిన ఓ దుండగుడు బ్యాంకు తలుపు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించాడు. క్యాష్ కౌంటర్‌లో చిల్లిగవ్వ కూడా లభించలేదు. ఎంత ప్రయత్నించినా స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరుచుకోలేదు. ఇలా 15 నిమిషాలు బ్యాంకులో ఉండి చోరీకి యత్నించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పోతుపోతూ టేబుల్‌పై ఉన్న ఓ పేపర్ మీద 'గుడ్ బ్యాంకు, రూపాయి కూడా దొరకలేదు. నన్ను పట్టుకోవద్దు. నా ఫింగర్‌ప్రింట్ కూడా దొరకదు'అని మార్కర్‌తో రాశాడు. శుక్రవారం ఉదయం బ్యాంకు ఆవరణలో ఊడ్చేందుకు వచ్చిన స్వీపర్ రాములు బ్యాంక్ తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డికి సమాచారం ఇచ్చాడు. మేనేజర్ వెంటనే బ్యాంకుకు చేరుకుని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకు నగదు చోరీ కాకపోవడంతో సిబ్బంది, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య బ్యాంక్‌ను సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.



సీతారెడ్డికి సీఎం అభినందన

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యురాలిగా నియమితులైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. భర్త రంజిత్‌రెడ్డి, కుమారుడు రాజ్‌ఆర్యన్‌రెడ్డితో కలిసి ప్రగతి భవన్‌కు వెళ్లిన సీతారెడ్డి మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆమెను సన్మానించారు. –చేవెళ్ల

అక్టోబర్ 15 నుంచి ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రులు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో విశేషమైన అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాలలో అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక ఆర్జిత సేవల వివరాలను దేవస్థానం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో అమ్మవారికి ఖడ్గమాలార్చనను ప్రత్యేక సేవగా నిర్వహించాలని నిర్ణయించారు. 16 నుంచి 23 వరకు అందుబాటులో ఉండే ఈ సేవ కోసం ఉభయదాతలు రూ.5,116 చెల్లించాల్సి ఉంటుంది.ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధర రూ.3 వేలు కాగా, మూలా నక్షత్రం రోజున ఈ ధరను రూ.5 వేలుగా నిర్ణయించారు. దసరా ఉత్సవాలలో అన్ని పూజలను పరోక్షంగా కూడా జరిపించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పూజల వివరాల కోసం భక్తులు దేవస్థాన టోల్ ఫ్రీ నంబర్ 18004259099కు చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

మొదట్లో భూకబ్జాలు.. సెటిల్‌మెంట్లు ఆపై మోసాలు...బెదిరింపులు

ఇదీ ఫిల్మ్ ఫైనాన్షియర్ క్రైమ్ స్టోరీ

రెండు తెలుగు రాష్ట్రాల్లో 25 కేసులు ● డ్రగ్ పార్టీల నిర్వహణలోనూ కీలకపాత్ర ● వెంకటరత్నారెడ్డికి ఘనమైన నేరచరిత్ర

సాక్షి, హైదరాబాద్: మొదట్లో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు చేశాడు.. అవి సెట్ కాలేదు...దీంతో ఐఆర్‌ఎస్ అధికారి అవతారం ఎత్తి సినీ ప్రొడ్యూసర్లను బెదిరించాడు.. చివరకు వ్యభిచారదందా కూడా నిర్వహించాడు.. మోసాలు, బెదిరింపులకు లెక్కేలేదు. మాదాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో రేవ్‌పార్టీ నిర్వహిస్తూ గురువారం తెలంగాణస్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు (టీఎస్–నాబ్) చిక్కిన ఫిల్మ్ ఫైనాన్షియర్ కారుమూరి వెంకటరత్నారెడ్డి అలియాస్ వెంకటరమణారెడ్డి ఘనచరిత్ర ఇది. ఇతడితోసహా చిక్కిన ముగ్గురిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన గుడిమల్కాపూర్ పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. గుంటూరులోని నెహ్రూనగర్‌కు చెందిన వెంకటరత్నారెడ్డి డిగ్రీ కూడా పూర్తి చేయలేదు. చేసేందుకు ఏ ఉద్యోగమూ దొరకలేదు. దీంతో బతుకుతెరువుకు స్నేహితులతో కలిసి భవన శిథిలాల తొలగింపు వ్యాపారంలోకి దిగాడు. అందులోనూ నష్టాలు రావడంతో మోసాలు చేసి డబ్బు దండుకోవాలని పథకం వేశాడు.



వెంకటరత్నారెడ్డి

నకిలీ ఐఆర్‌ఎస్ అధికారిగా అవతారమెత్తి..

నకిలీ ఐఆర్‌ఎస్ అధికారి అవతారం ఎత్తిన వెంకటరత్నారెడ్డి ఆ పేరుతో సినీ నిర్మాతలు సి.కల్యాణ్, రమేష్‌ల నుంచి రూ.30 లక్షలు వసూలు చేశాడు. దీనిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. తిరుమలలో దర్శనానికి కేవీ.రత్నారెడ్డి పేరుతో ఐఆర్‌ఎస్ అధికారిగా నకిలీ గుర్తింపుకార్డు తయారు చేసుకున్నాడు. దీని ఆధారంగా తనతో సహా 9 మందికి బ్రేక్ దర్శనం టిక్కెట్లు ఇవ్వాలని దరఖాస్తు చేసి చిక్కాడు. ఓ ఐఆర్‌ఎస్ అధికారిణిని వివాహం చేసుకొని మోసం చేసిన ఆరోపణలు ఉన్నాయి.

ఎన్నారై మహిళలను టార్గెట్ చేసి..

ఎన్నారై మహిళలను టార్గెట్‌గా చేసుకుని, తానూ ఎన్నారైనే అంటూ నమ్మబలికి పెళ్లి పేరుతో మోసాలకు తెరలేపాడు. భర్త నుంచి విడాకులు తీసుకుని అమెరికాలో ఉంటున్న నగరానికి చెందిన ఓ మహిళ భారత్‌మాట్రిమోనీలో ఇతగాడి ప్రొఫైల్ చూసి వివాహమాడింది. ఆమెతో పాటు అమెరికా వెళ్లిన వెంకట్ కేవలం 20 రోజులే కాపురం చేశాడు. ఆపై అత్యవసర పని ఉందని, ఆమె నుంచి రూ.20 లక్షలు తీసుకుని ఇక్కడకు వచ్చాడు.ఆ తర్వాత పత్తా లేకపోవడంతో ప్రొఫైల్‌ను ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసిన బాధితురాలి మేనమామ అతడికి నేరచరిత్ర ఉందని, తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు తెలుసుకున్నాడు. దీంతో ఆయన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేశారు. మరో ముగ్గురు ఎన్నారై మహిళలకు ఇతగాడు ఎర వేసినట్టు అప్పట్లో తేలింది. వెంకట్‌పై జూబ్లీహిల్స్ పరిధిలో వ్యభిచార కేసు కూడా ఉంది. విదేశీ మద్యం అక్రమఅమ్మకం, తాను గుంటూరు ఎస్పీ గన్‌మెన్ అని చెప్పి మోసం చేయడం, దొంగ పాస్‌పోర్టు పొందడం సహా ఇతడిపై ఏపీ, తెలంగాణల్లోని వివిధ ఠాణాల్లో 25 కేసులు నమోదయ్యాయి. వీటిలో కొన్ని రాజీ కాగా, మరికొన్ని వీగిపోయాయి. 10 కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

ఆ 18 మంది కోసం వేట ముమ్మరం

వెంకట్‌తోపాటు అరెస్టు అయిన బాలాజీ కాల్‌డేటాను పరిశీలించిన టీఎస్–నాబ్ అధికారులు 18 మంది డ్రగ్స్ వినియోగదారులను గుర్తించారు. విశాఖకు చెందిన రామ్‌తో పాటు బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమ్మోదిచికూడి ముగుముల్, ఇగ్వారే, థామస్ అన్హాల నుంచి వీరు డ్రగ్స్ ఖరీదు చేస్తున్నట్టు నిర్ధారించి గాలిస్తున్నారు. వీరి కస్టమర్లు రామ్‌చంద్, అర్జున్, రవి ఉప్పలపాటి, సుశాంత్‌రెడ్డి, ఇంద్రతేజ, కల్హర్‌రెడ్డి, సురేష్, రామ్‌కుమార్, ప్రణీత్, సందీప్, సూర్య, శ్వేత, కార్తిక్, నర్సింగ్, ఇటాచి, మహ్మద్‌అ జామ్, అమ్‌జద్‌ల కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వెంకట్ దగ్గర డ్రగ్స్ కొన్నవారిలో నటులు, ప్రముఖులున్నట్టు అనుమానిస్తున్న అధికారులు ఆరా తీస్తున్నారు. గతంలో ఇతగాడు ఏపీకి చెందిన ఓ ఎంపీ పేరు చెప్పి నగరంలో భారీ వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. సినీ, రాజకీయ ప్రముఖులను పార్టీలకు పిలిచి బురిడీ కొట్టించేవాడు. కొన్నాళ్లుగా ఫిల్మ్ ఫైనాన్షియర్ అవతారం ఎత్తి డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్నాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.